మన సమగ్ర
# ప్రజావాణి
తెలుగు డైలీ
RNI NO:TGTEL/25/A5443
MANA SAMAGRA PRAJAVANI TELUGU DAILY

| రాజన్న సిరిసిల్ల | ఆదివారం | 21.06.2026 | సంపుటి : 01 | సంచిక : 166 | పేజీలు : 12 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| RAJANNA SIRICILLA | SUNDAY | 21.06.2026 | Volume : 01 | Issue : 166 | Pages : 12 | Cost : 2/- |






## పబ్లిక్ హెల్త్ క్యాపిటల్‌గా
# తెలంగాణ

● ఆరోగ్యమే అభివృద్ధికి అసలైన సూచిక ● పేదలకు అండగా నిలవడమే నిజమైన వైద్యం ● వైద్యం సామాన్యుడికి అందుబాటులో ఉండాలి ● వ్యాధి చికిత్స కంటే నివారణెళి మిన్న ● డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**హైదరాబాద్,జూన్ 20 :** ప్రజల ఆరోగ్యమే అత్యున్నతమైన అభివృద్ధికి అసలైన నిదర్శనమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఇండియా హెల్త్ సమిట్ లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వైద్య రంగ నిపుణులు, ప్రముఖ వైద్యులు, హాస్పిటల్స్, ఫార్మా, బయోటెక్నాలజీ, డిజిటల్ హెల్త్ రంగానికి చెందిన ప్రతినిధులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఆరోగ్యం అనేది కేవలం ఒక ప్రభుత్వానికి సంబంధించిన అంశం కాదన్నారు. ప్రతి ఒక్కరి ప్రాథమిక అవసరమని పేర్కొన్నారు. ఒక కుటుంబంలో ఎవరైనా అనారోగ్యానికి గురైతే ఆ కుటుంబం మొత్తం ఆర్థికంగా కుప్పకూలిపోతుందని, వారి జీవితాంతం దాచుకున్న పొదుపు మొత్తం ఒక్క క్షణంలో కరిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పేదవాడు ఎటువంటి భయం లేకుండా ఆసుపత్రిలో అడుగుపెట్టేలా తక్కువ ధరకు వైద్యం అందుబాటులో ఉండాలన్నారు. దేశం ఆర్థికంగా ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్న తరుణంలోనే తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఎయిమ్స్ వంటి ఉన్నతమైన వైద్య విద్యాసంస్థలను స్థాపించి మిగతా2లో...



## మెట్రో కోసం రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలుద్దాం

22,23 తేదీల్లో ఢిల్లీలోనే ఉంటానన్న సిఎం
వెంటనే కలిసి సమస్య పరిష్కారానికి కృషి చేద్దాం
కిషన్ రెడ్డికి బహిరంగ లేఖ రాసిన సిఎం రేవంత్

**హైదరాబాద్,జూన్ 20 :** హైదరాబాద్ మెట్రో రైలు రెండోదశ పొడిగింపు అంశంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరో బహిరంగ లేఖ రాశారు. మెట్రో పెండింగ్ అంశాల పరిష్కారానికి జోక్యం చేసుకోవాలని కిషన్ రెడ్డిని సీఎం రేవంత్ కోరారు. ఈ సందర్భంగా మిగతా2లో...

## ఒడిషాలో 47వేల కోట్లతో
# అభివృద్ధి పనులు

● రెండేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా మోడీ ప్రకటన
● రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కలసి ప్రారంభించిన ప్రధాని
● ముర్ము స్వగ్రామం పహాడ్‌పూర్‌ను సందర్శించిన మోడీ
● అభివృద్ధి చేసి సోలార్ విలేజ్‌గా మారుస్తామని ప్రకటన



**భువనేశ్వర్,జూన్ 20 :** ఒడిషా రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఒడిశాలోని మయూర్‌భంజ్‌లో జరిగిన 'వికాస్ రా ధారా, ఒడిశా సారా' బహిరంగ సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒడిశా సర్వతోముఖాభివృద్ధి కోసం దాదాపు రూ.47,000 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు రాష్ట్రపతి మిగతా2లో...

## శాంతి ఒప్పందం వేళ
# మళ్లీ పీటముడి

- హర్మూజ్ మూసేస్తున్నట్లు ఇరాన్ ప్రకటన


2లో

# బాల్య వివాహాలు లేని తెలంగాణ కోసం కృషి

- బాలలహక్కుల పరిరక్షణ కమిటీ కృషి చేయాలి
- సమీక్షా సమావేశంలో మంత్రి సీతక్క సూచన



**హైదరాబాద్,జూన్ 20 :** తెలంగాణను బాల్య వివాహ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలని మంత్రి సీతక్క సూచించారు. అలాగే పిల్లల రక్షణ చర్యలను మరింత బలోపేతం చేయడం, పిల్లలపై జరుగుతున్న దుర్వినియోగం మరియు పోక్సో కేసులను తగ్గించేందుకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆధ్వర్యంలో మిషన్ వాత్సల్య మరియు సక్షమ్ అంగన్‌వాడీ కార్యక్రమాలపై రాష్ట్ర స్థాయి మిగతా2లో...

## మూసీ నిర్వాసితులకు ముందు
# న్యాయం చేయండి


- ప్రభుత్వానికి బిజెపి అధ్యక్షుడు రామచంద్రరావు డిమాండ్



**హైదరాబాద్,జూన్ 20 :** మూసీ పునరుద్ధరణకు భాజపా వ్యతిరేకం కాదని ఆ పార్టీ తెలంగాణ అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. బాధితులకు న్యాయం చేశాక, ప్రాజెక్టు పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణశాఖ అనుమతి ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రముఖ పారిశ్రామికవేత్త ఫణికుమార్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన సందర్భంగా మిగతా2లో...

# పీఎం కిసాన్ డబ్బులు విడుదల

రూ. 2,000 చొప్పన 18,880 కోట్లు జమ
హుగ్లీ జిల్లాలో విడుదల చేసిన ప్రధాని నరేంద్ర మోదీ



**కోల్‌కతా,జూన్ 20 :** పీఎం కిసాన్ డబ్బులు విడుదలయ్యాయి. ప్రధాని 23వ విడత నిధులను విడుదల చేశారు. ఈ విడత ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న 9.44 కోట్ల మందికి పైగా అర్హులైన రైతు కుటుంబాల ఖాతాల్లోకి రూ. 2,000 చొప్పున మొత్తం రూ. 18,880 కోట్లు నేరుగా జమయ్యాయి. రైతులకు పెట్టుబడి మిగతా2లో...

## రైతు బంధు ప్రభుత్వం పోయి రాబందు
# ప్రభుత్వం వచ్చింది : కేటీఆర్



**బోథ్,జూన్ 20 :** రాష్ట్ర ప్రభుత్వం పంటలు రైతుల నుంచి కోటాకు మించి కొనుగోలు చేయబోమన్న నిర్ణయంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా మండిపడ్డారు. బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పండిన ప్రతి గింజ కూడా కొన్నదని.. పంటలు కొనబోమని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న మిగతా2లో...

## ఆత్మవిశ్వాసంతో పరీక్షకు
# హాజరు కండి

● ఎలాంటి ఒత్తిడికి గురికావదందన్న సిఎం రేవంత్ ● నీట్ పరీక్ష సందర్భంగా విద్యార్థులకు శుభాకాంక్షలు


2లో

## రాజన్నసిరిసిల్ల జిల్లాలో ప్రైవేట్ స్కూళ్ల
# 'అక్షర' దోపిడీ!

- నిబంధనలు బేఖాతరు
- పాఠశాలల ప్రాంగణాల్లోనే యథేచ్ఛగా పాఠ్యపుస్తకాలు, యూనిఫారాల విక్రయాలు
- కమీషన్ల కక్కుర్తితో ప్రైవేట్ పబ్లిషర్లతో యాజమాన్యాల కుమ్మక్కు..
- రూ.2 వేల సెట్‌ను రూ.10 వేలకుపైగా విక్రయం!
- తల్లిదండ్రులపై 'మా వద్దే కొనాలి' అంటూ ఒత్తిడి
- ప్రేక్షక పాత్రలో జిల్లా విద్యాశాఖ అధికారులు?





**సిరిసిల్ల బ్యూరో, జూన్ 20:** రాజన్న సిరిసిల్ల జిల్లాలో కొత్త విద్యాసంవత్సరం ప్రారంభ వేళ ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల అక్రమ వ్యాపార దందా పతాక స్థాయికి చేరిం దనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చుకున్న కొన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ పాఠశాల ప్రాంగణాల్లోనే పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, మిగతా12లో...

# ఖతార్ పాలకుల ఔదార్యం

● ట్రంప్‌కు 747 జంబో జెట్ గిఫ్ట్
● ఆవిష్కరించిన అమెరికా అధ్యక్షుడు

**వాషింగ్టన్,జూన్ 20 :** ఖతార్ పాలకులు తనకు గిఫ్ట్‌గా ఇచ్చిన 747 జంబో జెట్ విమానాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆవిష్కరించారు. ఇకనుంచి ట్రంప్ కొంతకాలం పాటు ఇందులోనే ప్రయాణాలు చేయనున్నారు. ఈ విమానాన్ని ఆయన 'ఎగిరే వైట్‌హౌస్'గా అభివర్ణించారు. జాయింట్ బేస్ ఆండ్రూస్‌లో శుక్రవారం ఈ విమానం ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఇది ప్రపంచంలోనే అత్యంత విలాసవంతమైన విమానం అని ట్రంప్ పేర్కొన్నారు. ఇందులోని ఇంటీరియర్ డిజైన్, ఇంజిన్ల నాణ్యత అద్భుతంగా ఉన్నాయని ప్రశంసించారు. ఇది ఎయిర్‌ఫోర్స్ వన్ కంటే మిగతా2లో...



# ఒడిషాలో 47వేల కోట్లతో అభివృద్ధి పనులు

(మొదటి పేజీ తరువాయి)

ద్రౌపది ముర్మ్, ప్రధాని మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్మ్ జన్మదినం రోజే ఈ కార్యక్రమం జరగడం విశేషం. రాష్ట్రపతి ద్రౌపది ముర్మ్ జన్మదినం సందర్భంగా ఆమె స్వగ్రామమైన పహాడ్‌పూర్‌ను ప్రధాని మోదీ సందర్శించారు. ఈ గ్రామాన్ని వేగంగా అభివృద్ధి చేసి 'సోలార్ విలేజ్'గా మారుస్తామని ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామంలోని ప్రతి ఇంటికీ సౌరశక్తి అందుతుంది. ఒడిశాలోని ప్రసిద్ధ కోణార్క్ సూర్య దేవాలయానికి ఉన్న గుర్తింపు తరహాలోనే, పహాడ్‌పూర్ గ్రామం కూడా ప్రపంచపటంలో పునరుత్పాదక ఇంధన కేంద్రంగా సరికొత్త గుర్తింపును పొందుతుందని ప్రధాని పేర్కొన్నారు. ఒడిశాలోని సహజ వనరులను ఆర్థిక అవకాశాలుగా మార్చడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ప్రధాని తెలిపారు. రాష్ట్రంలో భారీగా పారిశ్రామిక వృద్ధి జరుగుతోందని, అంతర్జాతీయ, దేశీయ పెట్టుబడిదారులను ఆకర్షించడంలో 'ఉత్కర్ష్ ఒడిశా' ప్రచారం కీలక పాత్ర పోషిస్తోందని ఆయన కొనియాడారు. కొత్త పరిశ్రమల స్థాపన ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. గిరిజన యువతకు మెరుగైన విద్య, ఉపాధి అవకాశాలను అందించడం ద్వారా వారిని సాధికారత వైపు నడిపించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మోదీ పునరుద్ఘాటించారు. గిరిజన పిల్లలకు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించేందుకు దేశవ్యాప్తంగా సుమారు 500 ఏకలవ్య మోడల్ స్కూళ్లను ప్రారంభించామని తెలిపారు. అంతకుముందు రాష్ట్రపతి ద్రౌపది ముర్మ్, ప్రధాని నరేంద్ర మోదీ కలిసి పహాడ్‌పూర్ గ్రామంలోని 'సంతాలీ జాహిరా', 'హో జాహిరా' అనే పవిత్ర వనాలలో సంప్రదాయ పూజలు, ఆచారాలు నిర్వహించి దేశ శ్రేయస్సు కోసం ప్రార్థించారు. ప్రస్తుతం ఒడిశాలో పండుగ వాతావరణం నెలకొందని, గత వారమే 'గాన్ పర్వా' పండుగను ఘనంగా జరుపుకున్నారని, అలాగే జగన్నాథ రథయాత్ర, బరిపడ రథయాత్ర ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయని ఈ సందర్భంగా ప్రధాని గుర్తుచేశారు. ఈ ఉత్సవాల మధ్య 'ప్రజాస్వామ్యం, అభివృద్ధి' అనే పండుగ కూడా ఇక్కడ నడుస్తోందని ఆయన హర్షం వ్యక్తం చేశారు.

# ఆత్మవిశ్వాసంతో పరీక్షకు హాజరు కండి

**హైదరాబాద్,జూన్ 20** : నీట్ పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులందరికీ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం పునర్నిర్వహిస్తున్న ఈ పరీక్షలో విద్యార్థులు ఎలాంటి ఆందోళనలకు, ఒత్తిళ్లకు గురికాకుండా పూర్తి ఆత్మవిశ్వాసంతో, ప్రశాంతంగా పరీక్ష రాయాలని ఆకాంక్షించారు. ఈ మేరకు సీఎం ఓ ప్రకటన విడుదల చేశారు. వైద్య విద్యలో ప్రవేశానికి ముఖ్యమైన ఈ పరీక్ష కోసం విద్యార్థులు ఎంతోకాలంగా కృషి చేశారని పేర్కొన్నారు. తమ శ్రమ, పట్టుదలపై నమ్మకం ఉంచి అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని సూచించారు. దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న నీట్ పరీక్షకు సంబంధించి తెలంగాణలో సుమారు 208 పరీక్షా కేంద్రాల్లో దాదాపు 2.95 లక్షల మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. విద్యార్థుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించిన విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. విద్యార్థులు చివరి నిమిషం వరకు వేచి ఉండకుండా ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, పరీక్షా నిబంధనలను పాటిస్తూ ప్రశాంతమైన మనసుతో పరీక్ష రాయాలని సూచించారు. విద్యార్థులందరూ తమ లక్ష్యాలను సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు.



# పబ్లిక్ హెల్త్ క్యాపిటల్‌గా తెలంగాణ

(మొదటి పేజీ తరువాయి)

దేశానికి ఒక దిశను చూపించారన్నారు. పేద దేశంలో వైద్యం అనేది విలాసంగా మారకూడదనే ఉద్దేశంతో ఆనాడు పునాది వేశారన్నారు. అదేవిధంగా 1975లో ఇందిరా గాంధీ గారు తీసుకొచ్చిన సమగ్ర శిశు అభివృద్ధి సేవల పథకాన్ని గుర్తు చేశారు. రాజీవ్ గాంధీ హయాంలో తీసుకొచ్చిన యూనివర్సల్ ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్ ద్వారా దేశవ్యాప్తంగా వ్యాక్సినేషన్ ప్రక్రియను ఒక ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లారన్నారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ గారి నాయకత్వంలో వచ్చిన జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్, ఆశా వర్కర్ల వ్యవస్థ గ్రామీణ ఆరోగ్య ముఖచిత్రాన్ని మార్చివేసిందని గుర్తుచేశారు. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర రెడ్డి గారు ప్రవేశపెట్టిన 'ఆరోగ్యశ్రీ' పథకం పేదవాడి ఆరోగ్యానికి భరోసా ఇచ్చిందన్నారు. పేదరికం కారణంగా ఏ ఒక్కరూ చావుకు దగ్గర కాకూడదని కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతానికి నిదర్శనమని అన్నారు. రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఉచిత వైద్య సాయం అందిస్తూ, గుండె, కిడ్నీ వంటి ఖరీదైన జబ్బులకు సైతం పేదవాడు ధైర్యంగా కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందేలా ఈ పథకం అండగా నిలిచిందన్నారు. వైద్య రంగంలో వస్తున్న టెక్నాలజీ, టెలిమెడిసిన్, సరికొత్త పరికరాలు కేవలం కార్పొరేట్ వర్గాలకే పరిమితం కాకుండా అట్టడుగు వర్గాలకు సైతం అందాలని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. నాయకత్వం అనేది ఒక సర్టిఫికేట్ కాదు, అదొక బాధ్యత అని వ్యాఖ్యానిస్తూ, సైన్స్ అనేది సామాన్యుడికి, టెక్నాలజీ అనేది పేదవాడికి సేవ చేయాలన్నారు. ప్రస్తుత వైద్య విధానం వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స అందించే 'ఇల్‌నెస్ కేర్' గా మాత్రమే ఉండిపోకూడదన్నారు. వ్యాధి రాకుండా ముందే నివారించే 'వెల్‌నెస్ కేర్' గా మారాలని ఉప ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ఐసీయూల కంటే వ్యాధి నివారణెళి అత్యంత చౌకైన మార్గమని ఆయన వ్యాఖ్యానించారు. తెలంగాణ నేడు దేశంలోనే పబ్లిక్ హెల్త్ క్యాపిటల్‌గా అవతరించిందని భట్టి విక్రమార్క ప్రకటించారు. రాష్ట్రంలోని జిల్లా ఆసుపత్రుల బలోపేతం, వైద్య విద్యాసంస్థల విస్తరణ, నర్సింగ్ మరియు పారామెడికల్ రంగాలను ప్రోత్సహించడం ద్వారా వైద్య రంగాన్ని ముందుకు తీసుకువెళు తున్నామని అన్నారు. వైద్య రంగంలో పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యం అనేది కేవలం వ్యాపార లాభాల కోసం కాకుండా, ప్రభుత్వ ఆశయాలకు ప్రైవేట్ రంగానికి ఉన్న నైపుణ్యాలను జోడించి ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించడానికే ఉపయోగపడాలని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. వచ్చే దశాబ్ద కాలంలో వైద్య రంగానికి అవసరమైన మానవ వనరులను, నైపుణ్యాలను అందించడానికి తెలంగాణ పూర్తిగా సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం ప్రకటించారు. హైదరాబాద్‌లో ఉన్న బలమైన ఫార్మాస్యూటికల్ బేస్, మెడికల్ డివైజెస్ పార్క్, ఐటీ టాలెంట్ మరియు ప్రభుత్వ అండదండల వల్ల తెలంగాణ ప్రపంచంలోనే మెడికల్ ఎక్సలెన్స్ ఇకోసిస్టమ్‌కు కేంద్రంగా మారిందన్నారు. ఇక్కడి నుంచే భారతదేశానికి, ప్రపంచానికి ఉపయోగపడే సరికొత్త హెల్త్ కేర్ ప్రొటోకాల్స్, డయాగ్నోస్టిక్స్ మరియు డిజిటల్ ప్లాట్‌ఫార్మ్‌లు రూపుదిద్దుకోవాలని ఆకాంక్షించారు.

# రైతు బంధు ప్రభుత్వం పోయి రాబందు ప్రభుత్వం వచ్చింది : కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

నిర్ణయం వెనక్కి తీసుకునే దాకా పోరాటం చేస్తామనన్నారు. 15 రోజుల కింద ప్రతి గింజ కొంటానన్న రేవంత్ రెడ్డి ఇప్పుడు మాట మార్చిండు. ఇక రైతన్నల పంటలు కొనబోమని క్యాబినెట్ సమావేశం పెట్టి మరి నిర్ణయం తీసుకున్నారు. ఇకపై కేంద్రం నిర్ణయించిన నెలకే కొంటాము కాంగ్రెస్ ప్రభుత్వం పంటలు అదనంగా కొనబోదని చెప్పిందన్నారు. కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయాన్ని ప్రతీ రైతన్న దగ్గరికి ప్రతి గ్రామానికి తీసుకుపోవాలని పార్టీ శ్రేణులకు కేటీఆర్ పిలుపునిచ్చారు.మంత్రులంతా ప్రత్యేకంగా క్యాబినెట్ సమావేశం పెట్టుకొని రైతన్నలకు శాపం లాంటి ఒక నిర్ణయం తీసుకున్నారు. ఇకపైన తెలంగాణలో పంటలు కొనబోమని రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయం మొత్తం రైతాంగానికి శాపంగా మారబోతోందని కేటీఆర్ స్పష్టం చేశారు. ఇకపై ప్రభుత్వం ఇక్కడి నుంచి గింజలు కొనదట, వడ్లు కొనదట. రైతులు పండించే జొన్నలు, శనగలు కూడా కొనదట. మోదీ ప్రభుత్వం ఎంత కొనమంటే అంతే కొంటారట. అంటే ఎకరానికి 40 క్వింటాళ్ల వడ్లు పండించినా, రేపు మోదీ ప్రభుత్వం కోటా 10 క్వింటాళ్లే అని చెబితే, అంతే కొనుగోలు చేస్తారట. **కాంగ్రెస్ నాయకులను నిలదీయాలి..** మిగిలిన 30 క్వింటాళ్లు బయట అమ్ముకోవాల్సి వస్తుంది. నిన్న ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఇదే. నేను రైతులకు ఒకటే పిలుపు ఇస్తున్నాను.. అధికారులపై కాంగ్రెస్ నాయకుల కాళ్లు పట్టుకోవాల్సిన అవసరం లేదు. కాంగ్రెస్ నాయకులను నిలదీయాలి. మీరు ప్రకటించిన బోనస్ ఎక్కడ పోయిందని అడగాలి. మీరు హామీ ఇచ్చిన కొనుగోలు కేంద్రాలు ఎక్కడికి పోయాయని ప్రశ్నించాలి.మీ ప్రభుత్వ అసమర్థత వల్ల రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఎందుకు వచ్చిందని నిలదీయాలని కేటీఆర్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.రైతుల పంటలు కొనబోమన్న రేవంత్ రెడ్డిని మేము వదిలిపెట్టమని హెచ్చరించారు. 15 రోజుల క్రితం నువ్వే కదా 'చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం' అని చెప్పింది. ఈరోజు ఏమైంది..? 'మోదీ మెడలు వంచుతా, చివరి గింజ వరకు కొనుగోలు చేస్తా' అని గొప్పలు చెప్పావు. ఇప్పుడు ఎందుకు వెనక్కి తగ్గుతున్నావు..? అని కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు ఎనిమిది మంది ఎంపీలు ఉన్నారు. ఆదిలాబాద్‌లో కూడా బీజేపీ ఎంపీ ఉన్నారు.

రాష్ట్ర ప్రభుత్వానికి ఎంత బాధ్యత ఉందో, ఈ 16 మంది ఎంపీలకు కూడా అంతే బాధ్యత ఉంది. కేసీఆర్ ప్రభుత్వం ఉన్న సమయంలో కూడా మోదీ ప్రభుత్వం "మేము వడ్లు కొనము" అని చెప్పినప్పుడు, మొత్తం మంత్రివర్గంతో కలిసి మేమంతా ఢిల్లీకి వెళ్లామన్నారు. కేసీఆర్‌తోపాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు అందరం ధర్నా చేసి, కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి, వడ్లు కొనుగోలు చేసేలా చేసిన నాయకుడు కేసీఆర్ అన్నారు.ఈరోజు ఉన్న 8 మంది కాంగ్రెస్ ఎంపీలు, 8 మంది బీజేపీ ఎంపీలు కూడా తమ బాధ్యతను గుర్తించాలి.



# పరేడ్ గ్రౌండ్ యోగాలో పాల్గొన్న ప్రముఖులు

**హైదరాబాద్,జూన్20**:అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో పెద్ద ఎత్తున యోగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భారీగా ప్రజలు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు హాజరయ్యారు. తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ఎంపీలు ఈటల రాజేందర్, లక్ష్మణ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, సినీ నటులు నవీన్ పోలిశెట్టి, డింపుల్ హయాతి తదితరులు పాల్గొని యోగా సాధన చేశారు. ఏటా మాదిరిగానే యోగా కార్యక్రమం నిర్వహించినట్టు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. నిత్యం యోగా చేయడం వల్ల రుగ్మతల బారిన పడకుండా ఉండొచ్చని తెలిపారు.

# పీఎం కిసాన్ డబ్బులు విడుదల

(మొదటి పేజీ తరువాయి)

సాయం అందించేందుకు కేంద్రం అమలు చేస్తున్న పీఎం- కిసాన్నిధులు విడుదలయ్యాయి. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లాలో జరిగిన కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ నిధులను విడుదల చేశారు. 23వ విడత కింద ఒక్కో రైతు ఖాతాలో రూ.2 వేలు చొప్పున జమ అయ్యాయి. దీంతో దేశవ్యాప్తంగా 9.44 కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూరింది. కేందప్రభుత్వం 2019లో పీఎం-కిసాన్ పథకాన్ని ప్రారంభించింది. ఏటా మూడు దఫాలుగా రూ.2 వేలు చొప్పున మొత్తంగా రూ.6వేలను రైతుల ఖాతాల్లో వేస్తున్నారు. పీఎం కిసాన్ నిధులు పొందే వారి జాబితాలో మీ పేరుందో లేదో తెలుసుకోవచ్చు. ఇందుకోసం పీఎం కిసాన్ వెబ్‌సైట్‌లోకి వెళ్లిఅందులో 'ఫార్మర్ కార్నర్' సెక్షన్‌లోకి వెళ్లాలి. అందులో లబ్ధిదారుల లిస్ట్‌పై క్లిక్ చేస్తే రాష్ట్రం, జిల్లా, బ్లాక్, గ్రామం ఎంచుకుంటే లబ్ధిదారుల జాబితా కనిపిస్తుంది. అందులో

# శాంతి ఒప్పందం వేళ మళ్లీ పీటముడి

**టెహ్రాన్,జూన్ 20**:అమెరికా- ఇరాన్ మధ్య శాంతి ఒప్పందంతో పశ్చిమాసియాలో పరిస్థితులు కుదుటపడుతున్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది.హర్మూజ్ జలసంధిని మళ్లీ మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. లెబనాన్‌పై ఇజ్రాయెల్ నిరంతరం భీకర దాడులు చేస్తుండటాన్ని తీవ్రంగా తప్పుబట్టింది. అమెరికా, ఇజ్రాయెల్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిన కారణంగా తాజాగా హర్మూజ్ మూసివేత నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఇది తమ ప్రతిస్పందనలో మొదటి అడుగు అని, దురాక్రమణ ఇలాగే కొనసాగితే మరిన్ని చర్యలు ఉంటాయని హెచ్చరించింది. ఇరాన్ సంయుక్త సైనిక విభాగ కేంద్రమైన ఖతమ్-అల్ అన్బియా ప్రకటిం చినట్లు అక్కడి అధికారిక మీడియా పేర్కొంది.నౌకలు జలసంధి వైపు రావద్దని.. అలా వస్తే వాటి భద్రతకు ముప్పు వాటిల్లుతుందని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఎఖీఉఅ) స్పష్టం చేసింది. ఏదైనా ఒప్పందం అమలు దశలోకి వచ్చినప్పుడు మాత్రమే అన్ని విషయాలు తెలుస్తాయని పేర్కొంది. ఇదే సమయంలో, మధ్యంతర ఒప్పందంపై అమెరికాతో చర్చలు జరిపేందుకు స్విట్జర్లాండ్‌కు తమ బృందం వెళ్తున్నట్లు ఇరాన్ వెల్లడించింది. మరోవైపు, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా త్వరలోనే స్విస్‌కు వెళ్లనున్నట్లు సమాచారం. సాంకేతిక అంశాలపై రెండు దేశాలు చర్చలు జరిపేందుకు శుక్రవారమే అక్కడకు వెళ్లాల్సి ఉన్నప్పటికీ.. అది వాయిదా పడిన విషయం తెలిసిందే.

# ఖతార్ పాలకుల ఔదార్యం

(మొదటి పేజీ తరువాయి)

వేగంగా.. ఎక్కువ దూరం ప్రయాణిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఖతార్ పాలకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జులై 4న జరగనున్న అమెరికా 250వ స్వాతంత్య్ర వేడుకల్లో నిర్వహించే విమానాల ప్రదర్శనల్లో ఈ విమానం కూడా పాల్గొనే అవకాశం ఉందని ట్రంప్ వెల్లడించారు. కాగా.. విమానం లోపల లెదర్ సీట్లు, గోల్డ్ షేడ్స్‌తో కూడిన లేత గోధుమ రంగు గోడలు ఉన్నట్లు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ఇప్పటివరకు 747- 200బి ఎయిర్‌ఫోర్స్ వన్ హోదాలో అమెరికా అధ్యక్షుడికి అధికారిక విమానంగా ఇది వ్యవహరించింది. జార్జ్ హెచ్‌డబ్ల్యూ బుష్ నుంచి ట్రంప్ వరకు ప్రతి అధ్యక్షుడికి ఈ పాత విమానమే సేవలందించింది. అధునాతన విమానం కాకపోయినా సౌకర్యవంతంగా ఉండేదని అమెరికా ప్రొటోకాల్ చీఫ్ మోనికా క్రౌలీ తెలిపారు. ప్రస్తుతం దీని ప్రస్థానం ముగిసింది. యూఎస్ వైమానిక దళం ఆర్డర్ చేసిన రెండు కొత్త బోయింగ్-747 విమానాలు అందేవరకు.. ఖతార్ నుంచి గిఫ్ట్‌గా వచ్చిన ఈ విమానాన్నే ట్రంప్ ప్రయాణాలకు వినియోగించనున్నారు.

# మెట్రో కోసం రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలుద్దాం

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్ మెట్రో విస్తరణకు కేంద్రం సహకారం కావాలని అన్నారు. మెట్రో ఫేజ్-2, ఎల్ అండ్ టి ఫైనాన్సింగ్‌పై చర్చకు సమావేశం ఏర్పాటు చేయాలని కేంద్రమంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. జూన్ 22, 23 తేదీల్లో తాను ఢిల్లీలో ఉంటానని, రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో భేటీకి సమయం కేటాయించాలని సీఎం రేవంత్ కోరారు. ఇద్దరం కలిసి రైల్వే మంత్రిని కలుద్దామని ప్రతిపాదించారు. సంబంధిత ఒప్పందాల పత్రాలతో సమావేశానికి హాజరవుతానని ముఖ్యమంత్రి చెప్పుకొచ్చారు. తెలంగాణకు హైదరాబాద్ మెట్రో కీలక మౌలిక వసతి ప్రాజెక్టని ఈ సందర్భంగా లేఖలో సీఎం పేర్కొన్నారు. దీనికి సంబంధించిన పెండింగ్ అంశాలకు త్వరితగతిన పరిష్కారం అవసరమని చెప్పుకొచ్చారు. కాగా, ఈనెల 16వ తేదీన కూడా హైదరాబాద్ మెట్రో రైలు అంశంపై కిషన్ రెడ్డికి రేవంత్ రెడ్డి లేఖ రాశారు. ఈ సందర్భంగా సమస్య పరిష్కారానికి ఏ మీటింగ్‌కైనా తాను సిద్ధమేనని రేవంత్ అన్నారు. రైల్వే మంత్రితో వీలైనంత త్వరగా సమావేశం ఏర్పాటు చేయించాలన్నారు. ఆ సమావేశానికి సంబంధించి కిషన్ రెడ్డి పిలుపు కోసం తాను ఎదురు చూస్తానని పేర్కొన్నారు. ఇందుకు ఆయనతో వ్యక్తిగత భేటీకీ సిద్ధమేనని సీఎం రేవంత్ చెప్పుకొచ్చారు.

# మూసీ నిర్వాసితులకు ముందు న్యాయం చేయండి

(మొదటి పేజీ తరువాయి)

ఆయన మాట్లాడారు. సింగరేణి స్కామ్ బయటపడుతుందనే కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని టార్గెట్ చేస్తున్నారని ఆరోపించారు. వర్గపోరు కారణంగానే ప్రాంతీయ పార్టీలు చీలిపోతున్నాయని వ్యాఖ్యానించారు. రాష్ట్రవ్యాప్తంగా కొన్ని స్కూళ్లలోనే పుస్తకాలు, యూనిఫాంలు ఇచ్చారు. కనీస మౌలిక సదుపాయాలు లేని బడులు లెక్కలేనన్ని ఉన్నాయి.

ప్రభుత్వ పాఠశాలల దుస్థితి ఎలా ఉందో రేవంత్‌రెడ్డి చూడాలి. ప్రైవేటు పాఠశాలలు ఎందుకు పెరుగుతున్నాయి? కేంద్రీయ విద్యాలయాలకు ఉన్న ఆదర ణ ప్రభుత్వ బడులకు ఎందుకు లేదు? బ్జడెట్‌లో విద్యారంగానికి కేటాయింపులు పెంచాలి. ఉస్మాని యా వర్సిటీకి రూ.వెయ్యి కోట్లు కేటాయిస్తామన్నారు. కానీ.. వర్సిటీల్లో కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదు. టీచర్లు, ప్రొఫెసర్లు హక్కుల గురించి మాట్లాడితే సస్పెండ్ చేస్తున్నారని ఆరోపించారు.

# బాల్య వివాహాలు లేని తెలంగాణ కోసం కృషి

(మొదటి పేజీ తరువాయి)

సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ గౌరవ అధ్యక్షురాలు సీతా దయాకర్ రెడ్డి అధ్యక్షత వహించారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా మరియు మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ ప్రభుత్వం మహిళలు మరియు పిల్లల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ పథకాల గురించి మంత్రి వివరించారు. బాల్య వివాహాలు ఇంకా కొన్ని ప్రాంతాల్లో జరుగుతున్నందున వాటిని నివారించాలన్నారు. శాఖలోని ప్రతి అధికారి మరియు సిబ్బంది వాటి నివారణకు కృషి చేసి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనితా రామచంద్రన్ సమావేశంలో పాల్గొని, మహిళలు మరియు పిల్లల సంక్షేమానికి సంబంధించిన విధానాలను సమర్థవంతంగా అమలు చేయడానికి అధికారులు తమ అత్యుత్తమ సామర్థ్యంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ సంయుక్త సంచాలకురాలు ఎన్. మోతి జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ అధికారులు , జిల్లా బాలల పరిరక్షణ అధికారులు, అలాగే తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ గౌరవ సభ్యులు మర్రిపల్లి చందన, బండి అపర్ణ గారు, కంచర్ల వందన గౌడ్ గారు, ప్రేమలత అగర్వాల్, గోగుల సరిత బుర్కా వచన్ కుమార్ పాల్గొన్నారు.

# ఉచిత విద్య, వైద్యమే టీఆర్ఎస్ లక్ష్యం: కవిత

(మొదటి పేజీ తరువాయి)

జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జయశంకర్ ఆశయ సాధన కోసం కృషి చేస్తామని కార్యకర్తలతో కలిసి నినాదాలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ అవినీతి పాలనను ఎండగడుతూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరించారు. టిఆర్ఎస్ ప్రధాన ప్రతిపక్షంగా ప్రజల సమస్యలపై పోరాడుతుందని, మహిళలకు నెలకు రూ.2500 ఆర్థిక సహాయం, ఆసరా పెన్షన్ల పెంపు వంటి హామీలను అమలు చేసే వరకు విశ్రమించేది లేదని స్పష్టం చేశారు. కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా, ప్రజలందరికీ నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం అందించాలనేదే తమ పార్టీ అత్యున్నత సంకల్పమని ఆమె పేర్కొన్నారు. ఒక ఆడబిడ్డగా తనను రాష్ట్ర ప్రజలందరూ ఆశీర్వదించి, ఆదరించాలని కవిత కోరారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తమ కొలువులు సర్కారులో - తమ పిల్లల చదువులు ప్రైవేటులో

- విద్య హక్కు.. వ్యాపారం కాదు!
- కార్పొరేట్ విద్యా దోపిడీపై కఠిన చర్యలు తీసుకోవాలి

**మంథని నియోజకవర్గం, జూన్ 20, ప్రజావాణి:** తెలుగు,ఆంగ్లంలోఅ, ఆ, లు,ఎబిసిడి లు నేర్చుకోవాలంటే మన రాష్ట్రంలో సంపన్నుల నుండి సామాన్యుల వరకు లక్షలాది రూపాయలు ఖర్చు చేయాల్సిన దుస్థితి నెలకొంది. రాష్ట్ర రాజధాని నుంచి జిల్లా కేంద్రాలు, పట్టణాలు, మండలాల వరకు "లక్షలు చెల్లిస్తేనే నాణ్యమైన విద్య" అన్న పరిస్థితి నెలకొనడం అత్యంత ఆందోళనకరం. విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చిన కార్పొరేట్ విద్యాసంస్థలు తల్లిదండ్రుల బలహీనతలను ఆసరాగా చేసుకుని భారీ దోపిడీకి పాల్పడుతున్నాయి. గత ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరి, ప్రస్తుత ప్రభుత్వ పర్యవేక్షణలో లోపాల కారణంగా రాష్ట్రంలో విద్యా వ్యాపారం పూర్తిగా అదుపు తప్పింది.

వ్యాపార వస్తువుగా విద్య!

నర్సరీ నుంచి పదో తరగతి వరకు పిల్లలను చదివించాలంటే మధ్యతరగతి, పేద కుటుంబాలు అప్పుల పాలవుతున్నాయి. ప్రతి ఏడాది విద్యాసంస్థలు 20శాతం నుంచి 50 శాతం వరకు ఫీజులు పెంచుతుండగా,ఇటీవల కొన్ని కార్పొరేట్ విద్యాసంస్థలు 100 శాతానికి పైగా ఫీజులు పెంచిన ఉదాహరణలు వెలుగులోకి రావడం పరిస్థితికి అద్దం పడుతుంది. విద్యార్థుల భవిష్యత్తును పెట్టుబడిగా మార్చి విద్యను పూర్తిగా వ్యాపార వస్తువుగా మార్చడం బాధాకరం. ప్రైవేట్ మరియు కార్పొరేట్ విద్యా సంస్థలు అడ్మిషన్ ఫీజు, డొనేషన్, బిల్డింగ్ ఫండ్, యాక్టివిటీ ఫీజు వంటి పేర్లతో తల్లిదండ్రులపై అదనపు భారం మోపుతు న్నాయి. పుస్తకాలు, యూనిఫాంలు, షూస్, టైలు, నోట్ బుక్స్ను నిర్దిష్ట దుకాణాల నుంచే కొనాలని బలవంతం చేస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నాయి. ప్రభుత్వం పుస్తకాల అమ్మ కాలపై నిషేధం విధించినప్పటికీ చాలా విద్యాసంస్థలు బహిరం గంగానే నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయి. తల్లిదండ్రులు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోకపోవడం మరింత దురదృష్టకరం. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్కూల్ ఫీజు రెగ్యులేటరీ అథారిటీ ఏర్పాటు చేసి ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజులను నియంత్రించాలి. యాజమాన్యాలు స్వేచ్ఛగా ఫీజులు పెంచకుండా చట్టబద్ధ నియం త్రణ తీసుకురావాలి.

తప్పుడు ర్యాంకులు ఫేక్ రిజల్ట్స్

ప్రతి విద్యాసంస్థ తమ ఫీజు నిర్మాణాన్ని ప్రజలకు వెల్ల డించడం తప్పనిసరి చేయాలి. డొనేషన్ల పేరుతో జరుగుతున్న దోపిడీని పూర్తిగా అరికట్టాలి. రాష్ట్రంలో అనుమతులు లేకుండా అనేక పాఠశాలలు, అకాడమీలు, ఇంటర్నేషనల్ స్కూల్స్ పేర్లతో విద్యాసంస్థలు నడుస్తున్నాయి. తప్పుడు ర్యాంకులు, ఫేక్ రిజల్ట్స్, ఆకర్షణీయ ప్రకటనలతో తల్లిదండ్రులను మోసం చేస్తూ అడ్మిషన్లు చేపడుతున్నాయి. సంవత్సరాలుగా గుర్తింపు లేకుండా పాఠశాలలు నడుస్తున్నా విద్యాశాఖఅధికారులు చర్యలు తీసుకోకపోవడం



వెనుక రాజకీయ ఒత్తిళ్లు, అవినీతి అనే ప్రజలు భావిస్తున్నారు.అనుమ తులు లేని పాఠశాలల్లో చదివే విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడితే బాధ్యత ఎవరు వహిస్తారనే ప్రశ్నకు సమాధానం లేదు.

ప్రభుత్వం తప్పనిసరిగా తీసుకోవలసిన చర్యలు:

1.ప్రభుత్వం వెంటనే రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు లేని పాఠశాలలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అక్రమంగా నడుస్తున్న విద్యాసంస్థలను మూసివేయాలి. 2. తప్పుడు ప్రకటనలు ఇచ్చే యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. 3. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతున్న యాజమా న్యాలను బ్లాక్ లిస్టులో పెట్టాలి. 4. అలాగే నిర్లక్ష్యంగా వ్యవహరించిన విద్యాశాఖ అధికారులపై శాఖా పరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. 5. గుర్తింపు పొందిన పాఠశాలల జాబితాను ప్రజలకు ఆన్లైన్లో అందుబాటులో ఉంచాలి. ప్రతి విద్యా సంవత్సర ప్రారంభంలో కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యను వ్యాపారంగా మార్చి భారీ దోపిడీకి పాల్పడుతున్నప్పటికీ ప్రభుత్వం సమర్థవంతమైన చర్యలు తీసుకోవడంలో విఫలమవుతోంది. కొంతమంది అధికారులు రాజకీయ నాయకులతో కుమ్మక్కై యాజమాన్యాలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, మహబూబ్నగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో పరిస్థితి మరింత అధ్వాన్నంగా ఉందనే అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది. ప్రభుత్వం జిల్లా వారీగా విద్యాశాఖ పనితీరుపై సమగ్ర విచారణ జరిపి అవినీతి, నిర్లక్ష్యానికి పాల్పడిన అధికారులను సస్పెండ్ చేసి కేసులు నమోదు చేయాలి. ఆర్ టి ఈ అమలుకు ప్రత్యేక శ్రద్ధ 1.విద్య హక్కు చట్టం (ఆర్ టి ఈ)ను రాష్ట్ర ప్రభుత్వం కచ్చితంగా అమలు చేయాలి. 2. ప్రైవేట్ పాఠశా లల్లో 25 శాతం ఉచిత సీట్లు పేద విద్యార్థులకు ఇవ్వడం తప్పని సరి చేయాలి. 3. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల పిల్లలకు పూర్తి ఫీజు రీయింబర్స్మెంట్ అమలు చేయాలి. 4. విద్యను అంకెల గారడీని నియంత్రించాలి:

ధనికులకు మాత్రమే పరిమితం చేసే పరిస్థితిని అరికట్టాలి. అంఖ్యల గారడిని నియంత్రించాలి. ఎల్ కే జి నుంచే పరీక్షలు, ర్యాంకులు, హోంవర్క్ పేరుతో చిన్నారులపై తీవ్రమైన మానసిక ఒత్తిడి పెరుగుతోంది. మార్కుల కోసం విద్యార్థులను వేధించే




విధానాలు పిల్లల్లో భయం, ఆందోళన, ఆత్మవిశ్వాస లోపానికి దారితీస్తున్నాయి. పాఠశాలల్లో కౌన్సెలింగ్ వ్యవస్థ ఏర్పాటు చేసి విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. చాలా ప్రైవేట్ పాఠశాలల్లో భద్రతా ప్రమాణాలు కూడా పూర్తిగా విస్మరించబడుతున్నాయి. అగ్నిమాపక సదుపాయాలు లేకపోవడం, స్కూల్ బస్సుల్లో నిబంధనలు పాటించకపోవడం, బాలల భద్రతపై నిర్లక్ష్యం ప్రాణాపాయ పరిస్థితులకు దారితీస్తోంది. ప్రతి పాఠశాలకు ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్, సీసీ కెమెరాలు, బాలల భద్రత కమిటీలు తప్పనిసరి చేయాలి.

కార్పొరేట్ దోపిడీని నిర్మూలించాలి:

కార్పొరేట్ విద్యాసంస్థలు ఉపాధ్యాయులను కూడా తీవ్రంగా దోపిడీ చేస్తున్నాయి. తక్కువ జీతాలు, అధిక పని ఒత్తిడి, ఉద్యోగ భద్రత లేకపోవడం వల్ల ఉపా ధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. కనీస వేతనాలు అమలు చేసి ఉపాధ్యాయుల హక్కులను రక్షించాలి. గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాలలు మూతపడే పరిస్థితి రావడం మరింత ఆందో ళనకరం. గ్రామీణ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత, మౌలిక సదుపాయాల లేమి, డిజిటల్ విద్య అందుబాటులో లేకపోవడం వల్ల పేద విద్యార్థులు నష్టపోతున్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి నాణ్యమైన విద్య అందించడమే ప్రైవేట్ విద్యా సంస్థల దోపిడీకి శాశ్వత పరిష్కారం. ఖాళీ ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేసి, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలి. ఈ విద్యా సంవత్సరంలో అయినా ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు ప్రజాఆకాంక్షలను గౌరవిస్తూ పనిచేయాలి. విద్యను వ్యాపార వస్తువుగా కాకుండా రాజ్యాంగబద్ధ హక్కుగా చూడాలి. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతున్న కార్పొరేట్ దోపిడీని అరికట్టి, పారదర్శకమైన, సమానత్వ పూర్వకమైన విద్యా వ్యవస్థను నిర్మించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. "విద్య అమ్మకానికి కాదు – ప్రతిపిల్లవాడి హక్కు" కార్పొరేట్ ఫీజుల విధానాన్ని నిర్మూలించి, న్యాయమైన విద్యను అందించడం ప్రభుత్వ బాధ్యత. ప్రతి సర్కారు వేతన జీవి తప్పనిసరిగా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించే విధంగా విధి విధానాలు రూపొందించి అమలు చేయాలి. అలాగే వార్డు సభ్యుల నుండి ముఖ్యమంత్రి వరకు ప్రజాప్రతినిధులు విధిగా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి.

# స్త్రీ నిధి రికవరీ, రుణాల పంపిణీ లక్ష్యాలను వేగంగా పూర్తి చేయాలి:

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి జూన్ 20** మన స్త్రీ నిధి' యాప్ వినియోగం తప్పనిసరి అవకతవకలకు పాల్పడే వీవోఏ లు, బకాయిలు చెల్లించని సంఘాలపై చర్యలు జూన్ నెలాఖరు నాటికి రికవరీ, క్రెడిట్ లక్ష్యాల్లో గణనీయ పురోగతి సాధించాలని ఆదేశం స్త్రీ నిధి రికవరీని వంద శాతానికి పెంచడంతో పాటు రుణాల పంపిణీ లక్ష్యాలను పూర్తిచేసే దిశగా అధికారులు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు.శనివారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన స్త్రీ నిధి జిల్లా సమీక్షా సమావేశంలో రికవరీ, రుణాల పంపిణీ, డిజిటల్ సేవల వినియోగం, సుస్థిర జీవనోపాధులు, ఆర్థిక క్రమశిక్షణ అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో స్త్రీ నిధి రుణాల చెల్లింపులు పూర్తిగా డిజిటల్ విధానంలో జరగాలని, అన్ని రికవరీలు 'మన స్త్రీ నిధి' యాప్ ద్వారానే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. లావాదేవీల్లో పారదర్శకత, వేగవంతమైన అడ్జస్ట్మెంట్, సమగ్ర సమాచార నిర్వహణ కోసం అన్ని స్థాయిల్లో యాప్ వినియోగాన్ని విస్తృతంగా అమలు చేయాలని తెలిపారు.అవకతవకలకు పాల్పడే వీఓఏల (వి వో ఏ ) వ్యవహారంపై ప్రత్యేక సమీక్ష నిర్వహించి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని



అధికారులను ఆదేశించారు. అలాగే రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించని స్వయం సహాయక సంఘాలపై అవసరమైతే రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం చర్యలు చేపట్టాలని సూచించారు. రికవరీతో పాటు ఇతర విధుల నిర్వహణలో స్త్రీ నిధి, సెర్ప్, మెప్మా సిబ్బందికి అన్ని స్థాయిల్లో పూర్తి సహకారం అందించాలని, విధుల నిర్వహణకు ఆటంకం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.జూన్ నెలాఖరు నాటికి జిల్లా రికవరీని 70 శాతానికి, క్రెడిట్ లక్ష్య సాధనను 30 శాతానికి పెంచేలా ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. జీవనోపాధి రుణాల మంజూరును పెంచడంతో పాటు జీరో రికవరీ సంఘాల సంఖ్యను సున్నాకు తీసుకురావాలని సూచించారు.జూలపల్లి, ఎలిగేడు, పాలకుర్తి, మంథని, ధర్మారం, సుల్తానాబాద్, ఓదెల, శ్రీరాంపూర్, పెద్దపల్లి మండలాల్లో రికవరీ



పనితీరును మెరుగుపరిచేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని అధికారులకు సూచించారు.జూన్ నెలాఖరు నాటికి గణనీయమైన పురోగతి సాధించేలా క్షేత్రస్థాయి సిబ్బంది కృషి చేయాలని పేర్కొన్నారు. మహిళల సుస్థిర జీవనోపాధుల అభివృద్ధికి స్త్రీ నిధి రుణాలను సమర్థవంతంగా వినియోగించేలా అన్ని శాఖల అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు.స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళల ఆర్థిక సాధికారతకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని, అదే సమయంలో ఆర్థిక క్రమశిక్షణ పాటించడం, సకాలంలో రుణాలు చెల్లించడం, క్షేత్రస్థాయి సిబ్బందికి పూర్తి సహకారం అందించడం ఎంతో అవసరమని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ సమావేశంలో డీఆర్డీఓ కాళిందిని, ఏడీఆర్డీఓ రవీందర్, స్త్రీ నిధి రీజినల్ మేనేజర్ దుర్గాప్రసాద్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు స్వప్న, కార్యదర్శి శోభా, కోశాధికారి జి. స్వప్న, జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు, వివిధ శాఖల అధికారులు, సెర్ప్, మెప్మా, స్త్రీ నిధి సిబ్బంది, జిల్లా సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు

## గాయత్రి విద్యానికేతన్‌లో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

**ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి, జూన్--20:** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పెద్దపల్లిలోని గాయత్రి విద్యానికేతన్‌లో శనివారం యోగా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు యోగా ప్రాముఖ్యతను వివరించి, యోగ సాధన వల్ల కలిగే శారీరక, మానసిక ప్రయోజనాలపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో యోగా గురువు, గాయత్రి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ సురేష్ ప్రత్యేక యోగా శిక్షణ నిర్వహించారు. విద్యార్థుల్లో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, క్రమశిక్షణ పెంపొందించడంతో పాటు శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంచేందుకు






ఉపయోగపడే పలు యోగాసనాలను ప్రదర్శించి వాటి విశిష్టతను వివరించారు.ప్రస్తుత కాలంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఒత్తిడిని తగ్గించుకోవడానికి, మానసిక ప్రశాంతతను పొందేందుకు అనుసరించాల్సిన యోగాసనాల గురించి కూడా అవగాహన కల్పించారు. విద్యార్థులు ఉత్సాహంగా, చురుకుగా యోగా సాధనలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా 8వ తరగతి విద్యార్థి సంపంగి ప్రవీణ్ తన అద్భుతమైన యోగ విన్యాసాలతో అందరినీ ఆకట్టుకుని ప్రత్యేక ప్రశంసలు అందుకున్నాడు.కార్యక్రమం అనంతరం విద్యార్థులు యోగ యొక్క విశిష్టతను తెలుసుకుని, ప్రతిరోజూ యోగ సాధన చేయాలని సంకల్పించారు.ఈ కార్యక్రమంలో గాయత్రి విద్యానికేతన్ కరస్పాండెంట్ శ్రీమతి రజనీ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీమతి ప్రియాంక, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## చిన్నారులను ఆశీర్వదించిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చందుపట్ల కీర్తి రెడ్డి



**ప్రజావాణి శాయంపేట** మండలం పెద్ద కోడెపాక గ్రామంలో భారతీయ జనతా పార్టీ కుటుంబ సభ్యులు మంద జ్యోతి -- సురేష్ దంపతుల కుమార్తెలు హారిక, సంజు శ్రీల నూతన వస్త్రాల పుష్పాలంకరణ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చందుపట్ల కీర్తి రెడ్డి హాజరై చిన్నారులను ఆశీర్వదించారుఈ సందర్భంగా చిన్నారులు హారిక, సంజు శ్రీలు విద్య, సంస్కారం, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో ఉన్నత స్థాయికి ఎదిగి, కుటుంబానికి మంచి పేరు తీసుకు రావాలని ఆకాంక్షిస్తూ వారికి ఆశీస్సులు అందజేశారు.వారి వెంట రాష్ట్ర నాయకులు రాయరాకుల మొగిలి , జిల్లా ఉపాధ్యక్షురాలు కోడపాక స్వరూప , శాయంపేట మండల అధ్యక్షులు నరహరిశెట్టి రామకృష్ణ , మండల కార్యదర్శి మేకల సుమన్ , నాయకులు ముల్కనూరు వెంకటేష్ , దినేష్ , మహేందర్ , సోషల్ మీడియా కన్వీనర్ ఎర్ర రాకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యవంతమైన జీవన విధానానికి సాధనం యోగా

**మంథని నియోజకవర్గం, జూన్ 20, ప్రజావాణి:** ఆరోగ్యవంతమైన జీవన విధానానికి యోగ ఒక సాధనం వంటిదని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంథని లో ఐక్యూ ఏసీ మరియు ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముందస్తు అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఉద్దేశించి కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ చాట్ల పరిషయ్య తెలియజేశారు. యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప జీవన విధానమని, ప్రతిరోజు యోగా సాధనం చేయడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో యోగా ఆసనాల సాధన ను అధ్యాపకులతో కలిసి విద్యార్థులు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్. లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ సతీష్, కృష్ణ, అధ్యాపకులు శేఖర్, బోధనేతర సిబ్బంది సుధాకర్, రాజు, దుర్గరాజు మరియు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.




## రామాపురం ఉద్యోగ మిత్ర మండలి ఆధ్వర్యంలో మండల విద్యాధికారికి సన్మానం





**చిలుకూరు జూన్ 20(ప్రజావాణి):** చిలుకూరు మండల విద్యాధికారిగా జిల్లా విద్యాశాఖాధికారి అశోక్ నుండి బాధ్యతలను స్వీకరించిన జడ్పీహెచ్ఎస్ రామాపురం గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు ఎన్జీ శివ కుమారిని రామాపురం ఉద్యోగ మిత్ర మండలి అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పాయిలి రమేష్, షేక్ జబ్బార్, ఉపాధ్యక్షులు ఆరె నాగరాజు, వేమూరి జానకిరామ్, తిపిరిశెట్టి యల్లయ్య, ఆరె బాబు,యం.పాపారావు ఇతర ఉద్యోగులు అభినందనలు తెలియజేసి ఈ సందర్భంగా ఉద్యోగ మిత్ర మండలి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించటం జరిగింది.

## దుబ్బాక నియోజకవర్గం అభివృద్ధి లక్ష్యం:దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

**ప్రజావాణిదుబ్బాక నియోజకవర్గం** దుబ్బాక మండలం హబ్సిపూర్ గ్రామంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.10 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు మరియు డ్రైనేజీ నిర్మాణ పనులకు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే రాష్ట్ర అభివృద్ధికి పునాది అని పేర్కొన్నారు. గ్రామ ప్రజలకు మెరుగైన రహదారులు, పారిశుద్ధ్య సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.హబ్సిపూర్ గ్రామంలో చేపడుతున్న ఈ సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులు పూర్తయితే గ్రామ ప్రజలకు రాకపోకల సౌకర్యం మెరుగుపడటంతో పాటు పారిశుద్ధ్య సమస్యలు కూడా తగ్గుతాయని తెలిపారు.గ్రామ అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు తమ వంతు కృషి నిరంతరం కొనసాగుతుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను గ్రామంలో చేపట్టేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు...



## గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై డివిజనల్ స్థాయి అవగాహన సదస్సు



**మంత్రి నియోజకవర్గం, జూన్ 20, ప్రజావాణి:** మంథని మండలంలోని సూరయ్యపల్లి గ్రామ రైతు వేదికలో ఎంపీడీవో అధ్యక్షతన గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జి పి డి పి)పై డివిజనల్ స్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయం నుంచి శేఖర్ హాజరై గ్రామపంచాయతీల అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో, ఎంపీవో, సీడీపీఓ, మండల వైద్యాధికారి, మండల విద్యాధికారి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్, సూరయ్యపల్లి సర్పంచ్ ఆర్ల నాగరాజు, మంథని మండల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మంతిని మండలంలో పలు గ్రామాలలో పర్యటించిన బిజెపి మంతని నియోజక వర్గ ఇన్చార్జి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

● చందుపట్ల సునీల్ రెడ్డి.



**మన ప్రజావాణి. మంతిని ప్రతినిధి.** మంతిని మండలంలో ని చిల్లపల్లి గ్రామంలో బిజెపి మంతిని మండల ఉపాధ్యక్షుడు ఆరె ఓదెలు సతీమణి ఆరె కోమల ఇటీవల మరణించగా వారి కుటుంబాన్ని బిజెపి మంతని నియోజక వర్గ ఇన్చార్జి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చందుపట్ల సునీల్ రెడ్డి పరామర్శించడం జరిగింది అలాగే కొమ్ము రాజమ్మ ఇటీవల మరణించగా వారి కుటుంబాన్ని కూడా పరామర్శించడం జరిగింది . గుంజపడుగు పంప్ హౌస్ మెగా కంపెనీలో పని చేసే కార్మికురాలు కట్ల రాధ ప్రమాదవశాత్తు కిందపడి గాయపడగా రాదని కలిసి ప్రమాద కారణాలు తెలుసుకొని మెగా కంపెనీ వారితో మాట్లాడడం జరిగింది ఈ కార్యక్రమంలో బిజెపి మంతని మండల అధ్యక్షుడు వీరబోయిన రాజేందర్ ఎలుక సదానందం చాంద్ పా షా కొమురయ్య మల్లేశ్వరి పాల్గొన్నారు

## వార్డు సందర్శనతో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

● డ్రైనేజీల్లో చెత్త వేస్తే కఠిన చర్యలు:

● మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్








**ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి, జూన్ 20:** పెద్దపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న నెల రోజుల వార్డు సందర్శన కార్యక్రమంలో భాగంగా శనివారం మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ 13వ, 31వ వార్డులను సందర్శించి స్థానిక ప్రజల సమస్యలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ఎమ్మెల్యే ఆదేశాల మేరకు చేపట్టిన వార్డు సందర్శన కార్యక్రమానికి కౌన్సిలర్లు, ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు. పట్టణంలో డ్రైనేజీల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త వేయడం వల్ల డ్రైన్లు మూసుకుపోయి వర్షాకాలంలో పారిశుద్ధ్య సమస్యలతో పాటు ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల ప్రజలు రోడ్లపై, డ్రైనేజీల్లో చెత్త వేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై మున్సిపల్ చట్టం--2019 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు .అలాగే జెండా చౌరస్తా వద్ద చిరు వ్యాపారులు తోపుడు బండ్లతో రహదారులను ఆక్రమించి వ్యాపారం చేయడం వల్ల ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. ప్రజల సౌకర్యార్థం రహదారుల ఆక్రమణలను నివారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, కౌన్సిలర్లు పాగాల శ్రీకాంత్, మంథని నర్సింగ్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రామచంద్రాపురం ఈఎస్ఐ ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీ

● మంత్రి వివేక్ వెంకటస్వామితో కలిసి పరిశీలించిన కాట శ్రీనివాస్ గౌడ్





**పటాన్‌చెరు, జూన్ 20 (ప్రజావాణి):** పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని రామచంద్రాపురం ఈఎస్ఐ ఆసుపత్రిని తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు మరియు భూగర్భ శాస్త్ర శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పటాన్‌చెరు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ మంత్రితో కలిసి ఆసుపత్రిని సందర్శించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, చికిత్సా విధానం, మౌలిక వసతులు, పారిశుద్ధ్య పరిస్థితులు, సిబ్బంది పనితీరు తదితర అంశాలను మంత్రి, కాట శ్రీనివాస్ గౌడ్ క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం వార్డుల్లోని రోగులతో మాట్లాడి, అందుతున్న వైద్య సేవలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ, రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వైద్యులు, అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. కాంగ్రెస్ నాయకుడు కాట శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, పటాన్‌చెరు ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని, ఆసుపత్రిలో అవసరమైన సదుపాయాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు.

## అడవిపదిరలో ఉచిత వైద్య శిబిరం



**వీర్నపల్లి జూన్ 20 మన ప్రజావాణి:** మండల పరిధిలోని అడవిపదిర గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో శనివారం రోజున గ్లోరియస్ గాస్పెల్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో స్థానిక గ్రామ పంచాయతీ పాలకవర్గం సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం (Free Medical Camp) అత్యంత విజయవంతంగా ముగిసింది.?ఈ శిబిరంలో గ్రామానికి విచ్చేసిన ప్రముఖ వైద్యురాలు డాక్టర్ శ్రీమతి ఫ్లోరెన్ ఫిలిప్ గ్రామ ప్రజలకు, వృద్ధులకు, మహిళలకు చిన్న పిల్లలకు క్షుణ్ణంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరానికి వచ్చిన రోగులకు ఉచితంగా బి.పి, షుగర్ పరీక్షలు చేయడంతో పాటు, వారికి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్, ఉప-సర్పంచ్, పాలకవర్గ సభ్యులు గ్రామ ప్రజల ఆరోగ్యం కొరకు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన గ్లోరియస్ గాస్పెల్ మినిస్ట్రీస్ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గ్రామంలోని నిరుపేదలు ఈ అవకాశాన్ని పెద్ద సంఖ్యలో ఉపయోగించుకొని లబ్ధి పొందారని హర్షం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో కూడా గ్రామస్తుల కోసం మరిన్ని సేవా కార్యక్రమాలు అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉప-సర్పంచ్, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, మినిస్ట్రీస్ ప్రతినిధులు గ్రామ పెద్దలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి

■ మహా పడి పూజలో పాల్గొన్న మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి.

■ అయ్యప్ప స్వామివారికి 50 తులాల వెండి సమర్పణ.

■ మెదక్ లో ఘనంగా అయ్యప్ప స్వామి రజతోత్సవాలు..





**ప్రజావాణిదుబ్బాక నియోజకవర్గం** అయ్యప్ప స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని మాజీ డిప్యూటీ స్పీకర్ యం.పద్మా దేవేందర్ రెడ్డి ఆకాంక్షించారు. మెదక్ పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో రజతోత్సవాలలో భాగంగా శనివారం నిర్వహించిన మహా పడి పూజ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మా దేవేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి, బిఆర్ఎస్ శ్రేణులతో కలిసి పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ మాధవ నంద స్వామి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా పద్మా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ. .మెదక్ అయ్యప్ప స్వామి దేవాలయంలో రజతోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించడం ఆనందదాయకమని అన్నారు. అయ్యప్ప స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. దేవాలయాలు ఆధ్యాత్మిక చింతనకు కేంద్రాలుగా నిలుస్తూ సమాజంలో ఐక్యత, సౌభ్రాతృత్వాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. అయ్యప్ప స్వామి మహా పడి పూజలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ఈ రజతోత్సవాల విజయవంతానికి కృషి చేస్తున్న అయ్యప్ప భక్త సేవా సమాజం సభ్యులను,భక్తులను అభినందించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామివారికి 50 తులాల వెండిని సమర్పించారు. అనంతరం ఆలయ అర్చకులు వైద్య రాజు పంతులు పద్మ దేవేందర్ రెడ్డి గారిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ ఉపాధ్యక్షురాలు యం. లావణ్య రెడ్డి,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లు బట్టి. జగపతి, కృష్ణారెడ్డి, పట్టణ పార్టీ కన్వీనర్ కౌన్సిలర్ మామిళ్ళ ఆంజనేయు లు, మున్సిపల్ కౌన్సిలర్ లు బట్టి ఉదయ్ కుమార్, మాయ. గంగామణి,నాయకులు లింగా రెడ్డి,మాయ మల్లేశం,కిష్టయ్య, సాయి, మోహన్ నాయక్, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అన్నం పెట్టే రైతుకే అన్యాయం:

● బీఆర్ఎస్ నేత దాసరి ఉష



**ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి, జూన్ 20:** తెలంగాణ రైతాంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరితో అన్నదాతల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని బీఆర్ఎస్ పార్టీ పెద్దపల్లి నియోజకవర్గ నాయకురాలు దాసరి ఉష ఆరోపించారు. పెద్దపల్లి నియోజకవర్గంలోని స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడుతున్నామని తెలిపారు. ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించిందని విమర్శించారు. చివరి ధాన్యం గింజ వరకు కొనుగోలు చేస్తామని, ప్రతి పంటకు బోనస్ ఇస్తామని, రైతులకు అండగా ఉంటామని ఇచ్చిన హామీలు అమలు కావడం లేదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం కేటాయించిన కోటా మేరకే ధాన్యం కొనుగోలు చేస్తామని చెప్పడం రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందన్నారు. వర్షాలు, మార్కెట్ అనిశ్చితి, ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాల్సిన బాధ్యత ఉందని, కోటాల పేరుతో కొనుగోళ్లు పరిమితం చేయడం అన్యాయమని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతు సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చామని దాసరి ఉష పేర్కొన్నారు. 24 గంటల ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతు భీమా, కాళేశ్వరం, మిషన్ కాకతీయ వంటి పథకాలతో వ్యవసాయ రంగంలో గణనీయమైన మార్పులు వచ్చాయని తెలిపారు. ప్రస్తుతం రైతుబంధు సక్రమంగా అమలు కాకపోవడం, రైతు భీమా నిలిచిపోవడం, రుణమాఫీ పూర్తి కాకపోవడం, ధాన్యం కొనుగోళ్లలో జాప్యం కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. గత సీజన్‌లో కూడా కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు అనేక సమస్యలు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరిపై ఒకరు నెపం నెట్టుకుంటూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని విమర్శించిన ఆమె, రైతు పండించిన ప్రతి పంటను కొనుగోలు చేయాలని, రైతుబంధు నిధులను వెంటనే విడుదల చేయాలని, రైతు భీమా అమలు చేయాలని, ఎన్నికల హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రైతు వ్యతిరేక విధానాలను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో రైతులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో చిన్నకల్వల మాజీ ఎంపీటీసీ సంపత్, బీరం రవి, శ్రవణ్, నర్సన్న, సదయ్య, దోది అశోక్, మల్లేష్, మహేందర్, అబ్దుల్ మలిక్, అవినాష్, అంజన్న, వంశీ, శ్రీను, హరికృష్ణ, సింగసాని అనిల్, సంతోష్, చందు, సాయిచరణ్, పుల్లూరి అవినాష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతు ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## నాడు దేశ సేవ లో ఖ్యాతి గాంచిన సైనికుడు ఉత్తమ్..

■ నేడు ప్రజా సేవ లో అలుపెరుగని ఉత్తమ్..

■ కోదాడ హుజుర్నగర్ నియోజక వర్గాల ప్రగతి భాగ్య విధాత ఉత్తమ్..

■ ప్రజాసేవ శ్వాస గా ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న మంత్రి ఉత్తమ్..

■ అభివృద్ధే ఆయన ఆశయం.. జనం మాటే ఆయన బాట..

■ రైతుల పాలిట బాంధవుడు... ప్రాజెక్టుల అపర భగీరథుడు మంత్రి ఉత్తమ్..

■ మున్సిపల్ చైర్ పర్సన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు..

■ ఎర్నేని ఆధ్వర్యంలో కోదాడ లో అంబరాన్నంటిన మంత్రి ఉత్తమ్ జన్మదిన వేడుకలు..



**కోదాడ, జూన్ 20/ ప్రజావాణి** కోదాడ హుజుర్నగర్ నియోజక వర్గాల ప్రగతి భాగ్య విధాత ఉత్తమ్ అని కోదాడ మున్సిపల్ చైర్మన్ ఎర్నేని కుసుమ వెంకట్ రత్నం బాబు అన్నారు. శని వారం కోదాడ శకుంతల థియేటర్ వద్ద రాష్ట్ర భారీ నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ జన్మదిన వేడుకలు వందలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానుల మధ్య నిర్వహించి మాట్లాడారు. నాడు దేశ సేవ లో ఖ్యాతి గాంచిన సైనికుడు అని నేడు ప్రజా సేవ కోసం రాజకీయాల్లోకి వచ్చి జీవితాన్ని ప్రజల కు త్యాగం చేస్తున్నారన్నారు. మంత్రి వర్గం లో కీలక శాఖలు చేపట్టి రాష్ట్రం లో అభివృద్ధి నీ పరుగులు పెట్టిస్తు ప్రభుత్వం లో కీలకంగా మారిన అగ్ర నేత ఉత్తమ్ అన్నారు. భారీ నీటి పారుదల శాఖ మంత్రి గా రైతుల కోసం సంక్షేమ పథకాలు అమలు చేస్తూ సాగు నీరు ఇబ్బందులు కలుగకుండా ప్రాజెక్టుల అభివృద్ధికి కృషి చేస్తున్న అపర భగీరదుడు ఉత్తమ్ అన్నారు. పౌర సరఫరాల శాఖ మంత్రి గా రాష్ట్రం లో ఏ ప్రభుత్వం చేపట్టని పథకం సన్న బియ్యం పథకం అమలు చేస్తూ పేదల ఆకలి తీరుస్తున్న అన్న దాత అని అన్నారు. కోదాడ హుజూర్ నగర్ నియోజక వర్గాలు రెండు కళ్ల లా భావిస్తూ రెండు నియోజక వర్గాల్లో రోడ్లు, విద్యా, వైద్య, విద్యుత్,సాగు నీరు, తాగు నీరు, విద్యుత్ సదుపాయాల కోసం వేల కోట్ల రూపాయలు మంజూరు చేయించిన అభివృద్ధి ప్రదాత అన్నారు. ప్రజలే కుటుంబంగా భావించి దంపతులు ఇద్దరు రాజకీయాల్లో రాణిస్తూ ప్రజల గుండె ల్లో నిలిచారని కొనియాడారు. కోదాడ, హుజూర్ నగర్ నియోజక వర్గాల్లోనే కాదు సూర్య చంద్రులు ఉన్నంత వరకు మంత్రి ఉత్తమ్ ఎమ్మెల్యే పద్మావతి ల పేరు రాష్ట్ర మొత్తం ఉంటుందన్నారు. ఉన్నత విద్యలు అభ్యసించి నేడు రాష్ట్రాన్ని దేశం లో ఆదర్శం గా నిలుపుతున్న అపర మేధావి ఉత్తమ్ అన్నారు. దేశ విదేశాలు పర్యటించి రాష్ట్ర గొప్ప తనాన్ని ప్రపంచానికి చాటిన అగ్ర నాయకుడు అన్నారు. భగవంతుని ఆశీస్సులతో భవిష్యత్తు లో మరెన్నో ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాక్షించారు. కాగా వందలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు అభిమానుల మధ్య భారీ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఉత్తమ్ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ భారీగా నినాదాలు చేశారు. పట్టణం లో భారీ కట్ అవుట్ లు కట్టి ఉత్తమ్ జన్మ దినం పండుగ లా చేశారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ ఎర్నేని వెంకటరత్నంబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలోనాయకులు అల్తాఫ్ హుస్సేన్ బండల్ కోటిరెడ్డి పాశం శీను తోట జ్యోతి నాగేంద్రమ్మ నేహా నాజ్ ఉప్పుగల శ్రీనివాస్ మాజీ ఎంపీటీసీ ఫయాజ్ కాంగ్రెస్ నాయకులు రావెళ్ళ కృష్ణారావు మైలార్శెట్టి భాస్కర్ ఒంటి పులి శ్రీనివాస్ లైటింగ్ ప్రసాద్ కాజా వేమూరి సతీష్ చందు నాగేశ్వరరావు నెమ్మది దేవమని ప్రకాష్ బాబు మాతంగి శైలజ కెజ్జమ్మ ఉన్నారు.

## గ్రామీణ మహిళా సంఘాల బలోపేతానికి మౌలిక వసతుల కల్పన

● కోగిల్వాయి గ్రామంలో వీఓ భవన నిర్మాణ పనులకు శ్రీకారం

● జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి





**పరకాల / దామెర: జూన్ 20(ప్రజా వాణి )'**గ్రామీణ మహిళా సంఘాల సాధికారత, స్వయం సహాయక సంఘాల కార్యకలాపాల విస్తరణ కు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారిస్తోందని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి తెలిపారు. దామెర మండలం కోగిల్వాయి గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ ఈజీఎస్) సెర్ప్ కన్వర్జెన్స్ ఆధ్వర్యంలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న విలేజ్ ఆర్గనైజేషన్ (వీఓ) భవనం నిర్మాణ పనులకు జిల్లా కలెక్టర్ భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మహిళా సంఘాలు గ్రామీణ ఆర్థికాభివృద్ధికి వెన్నెముకగా నిలుస్తున్నాయని, వాటి కార్యకలాపాల నిర్వహణకు శాశ్వత భవనాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. సంఘాల సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు, ఆర్థిక కార్యకలాపాల నిర్వహణకు ఈ భవనం దోహదపడుతుందని పేర్కొన్నారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా అదే ప్రాంగణంలో కలెక్టర్ మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ,నాటిన మొక్కలను సంరక్షించి పచ్చదనాన్ని పెంపొందించాలని గ్రామస్థులకు సూచించారు. తదుపరి కోగిల్వాయి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన కలెక్టర్, విద్యార్థుల తో మమేకమై వారి విద్యా పఠన సామర్థ్యాన్ని పరిశీలించారు. పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి, విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలు, వంటశాల నిర్వహణను తనిఖీ చేశారు. పిల్లలకు పోషకాహారం అందేలా సంబంధిత అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. అలాగే గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులతో ఆత్మీయంగా మాట్లాడారు. కేంద్రంలో అందిస్తున్న పోషకాహారం, ప్రీ-స్కూల్ విద్యా కార్యక్రమాలు, చిన్నారుల హాజరు, ఆరోగ్య పరిరక్షణ చర్యలను పరిశీలించారు. బాలల సమగ్ర అభివృద్ధికి అంగన్‌వాడీ కేంద్రాలు కీలకమని పేర్కొంటూ సేవల నాణ్యతను మరింత మెరుగుపరచాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీను, ఎంపీడీవో కల్పన , తహసీల్దార్ జ్యోతి వరలక్ష్మి, ఏపీఓ అశోక్, గ్రామ సర్పంచ్ చుక్క వనిత, మహిళా సంఘాల ప్రతినిధులు, అధికారులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అమెరికన్ కాన్సులేట్ ప్రాంతంలో ఉన్న రోడ్డుకు ట్రంప్ పేరు పెట్టడం బాధాకరం యాకుబ్

**గరిడేపల్లి ప్రజావాణి జూన్ 20**హైదరాబాద్ లోని ఫైనాన్స్ డిస్ట్రిక్ట్ లో గల నానక్ రామ్ గూడ ప్రాంతంలోని అమెరికన్ కాన్సులేట్ ప్రాంతంలో ఉన్న రోడ్డుకు అమెరికా అధ్యక్షులు డ్రోనాల్డ్ ట్రంప్ పేరు పెట్టాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించడాన్ని సిఐటియు తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది సీఐటీయూ జిల్లా నాయకులు యాకుబ్ అన్నారు శనివారం మండల కేంద్రం లోని అంబేద్కర్ స్తూపం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసనగా వ్యక్తం చేసారు ఈ సందర్భంగా యాకుబ్ మాట్లడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరి వల్ల అభ్యంతరాన్ని, నిరసనను వ్యక్తం చేస్తున్నది. ఈనిర్ణయాన్నిఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ జూన్ 20 న రాష్ట్ర వ్యాప్తంగా నల్ల జెండాలతో నిరసన తెలియ జేయాలని నిర్ణయించింది. అన్నారు ఈ నిరసన కార్యక్రమంలో కార్మికులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపు



నిస్తున్నాం. నేడు అమెరికా సామ్రాజ్యవాదం ప్రపంచ దేశాల సంపదను కొల్లగొట్టడానికి ప్రజల, కార్మికుల మీద యుద్ధాలను, యుద్ధ భారాలను రుద్దుతున్నది. ప్రపంచ ప్రజల రక్త మాంసాలను పీల్చి పిప్పి చేస్తున్నది. మనదేశం మీద ట్రంప్ ఆంక్షలు ప్రపంచ,భారత దేశ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేశాయి. ట్రంప్ చర్యలకు కేంద్ర ప్రభుత్వం నరేంద్రమోడీ సహకారం తోడవటంతో, ఆ చర్యలను ఖండించకుండ, మౌనంగా ఉండటం వల్ల మన దేశం కూడా నష్టపోతున్నది. మోడీ ప్రభుత్వం అమెరికన్ సామ్రాజ్యవాదంతో అంటకాగుతూ దేశ స్వాతంత్ర్యాన్ని, సార్వభౌమత్వానికి భంగం కల్గిస్తున్నాయి. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్ రోడ్ కి ట్రంప్ పేరు పెట్టి తన గురు భక్తి చాటుకుంది. బిజెపి బాటలోనే ఈ నిర్ణయం వుండటం అత్యంత ఆక్షేపణీయం. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షుడు కొంద సైదులు గౌడ సత్యనారాయణ వెంకన్న అమరవరపు శ్రావణ్ కుమార్ సారంగపాణి నారాయణ నవీన్ చంద్రయ్య లచ్చయ్య మైసయ్య తదితరులు పాల్గొన్నారు

# కల్మలచెరువు గ్రామ రైతుల ఆధ్వర్యంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి జన్మదిన వేడుకలు



**గరిడేపల్లి ప్రజావాణి జూన్ 20**గరిడేపల్లి మండల పరిధిలోని,కల్మలచెరువు గ్రామ రైతుల ఆధ్వర్యంలో,తెలంగాణ రాష్ట్ర భారీ నీటిపారుదల మరియు పౌరసరపరాల శాఖ మంత్రివర్యులు కెప్టెన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ,పార్టీలకు అతీతంగా,స్వచ్ఛందగా రైతులు మంత్రి ఫోటోకి పాలాభిషేకం చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, కల్మలచెరువు గ్రామం నుండి గానుగబండ గ్రామం వరకు ఇటీవల కాలంలో పూర్తయినటువంటి బీటీ రోడ్డును కొనియాడారు ఒకప్పుడు ఈ రోడ్డు పొలాలకు వెళ్లాలంటే రైతులు చాలా ఇబ్బంది పడేవారు,మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చొరవతో ఈ రోడ్ మంజూరు మరియు పూర్తి అయిన సందర్భంగా రైతులు సంతోషం వ్యక్తం చేస్తూ మంత్రి కి కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు

# చర్ల రాజకీయాల్లో కాంగ్రెస్ హవా

- పెరుగుతున్న చేరికలు
- మాజీ సొసైటీ చైర్మన్ బాబురావు, సీతపతి రాజు, కాంగ్రెస్‌లో చేరిక





**చర్ల/మన ప్రజావాణి (జూన్ 20):**చర్ల మండలంలో కాంగ్రెస్ పార్టీకి రోజురోజుకు ఆదరణ పెరుగుతోంది. బీఆర్ఎస్‌కు చెందిన పలువురు సీనియర్ నాయకులు స్థానిక ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు చీమలమర్రి మురళీకృష్ణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్ నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చేరిన నాయకులకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకుడు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ వైపు అడుగులు వేస్తున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే డా" తెల్లం వెంకట్రావు నాయకత్వంలో చర్ల మండలంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో లంక రాజు, మేడబత్తిన వాసు, ఇర్ప వసంత్, బ్రహ్మానంద రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# త్వరలోనే వేములవాడ బైపాస్ రోడ్డుకు సరికొత్త వెలుగులు..

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చొరవతో వేములవాడ అభివృద్ధి
- పనుల పురోగతిని కమీషనర్ లోకేష్ తో పరిశీలించిన చైర్మన్ పుల్కం రాజు
- ప్రమాదాల నివారణకే బైపాస్ రోడ్డులో విద్యుత్ దీపాలు
- పట్టణాభివృద్ధే లక్ష్యంగా మౌలిక వసతుల కల్పన..
- నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్న మున్సిపల్ చైర్మన్

**ప్రజావాణి వేములవాడ టౌన్ 20 జూన్ 2026**వేములవాడ పట్టణాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ఇందులో భాగంగానే రహదారుల ఆధునీకరణ, ప్రజలకు అవసరమైన సౌకర్యాల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు అన్నారు. ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవ, కృషితో పట్టణ బైపాస్ రోడ్డులో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సెంటర్ లైటింగ్ ఏర్పాటు పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ పనుల పురోగతిని మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, మున్సిపల్ కమిషనర్





లోకేష్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బైపాస్ రోడ్డు పొడవునా జరుగుతున్న విద్యుత్ స్తంభాల ఏర్పాటు, వైరింగ్ పనులను వారు దగ్గరుండి వీక్షించారు. ఈ సందర్భంగా పనుల నాణ్యత, ఇప్పటివరకు పూర్తయిన పనుల వివరాలను అక్కడ ఉన్న ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. రాత్రి వేళల్లో ప్రయాణించే వాహనదారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్టును అత్యంత ప్రాధాన్యతతో పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఎక్కడా నాణ్యతా ప్రమాణాల్లో రాజీ పడకుండా, అత్యాధునిక సాంకేతికతతో, నిర్ణీత గడువులోగా పనులన్నీ ముగించి వెలుతురును అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. బైపాస్ రోడ్డులో సెంటర్ లైటింగ్ అందుబాటులోకి వస్తే చీకటి కారణంగా జరిగే రహదారి ప్రమాదాలు పూర్తిగా తగ్గుముఖం పడతాయని, వాహనదారులకు మెరుగైన వెలుతురు లభించి ప్రయాణం ఎంతో సురక్షితంగా మారుతుందని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు. పట్టణ ప్రజలతో పాటు వేములవాడ రాజన్న దర్శనానికి వచ్చే భక్తులకు సైతం ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ ప్రధాన ధ్యేయమని, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సహకారంతో త్వరలోనే ఈ పనులన్నింటినీ పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తామని మున్సిపల్ చైర్మన్ వివరించారు.

# గ్రామాల అభివృద్ధియే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ





**బెజ్జంకి,జూన్ 20 (ప్రజావాణి)**సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల పరిధిలోని దేవక్కపల్లి, పెరుకబండ గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు, పోతారం గ్రామంలో నూతన డ్రైనేజీ నిర్మాణ పనులను మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సౌకర్యాలు, ఇతర అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తూ ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. అభివృద్ధి పనుల్లో ప్రజల సహకారం కూడా అవసరమని, ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కోరారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఒగ్గు దామోదర్, మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, బెజ్జంకి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లింగాల శ్రీనివాస్,ముక్కిస రత్నాకర్ రెడ్డి, మార్కెట్ కమిటి వైస్ చేర్మెన్ చిలువేరు శ్రీనివాస్ రెడ్డి,ఆయా గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

# మల్కాపూర్ శివారులోని గోదాం వద్ద టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి









**కొండాపూర్, జూన్ 20 (ప్రజావాణి):**కొండాపూర్ మండలం మల్కాపూర్ గ్రామ శివారులోని గోదాం సమీపంలో శనివారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ యువ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసినట్లు కొండాపూర్ ఎస్ఐ సోమేశ్వరి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని సిద్ధి ప్రాంతానికి చెందిన ప్రకాష్ సాకేత్ (27), ప్రస్తుతం పటాన్‌చేరు మండలంలోని లక్డారామ్ గ్రామంలో నివాసం ఉంటూ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం తెల్లవారుజామున మహతాబ్‌ఖాన్‌గూడ నుంచి సంగారెడ్డి వైపు టిప్పర్ వాహనం (TG 07V 2467) నడుపుకుంటూ వస్తుండగా, ఉదయం సుమారు 3.30 గంటల సమయంలో మల్కాపూర్ గ్రామ శివారులోని గోదాం వద్ద రోడ్డు పక్కన నిలిపి ఉంచిన లారీ (AP 16TB 9918)ను వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ప్రకాష్ సాకేత్ తీవ్ర గాయాలకు గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి బంధువు దాదులాల్ సాకేత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, గోదాం నిర్వాహకుడు ప్రేమ్ కుమార్, స్టార్ అగ్రి మేనేజర్ మనోహర్ రెడ్డి, సూపర్వైజర్ కుమార్‌ల నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని పలువురు లారీ డ్రైవర్లు ఆరోపించారు. రోడ్డు పక్కన తగిన హెచ్చరికలు, భద్రతా చర్యలు లేకుండా లారీని నిలిపివేయడం వల్లే ప్రమాదం సంభవించిందని పేర్కొన్నారు. కుటుంబానికి ఆధారంగా ఉన్న 27 ఏళ్ల యువకుడు మృతి చెందడంతో బాధిత కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. మృతుడి కుటుంబానికి రూ.20 లక్షల నష్టపరిహారం అందించాలని కుటుంబ సభ్యులు, సహచర డ్రైవర్లు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# ములవాగులో ఇసుక తరలింపును అడ్డుకున్న రైతులు

- మామిడిపల్లి ములవాగులో ఇసుక తరలింపుపై రైతుల ఆందోళన



**ప్రజా వాణి వేములవాడ టౌన్ 20 జూన్ 2026**కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామంలోని ములవాగు నుంచి ఇసుక తరలింపును శనివారం రైతులు అడ్డుకున్నారు. ఇసుక తవ్వకాలు అధికంగా జరగడం వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోయి బావులు ఎండిపోయే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితుల్లో వ్యవసాయానికి నీటి కొరత ఏర్పడి పంటలు దెబ్బతినే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇసుక రీచ్‌ను వెంటనే మరో ప్రాంతానికి తరలించి రైతుల ప్రయోజనాలను కాపాడాలని సంబంధిత అధికారులను కోరారు.

# ఆక్స్ఫర్డ్ స్కూల్‌లో షీ టీమ్స్ అవగాహన సదస్సు

- విద్యార్థులకు భద్రత, సైబర్ నేరాల నివారణ పై అవగాహన కల్పించిన రామచంద్రపురం పోలీసులు






**రామచంద్రపురం, జూన్ 20 (ప్రజావాణి):** విద్యార్థుల్లో భద్రతా అవగాహన పెంపొందించడంతో పాటు సైబర్ నేరాల నివారణపై చైతన్యం కల్పించేందుకు లింగంపల్లిలో ఉన్న ఆక్స్ఫర్డ్ స్కూల్‌లో రామచంద్రపురం పోలీస్ షీ టీమ్స్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీమ్ రామచంద్రాపురం (సైబరాబాద్) సిబ్బంది విద్యార్థులకు మొబైల్ ఫోన్లను బాధ్యతాయుతంగా వినియోగించే విధానం, సోషల్ మీడియా వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆన్‌లైన్ మోసాలు మరియు సైబర్ నేరాల నుంచి రక్షణ పొందే మార్గాలపై వివరించారు. అలాగే మహిళలు, చిన్నారుల రక్షణ కోసం ప్రభుత్వం అందిస్తున్న సేవలు, అత్యవసర పరిస్థితుల్లో సంప్రదించాల్సిన హెల్ప్‌లైన్ నంబర్ల గురించి అవగాహన కల్పించారు. ఎవరైనా వేధింపులకు గురైనా లేదా అనుమానాస్పద సంఘటనలు ఎదురైనా వెంటనే షీ టీమ్స్ లేదా పోలీసులను సంప్రదించాలని సూచించారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకుని బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ రామచంద్రాపురం (సైబరాబాద్) ఎస్ఐ కె. రాజు, ఏఎస్ఐ శ్రీనివాస చారి, హెడ్ కానిస్టేబుళ్లు దత్తు, సూరిబాబు, కానిస్టేబుల్ ఎ. అనిల్ కుమార్, మహిళా కానిస్టేబుల్ ఎ. ప్రమీల, హోంగార్డు గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే ఆక్స్ఫర్డ్ స్కూల్ ఆర్ఐ ఆరోగ్య రెడ్డి, ప్రిన్సిపల్ మాలిని మేడం, ఉపాధ్యాయులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. విద్యార్థుల భద్రత, సైబర్ అవగాహన, వ్యక్తిత్వ వికాసానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని పాఠశాల యాజమాన్యం పేర్కొంది.

# కంఠమామహేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న తుంబూరు దయాకర్ రెడ్డి





**నేలకొండపల్లి ప్రతినిధి మన ప్రజావాణి జూన్ 20:** నేలకొండపల్లి మండల పరిధిలోని రాజేశ్వరపురం లో కంఠమామహేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ గృహ, నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాల యం ఇంఛార్జి తుంబూరు దయాకర్ రెడ్డి పాల్గొని ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని,పాడి పంటల తో కళకళ లాడాలని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమం ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొడాలి గోవింద రావు,నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు,మాజీ మార్కెట్ చైర్మన్ శాఖమూరి రమేష్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు,మాజీ సర్పంచ్ ,దండా పుల్లయ్య,ఎర్రబోయిన నర్సయ్య,గ్రామయువకులు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారులకు అక్షరాభ్యాసము ఏకరూప దుస్తుల పంపిణీ



**చిలుకూరు,జూన్ 20(ప్రజావాణి):** చిలుకూరు మండల కేంద్రంలోని అంగన్వాడి కేంద్రాలలో చిన్నారులకు సర్పంచ్ కొల్లు పుల్లమ్మ నాగయ్య, వార్డ్ సభ్యులు బెల్లంకొండ సైదులు ముఖ్య అతిథులుగా హాజరై చిన్నారులకు అక్షరాభ్యాసం చేసి,అనంతరము యూనిఫామ్ అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఐదు సంవత్సరముల లోపు బాల బాలికలను అంగన్వాడీల నందు చేర్పించాలని ప్రభుత్వము పిల్లల శారీరక అభివృద్ధి కొరకు ప్రత్యేకమైన ఆహారాన్ని అందిస్తుందని, అంగన్వాడీ కేంద్రాలలో బాలల మానసిక అభివృద్ధికి ఎన్నో ఉపయోగకరమైన ఉపకరణములు ఉన్నాయని చిన్నారులు మానసిక ఒత్తిడి లేకుండా ఆటపాటలతో విద్యని అభ్యసించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్ వైజర్ సునీత,టీచర్ సిరికొండ కవిత, ఆయా పుల్లమ్మ, తల్లులు మహిళలు పాల్గొన్నారు.

# ఘనంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి జన్మదిన వేడుకలు..



**కోదాడ, జూన్ 20/ ప్రజావాణి** భారీ నీటిపారుదల పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి జన్మదిన వేడుకలను కోదాడలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన వేడుకల్లో పిసిసి డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎర్నేని కుసుమా వెంకటరత్నం బాబు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, మాజీ సర్పంచ్ పారా సీతయ్యలు మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి కేక్ కట్ చేసి మంత్రి ఉత్తమ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేలకోట్ల రూపాయలు నిధులు తీసుకువచ్చి రెండు నియోజకవర్గాల్లో అభివృద్ధి పరుగులు పెట్టిస్తున్న తమ అభిమాన నాయకుడు ఇటువంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరెన్నో ఉన్నతమైన పదవులు అందుకొని ప్రజలకు మరింతకాలం వారు సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ బాల్ రెడ్డి,కౌన్సిలర్లు కందుల కోటేశ్వరరావు, కోటిరెడ్డి, పాశం శ్రీను, తోనాం కృష్ణ, యలమందల నరసయ్య, సుందరి వెంకటేశ్వర్లు, గోపి, బాజన్, కాంపాటి శ్రీను, పిడతల శ్రీను, ఉప్పగండ్ల శ్రీను, చింత బాబు, సైది బాబు, అలీ భాయ్, యేసయ్య, బసవయ్య, పులి వెంకటేశ్వర్లు, రమేష్, శైలజ, నాగేశ్వరరావు, పుల్లయ్య, దావల్, సంజీవ్, ముస్తఫా, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు

# రాజీ మార్గమే రాజ మార్గం..

- కేసుల సత్వర పరిష్కారానికి లోకాదాలత్ చక్కని మార్గం..
- మెగా లోక్ అదాలత్ లో 48 క్రిమినల్ 8 సివిల్ బ్యాంకు కేసులు 24 పరిష్కారం..
- సీనియర్ సివిల్ జడ్జి కే.సురేష్..



**కోదాడ, జూన్ 20/ ప్రజావాణి** దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ చక్కటి మార్గమని సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ కే.సురేష్ అన్నారు. శనివారం కోదాడ కోర్ట్ లో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఉమర్ తో కలిసి జాతీయ లోక్ ఆదాలత్ ను ప్రారంభించి మాట్లాడారు. రాజీమార్గమే రాజమార్గమని కక్షలు, పట్టింపులకు పోయి కక్షిదారులు నష్టపోవద్దని సూచించారు. సత్వర న్యాయానికి లోక్ అదాలత్ లు సహకరిస్తాయని కక్షిదారులు ఇట్టి అవకాశాన్నిసద్వినియోగం చేసుకొని విలువైన కాలాన్ని ఆర్థిక నష్టాన్ని కాపాడుకొని ప్రశాంత జీవనాన్ని గడపాలని ఆకాంక్షించారు. కోదాడ కోర్టులో క్రిమినల్ కేసులు 48,సివిల్ 8, బ్యాంక్ కేసులు 24 పరిష్కరించారు. బ్యాంకు కేసుల రికవరీ రూపంలో 10 లక్షలు వసూలు చేశారు. అడ్మిషన్ కేసులు 86 పిట్టి కేసులు 976 పరిష్కరించి 4 లక్షల 77 వేల రూపాయలు ఫైన్ రూపంలో వసూలు చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి, ఉపాధ్యక్షులు గట్ల నరసింహారావు, కార్యదర్శి రామకృష్ణ, జాయింట్ సెక్రటరీ జానీ పాషా, ట్రెజరర్ వెంకటేశ్వర్లు సీనియర్ న్యాయవాదులు మేకల వెంకట్రావు, పాలేటి నాగేశ్వరరావు, చింతకుంట్ల రామిరెడ్డి తమ్మినేని హనుమంతరావు, గోవర్ధన్, రవికుమార్, పారా లీగల్ వాలంటీర్లు, కోర్టు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు..

# ట్రాక్టర్ పైనుంచి పడి యువకుడు మృతి

- ఎరువు తరలించే సమయంలో ప్రమాదం



**జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్, ఎండపల్లి జూన్ 20 (ప్రజావాణి):** జగిత్యాల జిల్లా ఎండపల్లి మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి ఘోర ప్రమాదం జరిగింది. ట్రాక్టర్ పైనుంచి కింద పడి తోట్ల మధుకర్ (26) అనే యువకుడు మృతి చెందాడు. వెల్గటూర్ స్టేషన్ ఎస్సై పి ఉదయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం. ఎండపల్లి గ్రామానికి చెందిన తోట్ల మధుకర్ శుక్రవారం రాత్రి 9:30 గంటల సమయంలో తన వ్యవసాయ పొలానికి పెంట (ఎరువు) తరలించేందుకు సిద్ధమయ్యాడు. ఇందుకోసం అదే గ్రామానికి చెందిన వర్దవెల్లి కొమురయ్యకు చెందిన ట్రాక్టర్‌ను కిరాయికి మాట్లాడుకున్నాడు. ట్రాక్టర్‌లో పెంట నింపుకుని పొలానికి బయలుదేరారు. పొలానికి వెళ్లే క్రమంలో మధుకర్ ట్రాక్టర్ నొగలు (ఇంజన్‌కు, ట్రాలీకి మధ్య ఉండే భాగం) పై నిల్చున్నాడు. ఈ క్రమంలో డ్రైవర్ కొమురయ్య ట్రాక్టర్‌ను అతివేగంగా, అజాగ్రత్తగా నడపడంతో మధుకర్ ఒక్కసారిగా ప్రమాదవశాత్తు కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో మధుకర్ కనుబొమ్మపై తీవ్ర రక్తగాయాలై, ఛాతికి బలమైన దెబ్బలు తగిలాయి. తీవ్రంగా గాయపడిన మధుకర్‌ను వెంటనే చికిత్స నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అక్కడ పరీక్షించిన వైద్యులు. మధుకర్ అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు. మృతుడి తండ్రి తోట్ల లచ్చన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెల్గటూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా మృతదేహానికి శనివారం రోజున పోస్టుమార్టం నిర్వహించినట్లు ఎస్సై ఉదయ్ కుమార్ పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. యువకుడి మృతితో ఎండపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

# ఫారెస్ట్--రెవెన్యూ జాయింట్ సర్వే, భూసేకరణ ప్రక్రియలను వేగవంతం చేయాలి : జిల్లా కలెక్టర్ అంకిత్

**ప్రజవాణి, దమ్మపేట,, జూన్ 20** అకినేపల్లి, లింగాలపల్లి ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించిన జిల్లా కలెక్టర్ అంకిత్ జిల్లాలో ఫారెస్ట్--రెవెన్యూ జాయింట్ సర్వే, నాన్-క్యాడస్ట్రల్ సర్వే, నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియలను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. శనివారం దమ్మపేట మండలంలోని పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న సర్వే పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా దమ్మపేట మండలం అక్కినేపల్లి గ్రామంలో చేపడుతున్న నాన్-క్యాడస్ట్రల్ సర్వే పనులను కలెక్టర్ పరిశీలించారు. సర్వే ప్రక్రియ, భూముల హద్దుల గుర్తింపు, రికార్డుల నమోదు విధానాలను అడిగి తెలుసుకుని పనులను నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా సర్వే నిర్వహించాలని అధికారులకు సూచించారు. అనంతరం దమ్మపేట మండలం లింగాలపల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 1458లో కొనసాగుతున్న ఫారెస్ట్--రెవెన్యూ జాయింట్ సర్వే పనుల పురోగతిని కలెక్టర్ పరిశీలించారు. అటవీ మరియు



రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్తంగా నిర్వహిస్తున్న సర్వే ప్రక్రియను పరిశీలించి, భూముల సరిహద్దుల నిర్ధారణలో ఖచ్చితత్వం పాటించాలని ఆదేశించారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తూ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా అధికారులు కలెక్టర్‌కు వివరాలు అందిస్తూ అక్కినేపల్లి గ్రామ పరిధిలో సుమారు 4,400 ఎకరాల విస్తీర్ణంలో ఫారెస్ట్--రెవెన్యూ జాయింట్ సర్వే పనులు కొనసాగుతున్నాయని, ప్రస్తుతం పనులు ప్రణాళికాబద్ధంగా జరుగుతున్నాయని తెలిపారు. మరో రెండు నెలల్లో సర్వే ప్రక్రియను పూర్తిచేయనున్నట్లు వివరించారు. దమ్మపేట తహసీల్దార్ కార్యాలయంలో నీటిపారుదల శాఖ అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీతారామ ప్రాజెక్టు అలైన్‌మెంట్‌ను మ్యాప్ ద్వారా పరిశీలించి, ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ, సర్వే, సరిహద్దుల నిర్ధారణ అంశాలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. ప్రాజెక్టు పనులకు ఎటువంటి అవరోధాలు తలెత్తకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని, పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఫారెస్ట్--రెవెన్యూ జాయింట్ సర్వే ద్వారా అటవీ, రెవెన్యూ భూముల సరిహద్దులు స్పష్టంగా నిర్ధారణ కావడంతో పాటు భవిష్యత్తులో తలెత్తే వివాదాలకు పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. సర్వే, భూసేకరణ ప్రక్రియలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రభుత్వ లక్ష్యాల సాధనకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట కొత్తగూడెం రెవెన్యూ డివిజనల్ అధికారి మధు, దమ్మపేట తాసిల్దార్ రామ్ నరేష్, ఫారెస్ట్ రేంజర్ శ్రీనివాస్ రావు,సర్వేయర్ నాగరాజు మరియు రైతులు తదితరులు పాల్గొన్నారు

# అక్షరం..అంగడి సరుకు...?

- ఫీజుల కోరల్లో మధ్యతరగతి..కాసులు కురిపిస్తున్న 'చదువుల' వ్యాపారం.
- ఆనాడు సంస్కార వాహిక..నేడు కార్పొరేట్ దోపిడీకి వేదిక..?
- బోర్డులు మారాయి.. బ్రాండ్లు వచ్చాయి..?
- అడ్డుఅదుపు లేని అదనపు బాదుడు..?
- ఉన్నత విద్య... అప్పుల ఊబి..?
- అభత్రతా భావమే పెట్టుబడులు..?
- పాలకుల పట్టింపు ఎప్పుడు..?
- తల్లిదండ్రులు విద్యార్థుల చదువు కై అప్పుల ఉరి..?




**యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి జూన్ 20** విద్య- అది ఒకప్పుడు అంధ కారాన్ని చీల్చే జ్ఞానదీపం. సామాన్యుడిని ఉన్నతు డిగా తీర్చిదిద్దే సంస్కార వాహిక. కానీ నేడు..? ఆ అక్షరం కాసుల కురిపించే కల్పవృక్షంగా మారింది. విద్యారంగం కార్పొరేట్ ముసుగులో పక్కా వాణిజ్య సామ్రాజ్యంగా రూపాంతరం చెందింది. ఒకప్పుడు నామ మాత్రపు వ్యయంతో , ప్రభుత్వ , ఎయిడెడ్ సంస్థ ల్లో ప్రతిభే కొలమానంగా సాగిన చదువు..నేడు సకల హంగులతో , కోట్లాది రూపాయల టర్నోవర్లతో సాగుతున్న పెను వ్యాపారంగా మారింది. "విద్య విలువ పెరిగిందా..? లేక కేవలం దోపిడీ వ్యయం పెరిగిందా..?" అనే నిలదీత నేడు ప్రతి సామాన్య ,మధ్య తరగతి తల్లిదండ్రుల గుండె ల్లో ఆక్రోశమై రగులుతోంది.

బోర్డులు మారాయి..బ్రాండ్లు వచ్చాయి...

కొన్ని దశాబ్దాల క్రితం స్కూలు అనగానే క్రమ శిక్షణ , నల్ల బల్ల , ఉపాధ్యాయుడి బోధన మాత్రమే గుర్తొచ్చేవి. పుస్తకాల సంచి , రెండు జతల యూనిఫాంతో ఏడాది చదువు నిశ్చింతగా సాగిపోయేది. కానీ నేటి కార్పొరేట్ యుగంలో విద్యకు 'బ్రాండింగ్' అబ్బింది. ఇంటర్నేషనల్ , టెక్నో , ఒలింపియాడ్ , ఈ-టెక్నో , ఐఐటీ ఫౌండేషన్..ఇలా రంగు రంగుల పేర్లతో విద్యార్థుల ను , వారి తల్లిదండ్రులను ఆకర్షించే మాయాజాలం మొదలైంది. ?అక్షర క్రమం రాని పసివాడిని ఎల్‌కేజీలో చేర్చడానికే ఐదు అంకెల జీతాన్ని దాటి , లక్షల రూపాయల 'డొనేషన్లు' , 'క్యాపిటేషన్ ఫీజులు' సమర్పించుకోవాల్సిన దుస్థితి నేడు దేశంలో దాపురించింది. నాణ్యమైన విద్య అనేది కేవలం సంపన్న వర్గాలకే పరిమితమా అనే రీతిలో విద్యావ్యవస్థ వర్గీకరణకు గురవుతోంది.

అడ్డూఅదుపూ లేని అదనపు బాదుడు...

ఫీజుల నియంత్రణ చట్టాలు , కమిటీలు కేవలం కాగితాలకే పరిమితం కావడంతో యాజమాన్యాల ఇష్టారాజ్యం నడుస్తోంది. నిర్బంధ అమ్మకాలు కేవలం ట్యూషన్ ఫీజుతోనే ఈ దోపిడీ ఆగడం లేదు. పాఠశాల పరిసరాల్లోనే లేదా వారు నిర్దేశించిన దుకాణాల్లోనే పుస్తకాలు , యూని ఫారాలు , బెల్టులు , డైరీలు , చివరకు బూట్లు , సాక్సులు సైతం మార్కెట్ ధర కంటే మూడింతలు పెంచి విక్రయిస్తున్నారు.రవాణా పేరిట దోపిడీ.. ఏటా ఇంధన ధరల పెరుగు దలను సాకుగా చూపుతూ విద్యాసంస్థలు వసూలు చేసే ఏసీ బస్సుల ఫీజులు , సామాన్యుడి నెలవారీ బడ్జెట్‌ను తలకిందులు చేస్తున్నాయి.

ఉన్నత విద్య - అప్పుల ఊబి...

ఇక ఇంటర్మీడియట్, ఇంజనీరింగ్ , వైద్య విద్యల సంగతి చెప్పనక్కర్లేదు. ప్రభుత్వ కోటాలో సీటు రాని పక్షంలో , మేనేజ్‌మెంట్ సీట్ల కోసం సామాన్య కుటుంబాలు తమ ఆస్తులను అమ్ము కోవడమో , లేదా జీవిత కాలం అప్పుల ఊబిలో కూరుకుపోవడమో జరుగు తోంది.

అభద్రతా భావమే పెట్టుబడిగా...

ప్రభుత్వ విద్యావ్యవస్థలో కాలక్రమేణా ఏర్పడిన మౌలిక సదుపాయాల కొరత , పర్యవేక్షణా లోపం , ఆంగ్ల మాధ్యమ బోధనలో ఆశించిన స్థాయి ప్రగతి లేకపోవడం వంటి లోపాలే ప్రైవేట్ శక్తులకు పెట్టు బడిగా మారాయి. రెక్కాడితే గాని డొక్కాడని పేదవాడు సైతం , తన బిడ్డ భవిష్యత్తు ఎక్కడ అంధ కారమవుతుందోననే అభద్రతా భావంతో , అప్పులు చేసైనా సరే కార్పొరేట్ బడుల వైపు పరుగులు తీస్తున్నాడు. తల్లిదండ్రుల బలహీ నతను , వారి సామాజిక ఆందోళనను కొన్ని యాజ మాన్యాలు నిర్దయాత్మకంగా క్యాష్ చేసుకుంటున్నాయి.

?ఆర్థిక నివేదికల సంచలన నిజం. వివిధ జాతీయ సర్వేల గణాంకాల ప్రకారం , భారతదేశంలో ఒక సగటు మధ్యతరగతి జీవి తన జీవితకాల సంపాదనలో దాదాపు 40 నుండి 50 శాతాన్ని కేవలం పిల్లల చదువుల కోసమే వెచ్చి స్తున్నాడు. ఫలితంగా ఆయా కుటుంబాలు ఆరోగ్య అత్యవసరాలు , సొంత ఇల్లు వంటి ఇతర ప్రాథమిక సామాజిక భద్రతలకు దూరమవుతున్నాయి.

పాలకుల పట్టింపు ఎప్పుడు...

విద్య అనేది లాభాపేక్ష లేని సేవా రంగంగా ఉండాలని సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పులు ఇచ్చినప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. ప్రైవేట్,కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల ను నియంత్రిం చేందుకు బలమైన,పార దర్శకమైన చట్టపరమైన పర్యవేక్షణా వ్యవస్థలు ఏర్పాటు కావాలి. అదే సమయంలో ప్రభుత్వ పాఠశాలలు ,కళాశాలలను కార్పొరేట్ స్థాయికి దీటుగా మౌలిక వసతులతో బలో పేతం చేయాలి. అప్పుడే ఈ విద్యా దోపిడీకి శాశ్వత అడ్డుకట్ట పడుతుంది. అక్షరాస్యత శాతాన్ని పెంచడం ఎంత ముఖ్యమో...ఆ అక్షరాన్ని సామాన్యుడికి అందు బాటు లో ఉంచడం కూడా అంతే ముఖ్యం. నిరంతర నిఘా , పాలకుల చిత్తశుద్ధి మాత్రమే ఈ వ్యవస్థను ప్రక్షాళన చేయగలవు.

# వేములవాడ రెండవ బైపాస్ కు కొత్త కళ త్వరలోనే ఎల్ఈడి లైట్ల వెలుగు...!

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చొరవతో వేములవాడ అభివృద్ధి.
- పనుల పురోగతిని కమీషనర్ లోకేష్ తో పరిశీలించిన చైర్మన్ పుల్కం రాజు.
- ప్రమాదాల నివారణకే బైపాస్ రోడ్డులో విద్యుత్ దీపాలు.
- పట్టణాభివృద్ధే లక్ష్యంగా మౌలిక వసతుల కల్పన.
- నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్న మున్సిపల్ చైర్మన్.

**సిరిసిల్ల జిల్లా //వేములవాడ // జూలై -20 (ప్రజావాణి) ఆర్ సి ఇంచార్జ్, తాటిపల్లి. నరసింహస్వామి.** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ఇందులో భాగంగానే రహదారుల ఆధునీకరణ, ప్రజలకు అవసరమైన సౌకర్యాల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు అన్నారు. ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవ, కృషితో పట్టణ బైపాస్ రోడ్డులో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సెంటర్ లైటింగ్ ఏర్పాటు పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ పనుల పురోగతిని మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, మున్సిపల్ కమిషనర్ లోకేష్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బైపాస్ రోడ్డు పొడవునా జరుగుతున్న విద్యుత్ స్తంభాల ఏర్పాటు, వైరింగ్



పనులను వారు దగ్గరుండి వీక్షించారు. ఈ సందర్భంగా పనుల నాణ్యత, ఇప్పటివరకు పూర్తయిన పనుల వివరాలను అక్కడ ఉన్న ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. రాత్రి వేళల్లో ప్రయాణించే వాహనదారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్టును అత్యంత ప్రాధాన్యతతో పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఎక్కడా నాణ్యతా ప్రమాణాల్లో రాజీ పడకుండా, అత్యాధునిక సాంకేతికతతో, నిర్ణీత గడువులోగా పనులన్నీ



ముగించి వెలుతురును అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. బైపాస్ రోడ్డులో సెంటర్ లైటింగ్ అందుబాటులోకి వస్తే చీకటి కారణంగా జరిగే రహదారి ప్రమాదాలు పూర్తిగా తగ్గుముఖం పడతాయని, వాహనదారులకు మెరుగైన వెలుతురు లభించి ప్రయాణం ఎంతో సురక్షితంగా మారుతుందని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు. పట్టణ ప్రజలతో పాటు వేములవాడ రాజన్న దర్శనానికి వచ్చే భక్తులకు సైతం ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ ప్రధాన ధ్యేయమని, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సహకారంతో త్వరలోనే ఈ పనులన్నింటినీ పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తామని మున్సిపల్ చైర్మన్ వివరించారు.

# ప్రభుత్వ సలహాదారులు, రాజ్యసభ ఎంపీ వెం నరేందర్ రెడ్డిని కలిసిన వినయ్ రెడ్డి



**ఆర్మూర్ టౌన్, జూన్ 20(ప్రజావాణి):** ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి ప్రభుత్వ సలహాదారు, ఎంపి వెం నరేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆర్మూర్ మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులు మంజూరు చేయడంతో పాటు నూతన మున్సిపల్ భవన నిర్మాణానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. అలాగే నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎస్‌డీఎఫ్ ద్వారా రూ.5 కోట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై వెం నరేందర్ రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు వినయ్ కుమార్ రెడ్డి తెలిపారు.

# “తెలంగాణ తల్లి ముద్దుబిడ్డ, మా జయశంకర్ సార్ 15వ, వర్ధంతి”

- తెలంగాణ ఉద్యమ పితామహుడు ... జయశంకర్ సార్.
- విక్కుర్తి లక్ష్మీనారాయణ ప్రధానోపాధ్యాయుడు.





**సిరిసిల్ల జిల్లా //వేములవాడ // జూలై -20 (ప్రజావాణి) ఆర్ సి ఇంచార్జ్, తాటిపల్లి. నరసింహస్వామి.** తెలంగాణ ఉద్యమ పితామహుడు ప్రొఫెసర్ జయశంకర్ సార్ 15వ, వర్ధంతి సందర్భంగా ప్రాథమిక పాఠశాల న్యూ అర్బన్ కాలనీ వేములవాడలో జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ “తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త, ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం తన జీవితాంతం పరితపించిన మహనీయుడు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ అని, ఆయన భావజాల వ్యాప్తి, పట్టుదల, త్యాగాలు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంలో కీలకపాత్ర పోషించాయని, జయశంకర్ సార్1934 ఆగస్టు 6న హనుమకొండ జిల్లా (నాటి వరంగల్) ఆత్మకూరు మండలం అక్కంపేటలో జన్మించారని, 1952 నాటి ముల్కీ ఉద్యమం నుండి మొదలుకొని, 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమం వరకు ప్రతి దశలోనూ తన గళాన్ని వినిపించారని, తెలంగాణ ప్రాంతానికి నీటిపారుదల, నిధులు, నియామకాల్లో జరుగుతున్న అన్యాయాలను శాస్త్రీయంగా అధ్యయనం చేసి ప్రజలకు వివరించారని, చిన్న రాష్ట్రాల వల్లనే అభివృద్ధి సాధ్యమని సార్ నమ్మారని, కాకతీయ విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్సలర్ గా పనిచేశారని, విద్యావేత్తగా ఎంతోమంది విద్యార్థులను భావజాల స్ఫూర్తితో తీర్చిదిద్దారని, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి, రాజకీయ సమానత్వం కోసం పోరాడారని, 2011 జూన్ 21న తుదిశ్వాస విడిచారని, తెలంగాణ ప్రజల హృదయాలలో “తెలంగాణ జాతిపిత”గా ఆయన ఎప్పటికీ చిరస్మరణీయులు’ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దుర్శేటి లక్ష్మీనారాయణ, దాసరి సుజాత, అంగన్వాడి ఉపాధ్యాయురాలు లిక్కిడి మంజుల, పులి శారద మరియు విద్యార్థులు పాల్గొన్నారు

# ఫారెస్ట్--రెవెన్యూ జాయింట్ సర్వే, భూసేకరణ ప్రక్రియలను వేగవంతం చేయాలి

- అక్కినేపల్లి, లింగంపల్లి ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించిన జిల్లా కలెక్టర్ అంకిత్







**భద్రాద్రి జిల్లా బ్యూరో/మన ప్రజావాణి (జూన్ 20):** జిల్లాలో ఫారెస్ట్--రెవెన్యూ జాయింట్ సర్వే, నాన్-క్యాడస్ట్రల్ సర్వే, నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియలను వేగవంతం గా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. శనివారం దమ్మపేట మండలంలోని పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న సర్వే పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి,సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిం చారు. ఈ సందర్భంగా దమ్మపేట మండలం అక్కినేపల్లి గ్రామంలో చేపడుతున్న నాన్-క్యాడస్ట్రల్ సర్వే పనులను కలెక్టర్ పరిశీలిం చారు. సర్వే ప్రక్రియ, భూముల హద్దుల గుర్తింపు, రికార్డుల నమోదు విధానాలను అడిగి తెలుసుకుని పనులను నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా సర్వే నిర్వహించాలని అధికారులకు సూచించారు. అనంతరం దమ్మపేట మండలం లింగంపల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 1458లో కొనసాగు తున్న ఫారెస్ట్--రెవెన్యూ జాయింట్ సర్వే పనుల పురోగతిని కలెక్టర్ పరిశీలించారు. అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్తంగా నిర్వహిస్తున్న సర్వే ప్రక్రియను పరిశీలించి,భూముల సరిహద్దుల నిర్ధారణలో ఖచ్చితత్వం పాటించాలని ఆదేశించారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తూ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా అధికారులు కలెక్టర్‌కు వివరాలు అందిస్తూ అక్కినేపల్లి గ్రామ పరిధిలో సుమారు 4,400 ఎకరాల విస్తీర్ణంలో ఫారెస్ట్--రెవెన్యూ జాయింట్ సర్వే పనులు కొనసాగుతున్నాయని, ప్రస్తుతం పనులు ప్రణాళికాబద్ధంగా జరుగుతున్నాయని తెలిపారు. మరో రెండు నెలల్లో సర్వే ప్రక్రియను పూర్తిచేయనున్నట్లు వివరించారు. దమ్మపేట తహసీల్దార్ కార్యాలయంలో నీటిపారుదల శాఖ అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీతారామ ప్రాజెక్టు అలైన్‌మెంట్‌ను మ్యాప్ ద్వారా పరిశీలించి, ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ, సర్వే, సరిహద్దుల నిర్ధారణ అంశాలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. ప్రాజెక్టు పనులకు ఎటువంటి అవరోధాలు తలెత్తకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని, పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఫారెస్ట్--రెవెన్యూ జాయింట్ సర్వే ద్వారా అటవీ, రెవెన్యూ భూముల సరిహద్దులు స్పష్టంగా నిర్ధారణ కావడంతో పాటు భవిష్యత్తులో తలెత్తే వివాదా లకు పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. సర్వే, భూ సేకరణ ప్రక్రియలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రభుత్వ లక్ష్యాల సాధనకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట కొత్తగూడెం రెవెన్యూ డివిజనల్ అధికారి మధు, దమ్మపేట తాసిల్దార్ రామ్ నరేష్, ఫారెస్ట్ రేంజర్ శ్రీనివాస్‌రావు,సర్వేయర్ నాగరాజు,రైతులుతదితరులు పాల్గొన్నారు

# రైతుకు ‘యాప్’ ఉరి.. మద్యం బాబులకు ఆప్తబంధువ...?

- యూరియా బస్తాకు ఆంక్షల బంధనం.. అన్నదాత పై సాంకేతిక వేధింపులు...?
- ఒక్క బస్తా కోసం ‘సర్వర్’ తిప్పలు..ఖరీఫ్ వేళ సర్కారు కొత్త పితలాటకం.
- పల్లెల్లో ‘నెట్’ లేదు.. చేతిలో ‘స్మార్ట్’ లేదు...
- సర్వర్ డౌన్..రైతు బేజార్...
- ‘మద్యం’ విక్రయాలకు లేని నిబంధనలు.. ఎరువులకేనా...?
- రైతు సంఘాల తీవ్ర ఆగ్రహం..?అన్నదాత ఆక్రందన..ప్రభుత్వం ఏం చేయాలి...?
- సెంటర్లో సర్వర్ల మొరాయింపు...
- రైతన్నల సమయం వృథా...
- ‘యాప్’ బంధాలు తెంచండి..సాగును రక్షించండి...?




**యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి జూన్ 20** ?పొలం దున్ని , విత్తనం వేసి , దేశానికి అన్నం పెట్టే అన్న దాతపై ప్రభుత్వం ‘సాంకేతిక’ ప్రతాపం చూపిస్తోంది. వానాకాలం సాగు ముమ్మరమై , ఎరువులు అత్యంత అవసరమైన కీలక తరుణంలో ‘యూరియా యాప్’ పేరుతో కొత్త ఆంక్షలు తెరపైకి తెచ్చింది. మద్యం కొనేవాడికి లేని రూల్స్..కోట్లు కుమ్మరించే వ్యాపారాలకు లేని నిబంధనలు..కేవలం ముఖానికి మురికి అంటుకుని , బురదలో శ్రమించే రైతుకేనా..? ఒక్క యూరియా బస్తా కావాలంటే యాప్‌లో నమోదు కావాలి , ఓటీపీ రావాలి , సర్వర్ కరుణించాలి..! ఇంతటి దారుణమైన వివక్షపై క్షేత్ర స్థాయిలో రైతాంగం అగ్గిలం కవుతోంది.

పల్లెల్లో ‘నెట్’ లేదు.. చేతిలో ‘స్మార్ట్’ లేదు...

డిజిటల్ విప్లవం గురించి కాగితాల్లో చెప్పుకోవడమే తప్ప , గ్రామీణ తెలంగాణ లో వాస్తవాలు భిన్నంగా ఉన్నాయి. నేటికీ వేలాది మంది వృద్ధులకు , సామాన్య రైతులకు స్మార్ట్ ఫోన్ వాడకం చేతకాదు.?నరకప్రాయంగా మారిన క్యూ లైన్లు..ఒకవైపు ఎండలు..మరోవైపు ఉరుకులు పరుగుల వ్యవసాయ పనులు వది లేసి , రైతులు తెల్లవారు జాము నుంచే ఎరువుల దుకాణాల ముందు పడి గాపులు కాస్తున్నారు.

సర్వర్ డౌన్..రైతు బేజార్...

తీరా లైన్లోకి వచ్చాక ‘సర్వర్ పనిచేయడం లేదు’ అనే ఒకే ఒక్క మాటతో రోజంతా నిరీక్షించిన రైతు ఖాళీ చేతులతో వెనుతిరగాల్సి వస్తోంది. దీంతో వ్యవసాయ పనులు కుంటపడుశహ తున్నాయి.

‘మద్యం’ విక్రయాలకు లేని నిబంధనలు.. ఎరువులకేనా...?

ప్రభుత్వ ద్వంద్వ నీతిపై సర్వత్రా నిరసనలు వ్యక్త మవుతున్నాయి. వందల కోట్ల మద్యం విక్రయాలు ఎలాంటి గుర్తింపు కార్డులు , యాప్‌లు లేకుండా యథేచ్ఛ గా సాగుతుంటే..దేశానికి వెన్నెముక అయిన రైతును మాత్రం ప్రతి చిన్న విషయానికి అనుమా నించడం ఎంతవరకు సమంజసమని విపక్షాలు , రైతు సంఘాలు నిల దీస్తున్నాయి. పారదర్శకత అనేది రైతును వేధించ డానికి అస్త్రంగా మార కూడదని మేధావులు హెచ్చరిస్తున్నారు. మందు బాబులకు రెడ్ కార్పెట్ పరిచే సర్కారు..మట్టిని నమ్ముకున్న రైతును మాత్రం యాప్‌ల పేరుతో ముప్పు తిప్పలు పెడుతోంది. ఇది పారదర్శకత కాదు..పరమ రాక్షసత్వం..?

రైతు సంఘాల తీవ్ర ఆగ్రహం..?అన్నదాత ఆక్రందన..ప్రభుత్వం ఏం చేయాలి...?

ఖరీఫ్ సీజన్ చేజారిపోక ముందే ప్రభుత్వం కంటి తుడుపు చర్యలు పక్కన బెట్టి , యుద్ధప్రాతిపదికన ఈ క్రింది నిర్ణయాలు తీసు కోవాలని డిమాండ్లు వ్యక్త మవుతున్నాయి. క్షేత్ర స్థాయి సంక్షోభం..పత్రికల ద్వారా పరిష్కారం.. సాంకేతిక అక్షరాస్యత లేమి. యాప్ నిబంధనను తక్షణమే రద్దు చేసి , పాత పద్ధతిలోనే ఎరువులు పంపిణీ చేయాలి.

సెంటర్లో సర్వర్ల మొరాయింపు...

నెట్‌వర్క్ సాకులు చెప్పకుండా ప్రతీ రైతుకు అవసరమైన మేర యూరియా స్టాక్ అందుబాటులో ఉంచాలి.

రైతన్నల సమయం వృథా...

వ్యవసాయ అధికారులే నేరుగా గ్రామాల్లోకి వచ్చి సొసైటీల (పిఎసిఎస్) ద్వారా పంపిణీ పర్య వేక్షించాలి.

‘యాప్’ బంధాలు తెంచండి..సాగును రక్షించండి...?

సాంకేతికత ఎప్పుడైనా రైతుకు తోడుగా నిలవాలి గానీ , వాడి తోలు వలిచేలా మారకూడదు. పెట్టుబడుల భారం , వర్షాల అనిశ్చితితో ఇప్పటికే సతమత మవుతున్న అన్నదాతను ఈ ‘యాప్’ ఉచ్చు నుంచి తక్షణమే విముక్తి చేయాలి. పారదర్శకత పేరుతో సాగుకు ఆటంకాలు సృష్టించ కుండా , సులభ తరమైన పద్ధతిలో ఎరువులు అందించి ఖరీఫ్ సీజన్‌ను గట్టెక్కించాల్సిన బాధ్యత పూర్తిగా ప్రభుత్వం పైనే ఉంది.

## నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా పాఠ్యపుస్తకాలముతున్న బుక్ స్టాల్స్ పై చర్య తీసుకోవాలి..

- ధరలు,ప్రచురణకర్తల వివరాలు లేని స్కూల్ పుస్తకాలను అమ్ముతున్న బుక్ స్టాల్స్ పై చర్యలు తీసుకోవాలి
- ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి చాకలి అనిల్



**ప్రజా వాణి,వికారాబాద్ జిల్లా,జూన్20:** విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీ చేస్తూ ధరలు, ప్రచురణకర్తల వివరాలు ముద్రించని స్కూల్ పుస్తకాలను అమ్ముతున్న బుక్ స్టాల్స్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో డిఈఓ కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి చాకలి అనిల్ మాట్లాడుతూ, జిల్లాలోని అనేక ప్రైవేట్ పాఠశాలలు యాజమాన్యం నిర్దిష్ట బుక్ స్టాల్స్‌తో కుమ్మక్కై విద్యార్థులను అక్కడే పుస్తకాలు కొనుగోలు చేయాలని ఒత్తిడి చేస్తున్నాయని ఆరోపించారు. మార్కెట్‌లో అమ్ముతున్న అనేక స్కూల్ పుస్తకాలపై గరిష్ట చిల్లర ధర, ప్రచురణకర్త పేరు,చిరునామా, ముద్రణ వివరాలు లేకపోవడం గమనార్హమన్నారు. ధరలు మరియు ప్రచురణకర్తల వివరాలు లేకుండా పుస్తకాలను అమ్ముతున్న వినియోగదారుల హక్కులకు విరుద్ధమని,సంబంధిత చట్టాల ప్రకారం ఇది శిక్షార్హమైన నేరమని పేర్కొన్నారు. పుస్తకాల అసలు ధర ఎంతో తెలియని పరిస్థితిలో తల్లిదండ్రుల నుంచి అధిక మొత్తాలు వసూలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి సంవత్సరం విద్యా సంవత్సరం ప్రారంభంలో ప్రైవేట్,కార్పొరేట్ పాఠశాలలు పుస్తకాలు, నోట్‌బుక్స్,యూనిఫాంల పేరుతో వేలాది రూపాయలు వసూలు చేస్తూ తల్లిదండ్రులపై తీవ్రమైన ఆర్థిక భారం మోపుతున్నాయని విమర్శించారు. విద్యను వ్యాపారంగా మార్చే ఈ ధోరణిని ప్రభుత్వం అరికట్టాలని డిమాండ్ చేశారు. అలాగే జిల్లాలోని అన్ని బుక్ స్టాల్స్‌పై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి,ధరలు మరియు ప్రచురణకర్తల వివరాలు లేని పుస్తకాల విక్రయాలను నిలిపివేయాలని,అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులు,తల్లిదండ్రుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ దీపక్ , అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపల్లి జిల్లాకు రాష్ట్రస్థాయి గుర్తింపు తీసుకొచ్చిన

- జిల్లా కలెక్టర్‌కు టీఎన్‌జీఓ సంఘం ఘన సన్మానం





**ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి, జూన్ 20:** ప్రభుత్వ విద్యాభివృద్ధిలో విశేష కృషి చేసి పెద్దపల్లి జిల్లాకు రాష్ట్రస్థాయి గుర్తింపు తీసుకువచ్చిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, జిల్లా విద్యాధికారి శారదలను టీఎన్‌జీఓ జిల్లా సంఘం ఘనంగా సన్మానించింది. ప్రభుత్వ పాఠశాలలకు నూతన రూపు తీసుకురావడం, విద్యార్థుల ప్రవేశాలను గణనీయంగా పెంచడం, ఉత్తమ విద్యా ఫలితాల సాధనకు కృషి చేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, జిల్లా విద్యాధికారి శారద ప్రత్యేక రాష్ట్రస్థాయి అవార్డు అందుకోవడం పట్ల టీఎన్‌జీఓ జిల్లా సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీఎన్‌జీఓ జిల్లా సంఘం నాయకులు కలెక్టర్‌ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ, జిల్లాలో ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతానికి, ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించేందుకు జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాధికారి చేపట్టిన చర్యలు అభినందనీయమని పేర్కొన్నారు. వారి నాయకత్వంలో పెద్దపల్లి జిల్లా విద్యా ప్రమాణాల్లో రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు సాధించడం గర్వకారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు బొంకూరి శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి అయిరెడ్డి సందీప్ రెడ్డి, అసోసియేట్ అధ్యక్షురాలు గోపు అనిత, ఉపాధ్యక్షులు ఆడెపు శ్రీనివాస్, స్వప్న, కలెక్టరేట్ వింగ్ అధ్యక్షుడు అమరేందర్ రెడ్డి, కార్యదర్శి ప్రేమ్ సాగర్, కోశాధికారి రామచంద్రం, శిల్పా, సౌమ్య, రామదేవి, స్వప్న, ప్రవీణ్, సంతోష్, ప్రచేతన్ తదితర టీఎన్‌జీఓ సభ్యులు పాల్గొన్నారు. జిల్లాకు మరిన్ని రాష్ట్ర, జాతీయ స్థాయి పురస్కారాలు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, జిల్లా విద్యాధికారి శారదలకు సంఘ ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.

# వార్షిక విద్యా ప్రణాళిక పై సమావేశం

- పాల్గొన్న ఎంఈఓ దాసరి లక్ష్మి





**మంథని నియోజకవర్గం, జూన్ 20, ప్రజావాణి:** మంథని మండల వార్షిక విద్యా ప్రణాళిక గురించి మంథని మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపా ధ్యాయులకు ఓరియంటేషన్ కార్యక్రమం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగింది. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి దాసరి లక్ష్మి మాట్లాడుతూ నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైన దృష్ట్యా ఉపాధ్యాయులంతా ఆన్లైన్ మరియు ఆఫ్ లైన్ రిపోర్టుల విషయంలోనూ విద్యార్థుల ప్రగతిని మెరుగుపరిచే దిశగా ప్రయత్నం చేసి పెద్దపల్లి జిల్లాలో మంథని మండల స్థానాన్ని మరింత ముందుకు తెచ్చేలా కృషి చేయాలని కోరారు. పర్ఫార్మెన్స్ గ్రేడ్ ఇండికేటర్ల మదింపులో పెద్దపెల్లి జిల్లా ప్రథమ స్థానాన్ని సాధించినందుకు గాను అందుకు కృషి చేసిన ఉపాధ్యాయులను ఆమె అభినందించారు. ఈ విద్యా సంవత్సరం కూడా ఇదే విధంగా కృషి చేసి మంచి ఫలితాలను సాధించాలని తెలిపారు. ఈ సందర్భంగా జెడ్పిహెచ్ఎస్ బాయ్స్, జి హెచ్ ఎస్, ఆరెంద పాఠశాల సముదాయాల ప్రధానోపాధ్యాయులు మోసం శ్రీనివాస్, జె.సురేష్ కుమార్, ఈదులపల్లి నరసింహారావు లు మాట్లాడుతూ తమ పాఠశాల సముదాయాలలో పనిచేసే ఉపాధ్యాయులంతా ఎఫ్ ఎల్ ఎన్ లోని అన్ని సామర్థ్యాలలో మంచి ఫలితాలు వచ్చేలాగా కృషి చేయాలని తద్వారా స్కూల్ కాంప్లెక్స్ యొక్క ర్యాంకింగ్ ను పెంచాలని కోరారు. జెడ్పిహెచ్ఎస్ గర్ల్స్ ప్రధానోపాధ్యాయురాలు సుమలత మాట్లాడుతూ గత సంవత్సరం లాగా అనే ఈ సంవత్సరం కూడా ఉపాధ్యాయులంతా తమ తమ పాఠశాలలో అద్భుతమైన ఫలితాలను సాధించాలని తెలిపారు. ఈ సందర్భంగా మంథని మండలంలోని మల్లెపల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుడు ఎగ్గడి సురేష్ గత విద్యా సంవత్సరం పాఠశాల మొత్తం హాజరులో 90 శాతం హాజరు సాధించినందుకు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నవీన్ నికోలస్ అందజేసిన ప్రశంసపత్రాన్ని ఎం ఈ వో, స్కూల్ కాంప్లెక్స్ జానపద గేయాల చేతుల మీదుగా అందుకున్నారు. ఇట్టి అరుదైన ప్రశంసను అందుకున్నందుకు ఆయనను పలువురు ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్ లు మల్లయ్య, సుప్రజ, రాధిక, స్వప్న, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# అత్యవసర పరిస్థితుల్లో జిల్లా కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలి

● జిల్లా రెవెన్యూ అధికారి రాంమూర్తి





**ఖమ్మం బ్యూరో ప్రతినిధి మన ప్రజావాణి** జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదేశాల మేరకు జిల్లాలో అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు కలెక్టరేట్ లో జిల్లా కంట్రోల్ రూమ్‌ను ప్రారంభించినట్లు జిల్లా రెవెన్యూ అధికారి సి. హెచ్. రాంమూర్తి శనివారం తెలిపారు. జిల్లా కంట్రోల్ రూమ్ 24 గంటల పాటు మూడు షిఫ్టుల్లో నిరంతరాయంగా పని చేస్తుందని అన్నారు. భారీ వర్షాలు, వరదలు, ప్రకృతి వైపరీత్యాలు, తదితర అత్యవసర పరిస్థితుల సమాచారాన్ని ప్రజలు వెంటనే కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు టోల్ ఫ్రీ నంబర్ 1077 లేదా మొబైల్ నంబర్ 9063211298 కు ఫోన్ చేసి సమాచారం అందించవచ్చని తెలిపారు. అలాగే వ్యవసాయానికి సంబంధించి జిల్లాలో నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువుల విక్రయాలు, ఇతరాలపై కూడా ప్రజలు కంట్రోల్ రూమ్‌కు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. కంట్రోల్ రూమ్‌కు వచ్చే ప్రతి కాల్, ఫిర్యాదును నమోదు చేసి సంబంధిత శాఖలకు వెంటనే సమాచారం అందజేసి సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు అత్యవసర సమయాల్లో కంట్రోల్ రూమ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి సి. హెచ్. రాంమూర్తి కోరారు.

# మోతె మండల కేంద్రంలో ఘనంగా జన్మదిన వేడుకలు..



**ప్రజావాణి మోతే జూన్ 20:** నాడు దేశ సరిహద్దుల్లో శత్రువులకు సింహస్వప్నంగా నిలిచిన జవాన్...నేడు తెలంగాణ రైతన్నల సంక్షేమానికి అంకితభావంతో పనిచేస్తున్న నాయకుడు... ప్రజాసేవే పరమావధిగా ముందుకు సాగుతు మోతె మండలన్నీ లిఫ్ట్ ద్వారా సశ్య శ్యామలం చేసిన రైతు బంధువు, ప్రజానాయకుడు, నీటిపారుదల, ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రివర్యులు లిశ్రీ టైగర్ ఉత్తమ్ కుమార్ రెడ్డి లి జన్మదిన వేడుకలను మోతే మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కీసర సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు జరిపి పండ్లు పంపిణీ చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమం లో మాజీ జడ్పీటీసీ పందిళ్ళపల్లి పుల్లారావు, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ముదిరెడ్డి మధుసూదన్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకురాలు నంద్యాల అరుణమ్మ, మోతె సర్పంచ్ దోసపాటి అనురాధ,మామిళ్ళగూడెం గ్రామ సర్పంచ్ కొరివి నాగమణి వీరస్వామి, మామిళ్ళగూడెం మాజీ సర్పంచ్ యల్లయ్య,మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పులి ఈదయ్య గౌడ్,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెలుగు వీరన్న, కాంగ్రెస్ నాయకులు బొక్క వీర రెడ్డి, బొడ్డు నర్సయ్య, మామిడి వెంకటేశ్వర్లు గౌడ్, మేకల కృష్ణ, మరియు గ్రామాల గ్రామశాఖ అధ్యక్షులు, సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు, మాజీ సర్పంచ్ లు,వార్డు సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, పాత్రికేయ మిత్రులు, పాల్గొన్నారు.

# మోతే - బోడబండ్ల గూడెం గ్రామల సర్పంచ్ లు కాంగ్రెస్ లో చేరిక...



**ప్రజావాణి మోతే జూన్ 20:** మోతె మండల కేంద్రంలో మోతె గ్రామ సర్పంచ్ దోసపాటి అనురాధ అంజి గారు మరియు బోడబండ్ల గూడెం గ్రామ సర్పంచ్ కాంపెల్లి ఉమ శ్రీనివాస్ గారు MLA పద్మావతి రెడ్డి గారి అభివృద్ధి పనులకు ఆకర్షితులైన వారిని మోతె మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లికీసర సంతోష్ రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి వారికి శుభాకాంక్షలు తెలిపారు.. ఇట్టి కార్యక్రమం లో మాజీ జడ్పీటీసీ పందిళ్ళపల్లి పుల్లారావు, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ముదిరెడ్డి మధుసూదన్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి నంద్యాల అరుణమ్మ,మామిళ్ళగూడెం గ్రామ సర్పంచ్ కొరివి నాగమణి వీరాస్వామి,జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కుప్పరాజు సతీష్ బాబు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పులి ఈదయ్య గౌడ్,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెలుగు వీరన్న, కాంగ్రెస్ నాయకులు బొక్క వీర రెడ్డి, బొడ్డు నర్సయ్య, మామిడి వెంకటేశ్వర్లు గౌడ్, మేకల కృష్ణ, మరియు గ్రామాల గ్రామశాఖ అధ్యక్షులు, సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు, మాజీ సర్పంచ్ లు,వార్డు సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# పలాస గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం జరిగింది

● కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె .వెంకటలక్ష్మి ఆధ్వర్యం లో సాగింది.





**పలాస ప్రజావాణి ప్రతినిధి** శ్రీకాకుళం జిల్లాలో నీ పలాసలో స్వర్ణాంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం స్థానిక గవర్నమెంట్ డిగ్రీ కళాశాల, పలాసలో శనివారము "స్వర్ణాంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఆపరేషన్ క్లీన్ స్వీప్ డ్రైవ్ విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె. వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు కళాశాల ప్రాంగణం, తరగతి గదులు, ప్రయోగశాలలు (ల్యాబొరేటరీలు),క్రీడా మైదానం తదితర ప్రాంతాలను పరిశుభ్రపరిచారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ప్రిన్సిపాల్ డాక్టర్ జె. వెంకటలక్ష్మి మాట్లాడుతూ, స్వర్ణాంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశ్యం ప్రతి ఒక్కరిలో పరిశుభ్రత పట్ల బాధ్యతను పెంపొందించడం అని తెలిపారు. ప్రతి వ్యక్తి తన పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడాలని సూచించారు. ఈ కార్యక్రమం ఎన్ఎస్ఎస్ విభాగం డాక్టర్ పి. మధు ఆధ్వర్యంలో నిర్వహించబడింది. కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ పి. వెంకటరమణ , సైన్స్ విభాగ అధ్యక్షులు ఎన్. శ్రీనివాస్ పట్నాయక్ , డాక్టర్ వై. వెంకటలక్ష్మి , ఇతర అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కుంజా వనజ మృతిపై డా" రవీందర్ నాయక్ డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ఆరా..

● ప్రోగ్రాం అధికారులతో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష





**భద్రాద్రి జిల్లా బ్యూరో/మన ప్రజావాణి (జూన్ 20):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇటీవల చోటుచేసుకున్న కుంజ వనజ మృతి ఘటనపై డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ & ఫ్యామిలీ వెల్ఫేర్ డా. రవీందర్ నాయక్ జిల్లాకు విచ్చేసి కుంజా వనజ మృతి సంఘటనపై సమగ్రంగా ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య & ఆరోగ్య అధికారి డా. తుకారాం రాథోడ్, డా" రవిబాబు డిసిహెచ్ఎస్, సంబంధిత వైద్య అధికారులు, ఆరోగ్య సిబ్బందితో సమావేశమై గర్భిణికి అందించిన వైద్య సేవలు, చికిత్స వివరాలు, రిఫరల్ ప్రక్రియ, సంఘటనకు దారితీసిన పరిస్థితులు తదితర అంశాలపై పూర్తి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత రికార్డులను పరిశీలించి, విధుల నిర్వహణలో ఎలాంటి లోపాలు జరిగాయో సమగ్రంగా విచారణ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. విచారణ నివేదికను త్వరితగతిన ప్రభుత్వానికి సమర్పించాలని సూచించారు. తదుపరి డైరెక్టర్ డా" రవీందర్ నాయక్ జిల్లా వైద్య & ఆరోగ్య శాఖ ప్రోగ్రాం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో అమలవుతున్న వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పురోగతి, మాతా-శిశు ఆరోగ్య సేవలు, కుటుంబ నియంత్రణ, వ్యాధి నియంత్రణ కార్యక్రమాలు, అసంక్రమిత వ్యాధుల (ఎన్సిడి) స్క్రీనింగ్, టీకా కార్యక్రమం, ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ల పనితీరు, సికిల్ సెల్ అనీమియా నియంత్రణ కార్యక్రమం, క్షయవ్యాధి నిర్మూలన, కుష్టు నిర్మూలన, వెక్టర్ బోర్న్ వ్యాధుల నివారణ తదితర అంశాలపై కార్యక్రమాల వారీగా సమీక్ష నిర్వహించారు. ప్రతి కార్యక్రమంలో నిర్దేశించిన లక్ష్యాలను శాతానికి శాతం సాధించాలని, పెండింగ్ అంశాలను వెంటనే పూర్తి చేయాలని, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ వైద్య సంస్థల్లో గర్భిణులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, హైరిస్క్ గర్భిణులను ముందస్తుగా గుర్తించి ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచాలని, అత్యవసర పరిస్థితుల్లో రిఫరల్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. మాతా-శిశు మరణాల నివారణకు ప్రతి ఆరోగ్య కార్యకర్త బాధ్యతాయుతంగా పనిచేయాలని, వైద్య సేవల నాణ్యతను మరింత మెరుగుపరచాలని డైరెక్టర్ డా. రవీందర్ నాయక్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో డా" తుకారాం రాథోడ్ డిఎంహెచ్ఓ, డా" రవిబాబు డిసిహెచ్ఎస్, డా" ప్రతాప్ ప్రోగ్రాం ఆఫీసర్ డా" ప్రసాద్ ప్రోగ్రాం ఆఫీసర్, డా" దినేష్ ప్రోగ్రాం ఆఫీసర్, మోహన్, రామ్ ప్రసాద్, విప్లవ్ కుమార్, సలిత, శ్రీధర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు

# పంట దిగుబడి మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

● 34 రకాల సన్న వడ్లకు ప్రకటించిన బోనస్ అమలు చేయాలి --

● మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి



**ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి, జూన్ 20:** కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో సంబంధం లేకుండా రాష్ట్రంలోని రైతులు పండించిన వరి పంట మొత్తం రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, ఎన్నికల సమయంలో ప్రకటించిన 34 రకాల సన్న వడ్లకు బోనస్ చెల్లించాలని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రైతు బీమా ప్రీమియంను వెంటనే చెల్లించి, ఎకరానికి రూ.15 వేల రైతు భరోసా పథకాన్ని అమలు చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను విడనాడి ఎన్నికల హామీలను నెరవేర్చాలని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రైతులకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రైతు భరోసా పథకాన్ని పలుమార్లు వాయిదా వేసి, రెండు పర్యాయాలు కేవలం రెండు ఎకరాలకే పరిమితం చేయడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. రైతు బీమా పథకం అమలులోనూ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, ఈ ఏడాది ప్రీమియం సకాలంలో చెల్లించకపోవడం వల్ల ఇటీవల మరణించిన రైతుల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సన్న రకం వడ్లకు బోనస్ విషయంలో కూడా ప్రభుత్వం మాట తప్పిందని ఆయన అన్నారు. ఎన్నికల ముందు అన్ని రకాల వడ్లకు బోనస్ ఇస్తామని ప్రకటించి, అధికారంలోకి వచ్చిన తర్వాత 34 రకాల సన్న వడ్లకే పరిమితం చేసిందని, ప్రస్తుతం ఆ జాబితాలోని కొద్ది రకాలనే సాగు చేయాలని షరతులు విధించడం రైతులకు అన్యాయమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం వరి కొనుగోళ్లు పరిమితం చేస్తోందనే కారణాన్ని చూపుతూ రాష్ట్ర ప్రభుత్వం కూడా కొనుగోళ్ల నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. ఖరీఫ్ సీజన్‌కు ముందే వరి కొనుగోళ్లపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని, యూరియా కొరత లేకుండా చూడడంతో పాటు పెరిగిన ఎరువుల ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి ఏడాది వేల కోట్ల రూపాయలు వెచ్చించి రైతులు పండించిన వరి మొత్తాన్ని కొనుగోలు చేశామని, రైతు బీమా, రైతు పెట్టుబడి సాయం, ఎరువుల సరఫరా వంటి అంశాల్లో రైతులకు పూర్తి భరోసా కల్పించామని తెలిపారు. రైతులకు ఇచ్చిన ప్రతి హామీని వెంటనే అమలు చేయాలని, రైతు భరోసా నిధులను విడుదల చేయాలని, రైతు బీమా బకాయిలు చెల్లించాలని, సన్న రకం వడ్ల బోనస్ విషయంలో రైతులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు నూనేటి సంపత్, స్రవంతి మోహన్ రావు, సందీప్ రావు, మార్కు లక్ష్మణ్, పారుపల్లి గుణపతి, కూకట్ల గోపి, వెన్నం రవీందర్, మోబిన్, పెంచల శ్రీధర్, పూదరి చంద్రశేఖర్, సలేంద్ర రాములు, ఫకీర్ యాదవ్, దీకొండ భూమేష్, అనుముల బాపూరావు, కాల్వల ఓదన్న, రేవల్లి తిరుపతి, మియాపూర్ శ్రీనివాస్, పోసాని శ్రీనివాస్, గందె మల్లికార్జున్, తిప్పారపు దయాకర్, ఆరెపల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# బిఅర్ఎస్ నాయకులు అసత్య ప్రచారాలు మానుకోవాలి

■ బిల్లులు రాక ప్రారంభం ఆలస్యమన్నది అవాస్తవం.

■ అంగన్వాడీ భవన నిర్మాణ కాంట్రాక్టర్ ఈగ ప్రశాంత్.

■ అసత్య ప్రచారాలతో తమ ఉనికిని చాటుకునే ప్రయత్నం.

■ గ్రామ సర్పంచ్ ముస్కుల నరేందర్ రెడ్డి.

■ త్వరలో మంత్రి శ్రీధర్ బాబు చేతుల మీదుగా అంగన్వాడీ భవనం ప్రారంభం.

■ గ్రామ శాఖ అధ్యక్షుడు గర్రేపల్లి ప్రవీణ్ గౌడ్.







**రామగిరి,మన సమగ్ర ప్రజావాణి జూన్ 20**సుందిల్ల గ్రామంలో నూతన అంగన్వాడీ భవనం ప్రారంభంపై బిఅర్ఎస్, టిఆర్ఎస్ ఎ పార్టీలో ఉన్నామో తెలియని కొందరు మిడిమిడి జ్ఞానంతో సుందిల్ల గ్రామ సామాజిక మాధ్యమాల్లో చేస్తున్న అసత్య ప్రచారాలను గ్రామ ప్రజలు నమ్మే పరిస్థితి లేదని,గత పదేండ్ల బిఅర్ఎస్ ప్రభుత్వంలో కట్టలేని అంగన్వాడీ భవనాన్ని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండున్నర సంవత్సరాల్లో భవన నిర్మాణం పూర్తి చేశామని,గ్రామ సర్పంచ్ ముస్కుల నరేందర్ రెడ్డి తెలిపారు. అంగన్వాడీ ప్రారంభం,బిల్లులు చెల్లించకపోవడంతో భవనం ప్రారంభం ఆలస్యం అవుతోందని జరుగుతున్న ప్రచారంపై సదరు అంగన్వాడీ భవన నిర్మాణ కాంట్రాక్టర్ ఈగ ప్రశాంత్ ని మన సమగ్ర ప్రజావాణి వివరణ కోరగా బిల్లుల చెల్లింపు వల్ల అంగన్వాడీ భవనం ప్రారంభం ఆలస్యమన్నది అవాస్తవమని,వర్షాకాల దృష్ట్యా పిల్లలకు త్వరిత గతిన పూర్తి చేసి అందించాలన్నది ప్రభుత్వ, అధికారుల ముఖ్య ఉద్దేశమని త్వరిత గతిన పూర్తి చేయడానికి సహకరించిన అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఈగ ప్రశాంత్ కృతజ్ఞతలు తెలుపడం జరిగింది. అంగన్వాడీ భవన తాళాలు కాంట్రాక్టర్ వద్ద లేవని తమ దగ్గరే ఉన్నాయని,కాంగ్రెస్ పార్టీ నాయకుల,అధికారులు ఒత్తిడి తమ మీద లేదని, అంగన్వాడీ టీచర్ పద్మ తెలుపడం జరిగింది. గ్రామ శాఖ అధ్యక్షుడు గర్రేపల్లి ప్రవీణ్ గౌడ్ మాట్లాడుతూ... అంగన్వాడీ కేంద్ర ప్రారంభం త్వరలోనే మంత్రి శ్రీధర్ బాబు చేతుల మీదుగా అంగన్వాడీ భవనాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని వెల్లడించారు. గ్రామానికి మెరుగైన సౌకర్యాలు కల్పించడమే తమ లక్ష్యమని, ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి తమ రాజకీయ ఉనికికి భంగం కలుగుతుందనే ఆందోళనతోనే కొందరు బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారాలకు పాల్పడుతున్నారని అసలు మీరు టిఆర్ఎస్,బిఅర్ఎస్ ఎ పార్టీ ఉన్నారో తెలియని అయోమయ పరిస్థితుల్లో మాట్లాడుతూ అసత్య ప్రచారాలు చేసుకోవడం తప్ప ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని అన్నారు. ప్రజలు జరుగుతున్న అభివృద్ధిని, సంక్షేమ పథకాలను గుర్తించాలని గత బిఅర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం ప్రజా పాలనలో భాగంగా గ్రామంలో చేస్తున్న అభివృద్ధిని గుర్తించి తోడ్పడాలని ఆయన కోరారు.


Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at RAMANI WEB OFFSET PRINTERS, Auto Nagar, Bommakal, Karimnagar, Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONS, Ankireddypally, Thanggellapally, Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443 Contact No : 9440032006. MAIL ID : Kumaraswamyrayinipatla@gmail.com

# ఆర్లగూడెం ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఐటీడీఏ పీవో

- విద్యార్థులకు మెనూ పక్కాగా అందించాలి.
- విద్యార్థులకు చదువుతోపాటు కళలు, క్రీడలపై ప్రతిభా నైపుణ్యాలను వెలికితీయాలి.
- పాఠశాల పరిసరాలను ప్రతి రోజూ పరిశుభ్రత ఉంచాలి.
- విద్యార్థులపట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవు..







**దుమ్ముగూడెం/మన ప్రజావాణి (జూన్ 20):** గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో చదువుకున్న విద్యార్థిని విద్యార్థులకు చదువుతోపాటు, వారికి ఇష్టమైన కళలు క్రీడల పట్ల మక్కువ కలిగించి, వారిలో దాగివున్న ప్రతిభా నైపుణ్యాలను ఇప్పటి నుండే వెలికి తీయాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. శనివారం రోజు దుమ్ముగూడెం మండలంలోని ఆర్లగూడెం గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి పాఠశాల పరిసరాలు తరగతి గదులు లైబ్రరీ రూము, డైనింగ్ హాల్, విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనాన్ని, పిల్లలకు సరఫరా చేసే నోట్ బుక్స్ టెక్స్ట్ బుక్ అలాగే మండలంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమం ఎలా జరుగుతుందో ఫోన్లో వీడియో ద్వారా ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవులకు తమ గ్రామాలకు వెళ్లి తిరిగి పాఠశాలకు వచ్చిన విద్యార్థినీ విద్యార్థులకు వాతావరణం మార్పు వలన అనారోగ్యానికి గురి అయ్యే అవకాశం ఉన్నందున తప్పనిసరిగా విద్యార్థుల యొక్క మానసిక స్థితిగతులను హెచ్ఎం, ఉపాధ్యాయులు గమనించి, వారికి సకాలంలో వైద్యం చేయించాలని అన్నారు. వర్షాకాలం నడుస్తున్నందున విద్యార్థుల ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని, విషపూరితమైన క్రిమి కీటకాలు సంచరిస్తూ ఉంటాయని కనుక రాత్రిపూట విద్యార్థులు ఎవరు బయటకు రాకుండా చూడాలని, ప్రతిరోజు వంటగది శుభ్రంచేసి, మెనూ ప్రకారము విద్యార్థులకు వేడిగా ఉన్న ఆహారాన్ని వడ్డించాలని అన్నారు. పాఠశాల ఆవరణ శుభ్రంగా ఉండేలా చూడాలని, పాఠశాల చుట్టూ వర్షపు నీరు నిలవకుండా సైడ్ డ్రైన్లు శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. అనంతరం చిన్న ఆర్లగూడెం, కొంగవాగుగుంపు జిపిఎస్ పాఠశాలలను పరిశీలించి, పిల్లల చేత ఉద్దీపకం వరకు బుక్ లోని అంశాలను చదివించి సంతృప్తి వ్యక్తం చేస్తూ, ఈ సంవత్సరం ఉద్దీపకం వర్క్ బుక్ లోని అంశాలు మార్పులు చేర్పులు చేయడం జరిగిందని, సంబంధిత ఉపాధ్యాయులు ఉద్దీపకం వర్క్ బుక్ లోని పదాలను పిల్లల చేత బోర్డుపై వ్రాయించి, వాటి అర్థాలను వారి చేత చెప్పించాలని, అలాగే ప్రతిరోజు బోధించే పాఠ్యాంశాలతో పాటు, అదనంగా విద్యార్థులకు వారికి ఇష్టమైన వ్యాసరచన, క్విజ్, నాటికలు, ఏకపాత్రాభినయానికి సంబంధించిన కలల పట్ల అవగాహన కలిగించాలని ఉపాధ్యాయులకు సూచిస్తూ, వీటితోపాటు క్రీడలపై కూడా మక్కువ కలిగించాలని అన్నారు. సరదాగా పిల్లలతో క్రికెట్ ఆడి దానికి సంబంధించిన మెలకువలు చిన్నారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సోమశేఖర్, వార్డెన్ లక్ష్మణరావు, ఎస్సీఆర్పి విటల్, జిపిఎస్ పాఠశాల హెచ్ఎంలు పాపారావు, కన్నారావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంపై బీఎల్ఓలు, బీఎల్ఓ సూపర్వైజర్లకు శిక్షణ




**ప్రజావాణి శాయంపేట** మండల రైతు వేదికలో శనివారం ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమ నిర్వహణపై బీఎల్ఓలు, బీఎల్ఓ సూపర్వైజర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఆర్. ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. ప్రతి బీఎల్ఓ తమ పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఎన్యూమరేషన్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. అర్హులైన ప్రతి ఓటరు జాబితాలో ఉండేలా, వివరాల సేకరణలో పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సేకరించిన సమాచారాన్ని ప్రతిరోజూ ఆన్‌లైన్‌లో నమోదు చేసి, పెండింగ్ లేకుండా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డీఎల్ఎంటీలు ఎన్. తిరుపతి, ఎం. రామయ్య, గిర్దావర్ చిమన్ నాయక్, ఆపరేటర్ ఎ. రాజేష్, బీఎల్ఓ సూపర్వైజర్లు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

## గుడ్డ బద్రలో ఘనంగా శ్రీ శ్రీ శ్రీ సీతారామాలయం ప్రధమ వార్షికోత్సవం



**పలాస ప్రజావాణి ప్రతినిధి :** శ్రీకాకుళం జిల్లా మెళియపుట్టి మండలం గుడ్డిబ్రద గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ సీతారామాలయం ప్రధమ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు గ్రామస్తులు మరియు ఆలయ కమిటీ వారు. కార్యక్రమం లో భాగంగా ఉదయం గణపతి పూజ ,హోమం కార్యక్రమం నిర్వహించారు. తదనంతరం వచ్చిన భక్తులకు అన్నప్రసాదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం సీతారాముల వారిని తీరువీధుల్లో లో చిన్న పెద్ద తేడా లేకుండా పాడుతూ ఆడుతూ అంగరంగ వైభవంగా ఊరేగించారు. చిన్నారులచే కోలాటం అందరిని ఆకట్టుకుంది. చిన్న గ్రామమైన పది గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తున్నారని చుట్టుపక్క గ్రామస్తులు కొనియాడారు.

# లోక్ అదాలత్ లో మొత్తం 17344 కేసుల పరిష్కారం...

- 2 సివిల్ కేసులు..2064 క్రిమినల్ కేసులు...
- 15278 ట్రాఫిక్ చాలన్లు..42 పి.ఎల్.సి కేసులు.
- పరిష్కరించబడ్డాయి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ జయరాజు.



**యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి జూన్ 20** జాతీయ లోక్ అదాలత్ ను పురస్కరించు కొని జిల్లాలోని అన్ని కోర్టులలో శనివారం రోజు రెండవ జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వ హించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో భువనగిరి కోర్టు ఆవరణలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అధ్యక్షులు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ. జయరాజు సూచనలతో లోక్ అదాలత్ కార్య క్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ మూర్తి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఈ జాతీయ లోక్ ఆదాలత్ లో 2 సివిల్ కేసులు , 2064 క్రిమినల్ కేసులు , ట్రాఫిక్ చలన కేసులు 15278 , 42 పి ఎల్ సి కేసులు , మొత్తంగా 17344 కేసులు పరిష్కరించ బడ్డాయని , జిల్లాలోని న్యాయ మూర్తులు , న్యాయ వాదులు , జిల్లా పోలీసు యంత్రాంగం , కోర్టు సిబ్బంది కృషి చేసారని , కక్షిదారులు లోక్ అదాలత్ లో రాజీ చేసుకోవటం వలన నైతికంగా ,కుటుంబ పరంగా,ఆర్థిక పరంగా నిలదొక్కుకుంటారని తెలిపి జులై 18వ తేది చెక్ బౌన్స్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వ హించనున్నట్లు తెలిపారు. సుప్రీం కోర్టులో పెండింగులో ఉన్న కేసులలో రాజీ చేసుకొనే అవకాశాన్ని కల్పించినట్లు దీనిలో భాగంగా శనివారం రోజు 3 కేసులలో ఇరు పక్షాల మధ్య మధ్యవర్తిత్వం నిర్వహించినట్లు తెలిపారు. ఈ లోక్ అదాలత్ కార్య క్రమంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి వి. మాధవి లత , మొదటి అదనపు జిల్లా న్యాయ మూర్తి పి. ముక్తిదా , ఫోక్సో కోర్టు స్పెషల్ జడ్జి మిలింద్ కాంబ్లీ , ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి స్వాతి , అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఆరిఫ్ , రెండవ తరగతి మెజిస్ట్రేట్ జ్యోతిరావు , భువనగిరి న్యాయవాదుల సంఘం అధ్యక్షులు ఎన్. విద్యా సాగర్ , కార్యదర్శి యాదగిరి , మధ్యవర్తిత్వ న్యాయవాదులు బాబు రావు , యం. రాజిరెడ్డి , లోక్ అదాలత్ సభ్యులు చంద్రశేఖర్ రెడ్డి , కె. కిషన్ , జి గోపాల్ రెడ్డి , జె. శివ కిరణ్ , జె. భాస్కర్ రెడ్డి , న్యాయవాదులు , పోలీసు యంత్రాంగం , బ్యాంకు , టెలిఫోన్ మేనేజర్లు పాల్గొన్నారు.

## రైతు వ్యతిరేక విధానాలను కాంగ్రెస్ ప్రభుత్వం విడనాడాలి..



**ప్రజావాణి, అందోలు ప్రతినిధి:** రైతు వ్యతిరేక విధానాలను కాంగ్రెస్ ప్రభుత్వం విడనాడాలని అందోలు మాజీ శాసనసభ్యులు చంటి క్రాంతి కిరణ్ అన్నారు. రేవంత్ రెడ్డి సర్కార్ అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ శనివారం బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ మీడియా ప్రతినిధుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని, రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను ప్రభుత్వం కోనుగోలు చేయకుండా చేతులు ఎత్తివేయడం సిగ్గుచేటన్నారు. రైతులు పండించిన వరి ధాన్యాన్ని ప్రతి గింజ కొంటాం అని ప్రగల్బాలు పలికిన సిఎం రేవంత్ రెడ్డి ఆయన సహచర మంత్రి వర్గం మాట దాట వేస్తున్నారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వంను పరిగణంలోకి తీసుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన అన్నీ పంటలను సీలింగ్ లేకుండా కోనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మాజీ సీఎం కేసీఆర్ హయాంలో రైతులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా రైతు సంక్షేమానికి పెద్దపీట వేయడం జరిగిందని చెప్పారు. ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రైతు బీమా ఎత్తివేస్తూ, రైతు బంధు డబ్బులు వేయకుండా అన్నదాతలను ఆగం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. అందుకే రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ అందోలు నియోజకవర్గం లోని రైతాంగం, యువత ప్రభుత్వ వైఫల్యాలను ఎండ గట్టాలని క్రాంతి కిరణ్ పిలుపునిచ్చారు. రైతులకు అండగా బీఆర్ఎస్ పార్టీ ఉంటుందని ఎల్లప్పుడూ పార్టీ నాయకులు, కార్యకర్తలు రైతాంగానికి అందుబాటులో ఉంటారని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో మాజీ డిసిసిబి వైస్ చైర్మన్ పి. జైపాల్ రెడ్డి మాజీ చైర్మన్లు పి.నారాయణ ముదిరాజ్, పల్లే సంజీవయ్య, మాజీ ఎంపీపీ రామగౌడ్, చంద్రయ్య, బీఆర్ఎస్ నాయకులు లింగాగౌడ్, పైతర సాయికుమార్, వీరారెడ్డి, చాపల వెంకటేశం, మాచర్ల విజయ్ కుమార్, చౌకంపల్లి శివ కుమార్, ఎ.శంకరయ్య, సుంకే రమేష్, వినోద్ కుమార్, నాగరత్నం గౌడ్, బిర్ల శంకర్, ప్రదీప్ గౌడ్, పేండ గోపాల్, రొయ్యల సత్యం, కరుణాకర్, దాసరి దుర్గయ్య, అల్మాయి పేట మొగులయ్య, రఫీక్, రమణ, ఇమ్రాన్ ఖాన్, మొగులయ్య, నర్సింలు, దర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికలలో ప్రతి ఓటరు భాగస్వామ్యం కావాలి....

- అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించాలి - జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ....




**ప్రజావాణి , జూన్ 20, కామారెడ్డి జిల్లా (జిల్లా స్టాఫ్ రిపోర్టర్ పిట్ల అనిల్ కుమార్) :** ప్రత్యేక విస్తృత పునర్విమర్శ (SIR) – 2026 ఓటరు అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక విస్తృత పునర్విమర్శ (Special Intensive Revision - SIR) 2026 కార్యక్రమంపై ఓటర్లలో అవగాహన కల్పించేందుకు నిర్వహించిన అవగాహన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి ఆశిష్ సాంగ్వాన్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ 2 కే రన్ను జెండా ఊపి ప్రారంభించి, ఎన్నికల ప్రక్రియలో ప్రతి అర్హుడైన ఓటరు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ఓటరు జాబితాలో ప్రతి అర్హుడి పేరు నమోదు కావడం ఎంతో ముఖ్యమని అన్నారు. ప్రత్యేక విస్తృత పునర్విమర్శ కార్యక్రమంలో భాగంగా జూన్ 25, 2026 నుంచి జులై 24, 2026 వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరిస్తారని తెలిపారు. ఓటర్లు తమ వివరాలను సరిచూసుకుని అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకోవాలని సూచించారు. జులై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించబడుతుందని, అభ్యంతరాలు దరఖాస్తుల పరిశీలన అనంతరం అక్టోబర్ 1, 2026 న తుది ఓటరు జాబితా ప్రచురించబడుతుందని తెలిపారు. ఓటరు అవగాహన కార్యక్రమాలు జిల్లావ్యాప్తంగా విస్తృతంగా నిర్వహించనున్నట్లు పేర్కొంటూ, ప్రజలు ఈ ప్రక్రియలో చురుకుగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు విక్టర్, ఎన్ వి.గిరి, ఎమ్మార్వో హిమబిందు, మున్సిపల్ ఛైర్పర్సన్ ఉమారాణి, జైపాల్ రెడ్డి, ఎన్నికల అధికారులు, బూత్ స్థాయి అధికారులు, విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

## చింతకాని లో జరిగే సీఎం సభకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్





**ఖమ్మం బ్యూరో ప్రతినిధి మన ప్రజావాణి** చింతకాని మండలంలో ఈనెల 28, 29, 30 తేదీల్లో రైతుమేళా నిర్వహించనున్నట్లు, అట్టి రైతు మేళా లో ఈ నెల 30 న ముఖ్యమంత్రి ముఖ్య అతిధిగా పాల్గొనే సభ ను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మూడురోజుల పాటు నిర్వహించే రైతు మేళా, ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్ల పై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. రైతు మేళా విజయవంతానికి పకడ్బందీ ప్రణాళిక, సంబంధిత శాఖ అధికారులు సమన్వయంతో కార్యచరణ చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఈనెల 28, 29, 30 తేదీల్లో మధిర నియోజకవర్గం చింతకాని మండలంలో రైతు మేళా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. 150 స్టాల్స్ ఏర్పాటు చేసే ఈమేళాకు జిల్లా నుండి రైతులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని వ్యవసాయాన్ని పండుగలా మార్చుకోవాలని, ఈ అవకాశాన్ని అన్న దాతలందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అన్నారు. శాస్త్రవేత్తలు రైతు మేళాలో పాల్గొననున్నందున వారికి బస, రవాణా ఏర్పాట్లు చేయాలన్నారు. రైతు మేళాకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్డీవో శ్రీరామ్, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా. పురందర్, జిల్లా ఉద్యానవన అధికారి మధుసూదన్, జిల్లా మత్స్య శాఖ అధికారి మల్లేశం, పిడి మెప్మా, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జాన్ ఫడ్ దర్గాలో ఘనంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు

- ముఖ్య అతిధిగా ఎమ్మెల్సీ శంకర్ నాయక్







**మిర్యాలగూడ నియోజకవర్గం జూన్ 20** జానపహాడ్ దర్గా వద్ద కేక్ కట్ చేసిన ఎమ్మెల్సీ శంకర్ నాయక్ నల్గొండ తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి జన్మదిన వేడుకలు నల్గొండ జిల్లాలో ఘనంగా జరిగాయి. ప్రముఖ పుణ్యక్షేత్రమైన జానపహాడ్ సైదులు స్వామి దర్గా సమీపంలో జుఇ జడ్పీటీసీ ధనవత్ మోతిలాల్ నాయక్ ఆధ్వర్యంలో ఈ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నల్గొండ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ హాజరయ్యారు. దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం,మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్సీ శంకర్ నాయక్ కేక్ కట్ చేసి, అభిమానులకు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. ఉత్తమ్, జానారెడ్డిలు ఉమ్మడి జిల్లాకు రెండు కళ్లు: ఎమ్మెల్సీ శంకర్ నాయక్ ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ మాట్లాడుతూ, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మరియు సీనియర్ నేత కుందూరు జానారెడ్డిల సేవలను కొనియాడారు." నల్గొండ ఉమ్మడి జిల్లా అభివృద్ధిలో ఉత్తమ్ కుమార్ రెడ్డి, కుందూరు జానారెడ్డిల పాత్ర ఎంతో కీలక మైనది నిరంతరం ప్రజా శ్రేయస్సు కోసం తపించే ఇలాంటి గొప్ప నాయకులు మన జిల్లాకు దొరకడం మన అదృష్టం. రాష్ట్రాన్ని, ముఖ్యంగా నీటిపారుదల రంగాన్ని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మరింత ముందుకు తీసుకెళ్తారు."–కేతావత్ శంకర్ నాయక్ (ఎమ్మెల్సీ) కార్యక్రమ విశేషాలు నేతృత్వం: ఈ వేడుకలను EX జడ్పీటీసీ ధనవత్ మోతిలాల్ పాలకవీడు స్వయంగా పర్యవేక్షించి, విజయవంతం చేశారు. పాల్గొన్నవారు: ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, భారీ సంఖ్యలో కార్యకర్తలు మరియు ఉత్తమ్ కుమార్ రెడ్డి అభిమానులు పాల్గొని సందడి చేశారు. సేవా కార్యక్రమాలు: పుట్టినరోజు సందర్భంగా దర్గా పరిసరాల్లో పేదలకు మిఠాయిలు పంచారు

## కే.వి.కే. గడ్డిపల్లిలో పీఎం-కిసాన్ 23వ విడత నిధుల విడుదల ప్రత్యక్ష వీక్షణ కార్యక్రమం



**గరిడేపల్లి ప్రజావాణి జూన్ 20** గరిడేపల్లి మండలం గడ్డిపల్లిలోని కృషి విజ్ఞాన కేంద్రం (కే.వి.కే.)లో శనివారం పీఎం-కిసాన్ సమ్మాన్ నిధి యోజన 23వ విడత నిధుల విడుదల కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని తారాకేశ్వర్, హూగ్లీ జిల్లాలో నిర్వహించిన కార్యక్రమంలో పీఎం-కిసాన్ 23వ విడత నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు కేవీకే శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా 9.44 కోట్ల మంది రైతుల ఖాతాల్లో రూ.18,880 కోట్ల ఆర్థిక సహాయాన్ని నేరుగా జమ చేసినట్లు వివరించారు. భారతదేశ జనాభాలో 50 శాతానికి పైగా ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి ఉన్నందున, రైతులు ఆధునిక శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అవలంబించడం ద్వారా అధిక దిగుబడులు మరియు లాభాలు పొందవచ్చని తెలిపారు. అలాగే పెరుగుతున్న జనాభాకు ఆహార భద్రత కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం రైతులకు వివిధ పథకాలు, సబ్సిడీలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. రాబోయే కాలంలో ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా పప్పుధాన్యాలు, వేరుశనగ, పండ్ల తోటలు వంటి తక్కువ నీటితో సాగు చేయగల పంటలను ప్రోత్సహించాలని సూచించారు. అదేవిధంగా "ఖేత్ బచావో అభియాన్" కార్యక్రమం ద్వారా రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, సహజ మరియు స్థిరమైన వ్యవసాయ విధానాలను ప్రోత్సహించాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో కే.వి.కే. శాస్త్రవేత్తలు సి.హెచ్. నరేష్, ఎ. కిరణ్, డి. ఆదర్శ్, పి. అక్షిత్, ఎన్. సుగంధి, కంప్యూటర్ ప్రోగ్రామర్ ఎ. నరేష్, ఇఫ్కో ఏరియా మేనేజర్ వెంకటేశ్వర్లు, సోమేశ్వర్ కుమార్, రైతులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఘాతంతో కాడెద్దు మృతి



**పెద్ద వంగర జూన్ 20 (ప్రజావాణి)** మహబూబాబాద్ జిల్లా పెద్ద వంగర మండలం చిట్యాల గ్రామ రైతు కాడెద్దు విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందిన ఘటన చిట్యాల గ్రామంలో చోటుచేసుకుంది. శనివారం బాధిత రైతు ఎండి వాలీ బాషా తెలిపిన వివరాల ప్రకారం తనకు ఉన్న పొలం దగ్గర నారుమడి దున్నుతుండగా పొలములో ఉన్న కరెంటు స్తంభము స్టే వైరు కు కరెంటు సరఫరాయి ఆకస్మికంగా పొలము దున్నుతున్న రైతు యొక్క ఎద్దు కరెంటు షాక్ కు గురై అక్కడికక్కడే మృతి చెందడంతో బాధిత రైతు బోరుణ విలపించాడు. తన వ్యవసాయానికి కష్టపడి పనిచేసే కాడెద్దు మృతి చెందడంతో, బాధిత రైతు కుటుంబం ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం మూలంగానే, తనకు నష్టం వాటిల్లిందని, కావున ప్రభుత్వం అధికారులు ప్రజా ప్రతినిధులు ,స్పందించి, తనకు జరిగిన నష్టానికి, ఆర్థిక సాయం అందజేయాలని రైతు కోరారు.

## నూతనంగా ఎన్నికైన చేనేత సంఘం అధ్యక్షులు పాలకవర్గంని ఘనంగా సన్మానించిన

- మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్







**జమ్మికుంట జూన్ 20 (ప్రజావాణి):** జమ్మికుంట మున్సిపల్ కార్యాలయంలో పట్టణ చేనేత సంఘం ఎన్నికలకు గాను పలువురు నామినేషన్లు వేయగా మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ ఆధ్వర్యంలో ఎన్నికలు లేకుండా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు గాను మున్సిపల్ చైర్మన్ ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువ సత్కరించిన అధ్యక్షులు ఉడుత రమేష్ ఉపాధ్యక్షులు దాసరి రాజేందర్ కోశాధికారి అడిచర్ల మల్లయ్య డైరెక్టర్లుగా ఎలిగేటి దామోదర్ తాటిపాముల రాజమౌళి గుండేటి శీను సందుపట్ల రాజమౌళి బూర్ల సంధ్య దుస్సా సరోజన వారిని అభినందించి శుభాకాంక్షలు తెలిపిన మున్సిపల్ చైర్మన్ ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ చుంచూ రమాదేవి నాగపూరి శ్రీనివాస్,శివ చేనేత సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## చిగురుమామిడి తహసీలార్‌గా కనకయ్య బాధ్యతల స్వీకరణ



**మన ప్రజావాణి ప్రతినిధి (చిగురుమామిడి):** చిగురుమామిడి మండల తహసీల్దార్‌గా కొండం కనకయ్య శనివారం తహసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గన్నేరవరం మండలం నుంచి బదిలీపై చిగురుమామిడికి వచ్చారు. ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్‌కు డిప్యూటీ తహసీల్దార్ కళావతితో పాటు రెవెన్యూ సిబ్బంది శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ, మండల ప్రజలు రెవెన్యూ సంబంధిత వివిధ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయానికి వచ్చినప్పుడు రెవెన్యూ సిబ్బందిని లేదా తనను నేరుగా సంప్రదించాలని సూచించారు. ప్రజలకు పారదర్శకంగా, వేగంగా సేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

## కూలిన చెట్లు.. రాకపోకలు బంద్





**చిలుకూరు జూన్20 (ప్రజావాణి):** సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలంలోని రామాపురం, నరసింహపురం, కొండాపురం మార్గంలో రాత్రి వీచిన ఈదురుగాలులకు చెట్లు రహదారిపై కూలిపోయాయి. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. చెట్లు రోడ్డుకు అడ్డంగా పడటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతు పొలాల గుండా ప్రయాణిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చెట్లను తొలగించి రాకపోకలను పునరుద్ధరించాలని రైతులు,ప్రజలు కోరుతున్నారు.

# పలాస, ఉద్దాన గ్రామాల్లో అనధికార బెల్ట్ బ్రాందీ షాపులు?

- ఎనీ టైమ్ మద్యం అమ్మకాకులు..
- బాటిల్ పై ఏబై రూపాయలు వరకు అదనపు ధరకు అమ్మకాలు
- మౌనములో ఎక్సైజ్ అధికారులు
- అక్రమ మద్యము అమ్మకాలు తో మద్యము ప్రియులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు.










**పలాస ప్రజావాణి ప్రతినిధి** శ్రీకాకుళం జిల్లాలో నీ పలాస నియోజక వర్గంలో మద్యము అమ్మకాలు పై నోరు మెదపడం లేదని ఎక్సైజ్ శాఖ పై ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా పలాస ఉద్దనము గ్రామాల్లో రోజు రోజుకు గొలుసు దుకాణాలు పెరుగుతున్నాయి. అలాగే బాటిల్ పై అధిక ధరలు వసూలు చేస్తున్నారు. అటు మాజీ మంత్రి డాక్టర్ అప్పలరాజు కూడా ఇక్కడ మద్యము అమ్మకాలు పై నిరసన వ్యక్తం చేశారు. అలాగే పలాస జిల్లా కావాలని పోరాటము చేస్తున్న దువ్వాడ శ్రీధర్ బాబు కూడా మద్యము అమ్మకాలు పై నిరసన వ్యక్తం చేశారు. అయినా అధికరలు ఇక్కడ తగ్గని ఆర్థిక పరిస్థితి ఉందని పలువురు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.. మద్యము అమ్మకాలు పై నిజాలను బయటకు వచ్చినా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. అధికారుల నిర్లిప్తతతో మద్యం కల్తీ కూడా జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా బెల్టు షాపుల్లో మద్యం కల్తీ విపరీతంగా జరుగుతున్నట్లు ఆరోపణలున్నాయి. కల్తీ మద్యం కారణంగా ప్రజలు అనారోగ్యాల బారిన పడే ప్రమాదం ఉంది. అయినా అధికారులు పట్టించుకున్న పాపాన పోవడం లేదు. వైన్ షాపులు, బెల్టు షాపుల నుంచి మామూళ్లు అందుకుంటున్న అబ్కారీశాఖ అధికారులు మద్యం మత్తులో జోగుతున్నారనే బహిరంగ ప్రచారం జరుగుతోంది. పలాస నియోజకవర్గం లోని ఆయా మండలాల పరిధిలో ఉన్న బెల్టు షాపుల్లో ఖరీదైన మందు బాటిళ్లలో కల్తీ చేసి విక్రయిస్తున్నట్లు సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపణలు కూడా లేకపోలేదు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు చొరవ తీసుకొని బెల్ట్ షాపులను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు."

## విలాసాగర్ గ్రామంలో నూతనంగా నిర్మించే శివాలయానికి భూమిపూజ చేసి ఇందిరమ్మ ఇల్లు నూతన గృహప్రవేశం

- విలాసాగర్ గ్రామంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహణ
- హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ బాబు
- విలాసాగర్ గ్రామ సర్పంచ్ గరిగంటి శ్రీధర్







**జమ్మికుంట జూన్ 20 (ప్రజావాణి)** జమ్మికుంట మండలం విలాసాగర్ గ్రామంలో నూతన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమానికి విచ్చేసిన కాంగ్రెస్ నాయకుడు వొడితల ప్రణవ్ కి గ్రామస్తులు టపాసులు పేల్చి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ జమ్మికుంట మండల ఉపాధ్యక్షుడురాచపల్లి సాగర్‌ఆధ్వర్యంలో గ్రామస్తులుకాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు కలిసి లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించి కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేస్తూ రాహుల్ గాంధీకి జన్మదిన శు భాకాంక్షలు తెలిపారుఈ సందర్భంగా హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ యువత సాధికారతసామాజిక న్యాయం కోసం రాహుల్ గాంధీ చేస్తున్న కృషి ప్రశంసనీయమని రాహుల్ గాంధీ ఆశయాలను యువత ముందుకు తీసుకెళ్లాలని ప్రజా సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని అన్నారు. గ్రామ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారుఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో నాయకులు విలాసాగర్ గ్రామ సర్పంచ్ గరిగంటి శ్రీధర్ రాచపల్లి శ్రీనివాస్ మాజీ సర్పంచ్ రాసపల్లి సమ్మయ్య రాచపల్లి వంశీ మోరే శివ గరిగంటి సురేష్ ఉండాడి కుమార్.వేల్పుల కుమార్ బిట్ల అశోక్ చిలుక రాజుముంజాల శంకర్ ఇమ్రాన్స్, శశి, రాచపల్లి సమన్ రాచపల్లి రజనీకుమార్ మోర్ హరీష్ కాంగ్రెస్ పార్టీ నాయ కులుయూత్ కాంగ్రెస్ కార్యకర్తలు గ్రామ పెద్దలు యువకులు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారుగ్రామస్తులు అందరూ కలిసి రాహుల్ గాంధీ ని దీర్ఘాయుష్షు ఆరోగ్యాన్ని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు

## చెక్కులు పంపిణీ చేసిన మంత్రి శ్రీధర్ బాబు







**మంథని నియోజక వర్గం, జూన్ 20, ప్రజావాణి:** మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చొరవతో మంథని నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ (సీఎంఆర్‌ఎఫ్) మరియు కళ్యాణలక్ష్మి పథకాల కింద రూ.66.46 లక్షల విలువైన 109 చెక్కులు మంజూరయ్యాయి. ఇందులో 64 సీఎంఆర్‌ఎఫ్ చెక్కులకు రూ.21.41 లక్షలు, 45 కళ్యాణలక్ష్మి చెక్కులకు రూ.45.05 లక్షలు కేటాయించారు. మంథని, ముత్తారం, రామగిరి, కమాన్‌పూర్, పాలకుర్తి మండలాలతో పాటు ఇతర ప్రాంతాల లబ్ధిదారులు ఈ సహాయం పొందనున్నారు. అనారోగ్యంతో చికిత్స పొందిన బాధితులకు ఆర్థిక భరోసా కల్పించే ఉద్దేశంతో సీఎంఆర్‌ఎఫ్ సహాయం అందించగా, అర్హులైన కుటుంబాలకు కళ్యాణలక్ష్మి పథకం కింద చెక్కులు మంజూరు చేశారు. శనివారం మధ్యాహ్నం 2 గంటలకు మంథనిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చేతుల మీదుగా లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## మున్నూరు కాపు సంఘం అధ్యక్షునిగా సదయ్య.



**కమాన్ పూర్, మన సమగ్ర ప్రజావాణి జూన్ 20.** కమాన్ పూర్ మండలం గుండారం గ్రామ మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడిగా గాదే సదయ్యను కాపు కులస్తులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం గ్రామంలో సమావేశాన్ని నిర్వహించుకున్నారు. ఉపాధ్యక్షుడిగా దండే కనక రత్నం ,బోయిని బాలకృష్ణ, కోశాధికారిగా ఉప్పు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ఆకుల రాజయ్య, కార్యదర్శిగా చిన్న సదయ్య, జక్కుల శ్రీనివాస్, ప్రచార కార్యదర్శిగా ముదాం చిన్న కొమురయ్య, సలహాదారులుగా అడువాల చంద్రయ్య ,దండే లక్ష్మి నారాయణ,గౌరవ అధ్యక్షుడిగా అరిసె కృష్ణ, అరిసె ఎల్లయ్య, కార్యవర్గ సభ్యులుగా ముకుంద శ్రవణ్, గడ్డి మల్లేష్,దండే కాలేషి, ఆకుల తిరుపతి,గాదె నారాయణ,దండే రజనీకాంత్,దండే రమేష్, నిమ్మతి రమేష్ ఆడవాళ్ళ ప్రసాద్ ,గాదె శంకరయ్య, నీ మతి శ్రీనివాస్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## సమాచార హక్కు చట్టం సాధన కమిటీ కాట్రపల్లి గ్రామ అధ్యక్షుడిగా మడుగుల రాజు ఏకగ్రీవంగా ఎన్నిక

- జిల్లా సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చంటి ముదిరాజ్‌ఆధ్వర్యంలో



**జమ్మికుంట జూన్ 20 (ప్రజావాణి)** కరీంనగర్ జిల్లా సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చంటి ముదిరాజ్‌ఆధ్వర్యంలో కమిటీ బలోపేతానికి కీలక నిర్ణయం తీసుకున్నారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం కాట్రపల్లి గ్రామ అధ్యక్షుడిగా మడుగుల రాజు ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందిఈ సందర్భంగా నూతన గ్రామ అధ్యక్షుడు మడుగుల రాజు మాట్లాడుతూతనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చంటి ముదిరాజ్ అలాగే ఈ నియామకానికి పూర్తిస్థాయిలో సహకారం అందించిన హుజూరాబాద్ మండల ప్రధాన కార్యదర్శి బండ నరేందర్.ప్రత్యేక కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలియజేశారుగ్రామస్థాయిలో సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ కమిటీ ఆశయాల సాధనకు సమాజ శ్రేయస్సుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. మడుగుల రాజు నియామకం పట్ల కమిటీ సభ్యులు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

# జనరల్ న్యూస్

# మహిళల ఆర్థిక సాధికారతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం...

- ఆలేరుకు రూ.1,250 కోట్ల వడ్డీ లేని రుణాలు.
- పంచాయతీరాజ్ శాఖ గ్రామీణాభివృద్ధి స్త్రీ-శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క.








**యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి జూన్ 20**మహిళలు మగవారిపై ఆధారపడకుండా స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీ రాజ్ , గ్రామీణాభివృద్ధి , స్త్రీ-శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ అలియాస్ సీతక్క అన్నారు. ఆలేరు ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రాన్ని మంత్రి సీతక్క రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి ఆడ బిడ్డల కష్టాలు తెలుసని , అందుకే మహిళల కోసం ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని అమలు చేశారని తెలిపారు. మహిళా సంఘ సభ్యురాలు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షల బీమా , రూ.2 లక్షల వరకు రుణ మాఫీ సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించిందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాలకు రూ. 61 వేల కోట్ల రుణాలు అందించగా , ఆలేరు నియోజకవర్గానికి రూ. 1,250 కోట్ల వడ్డీ లేని రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం మహిళా సంఘాలు రూ. 10 లక్షల వరకు రుణాలు పొందే అవకాశం ఉందన్నారు. మహిళలకు బస్సు ,కారు డ్రైవింగ్ శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నా మని , పెట్రోల్ బంకులు , బస్సుల యాజమాన్యంలో మహిళలకు ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. మహిళా సంఘాల భవనాల నిర్మాణంలో యాదాద్రి భువనగిరి జిల్లాకు అధిక ప్రాధాన్యం కల్పించినట్లు తెలిపారు. సోలార్ విద్యుత్ , సన్న బియ్యం , ఇందిరమ్మ ఇళ్లు తదితర సంక్షేమ పథకాలను ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందని , మహిళలు ఆర్థికంగా బల పడితే కుటుంబంతో పాటు రాష్ట్రం కూడా అభివృద్ధి చెందుతుందని మంత్రి సీతక్క అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య , తెలంగాణ మహిళా సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్ బండ్రు శోభారాణి , అధికారులు , ప్రజా ప్రతి నిధులు , మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఖానాపూర్ నియోజకవర్గం జన్నారం మండల్ జన్నారం పోలీసులపై హోంశాఖ సీరియస్

- ఎస్సై, లక్షెట్టిపేట సీఐపై విచారణకు డీజీపీకి ఆదేశాలు -- బాధితుడు దుర్గం లింగేశ్వర్‌కు న్యాయం చేయాలని డిమాండ్



జన్నారం మండలం ధర్మారం గ్రామానికి చెందిన దుర్గం లింగేశ్వర్ చేసిన ఫిర్యాదు రాష్ట్ర హోంశాఖ దృష్టికి చేరడంతో ఈ వ్యవహారం ప్రాధాన్యత సంతరించుకుంది. తనపై జరిగిన దాడి, బెదిరింపుల ఘటనలో పోలీసులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ సరైన న్యాయం జరగలేదని, స్థానిక పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని లింగేశ్వర్ ఆరోపించారు. ఈ నేపథ్యంలో బాధితుడు సమర్పించిన వినతిపత్రాన్ని పరిశీలించిన రాష్ట్ర హోంశాఖ జనరల్ విభాగం మెమో నం. 2772/P/General/26 ద్వారా డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ)కి కీలక ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. జన్నారం పోలీస్ స్టేషన్‌పై వచ్చిన ఆరోపణలను సమగ్రంగా విచారించి, నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశాల్లో పేర్కొన్నట్లు సమాచారం. బాధితుడు లింగేశ్వర్ ఆరోపణల ప్రకారం, తనకు ప్రాణహాని ఉందని రక్షణ కోరినా జన్నారం ఎస్సై, లక్షెట్టిపేట సీఐ మరియు సంబంధిత సిబ్బంది తగిన విధంగా స్పందించలేదని, న్యాయం కోరిన తనను అవమానకరంగా మాట్లాడి మానసిక వేదనకు గురిచేశారని తెలిపారు. తన ఫిర్యాదులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాల్సిన అధికారులు, ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులకు అనుకూలంగా వ్యవహరించారని కూడా ఆయన ఆరోపించారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సమర్పించిన పిటిషన్ సంబంధిత అధికారులకు ఫార్వర్డ్ అయినప్పటికీ, స్థానిక స్థాయిలో తగిన చర్యలు తీసుకోలేదని బాధితుడు పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలు వచ్చిన తర్వాత కూడా విచారణలో జాప్యం కొనసాగుతోందని ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారంలో మానవ హక్కుల ఉల్లంఘనలు జరిగాయని ఆరోపిస్తూ, సంబంధిత అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాలు, స్థానిక నాయకులు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. పోలీస్ స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని, బాధితుడికి రక్షణ కల్పించాలని కూడా వారు కోరుతున్నారు. దుర్గం లింగేశ్వర్ మాట్లాడుతూ, తన ఫిర్యాదుల విషయంలో తప్పుడు సమాచారం సమర్పించిన అధికారులపై లోతైన విచారణ జరిపించి, తప్పు నిర్ధారణ అయితే ఎస్సై మరియు సీఐలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ ఉన్నతాధికారులు స్వయంగా ఈ వ్యవహారాన్ని పర్యవేక్షించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. హోంశాఖ ఆదేశాల నేపథ్యంలో అయినా నిష్పక్షపాత విచారణ జరిగి బాధితుడికి న్యాయం జరుగుతుందా, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటారా అనే అంశంపై స్థానిక ప్రజల్లో ఆసక్తి నెలకొంది. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన వ్యవస్థపై వచ్చిన ఈ ఆరోపణలను ప్రభుత్వం, పోలీస్ ఉన్నతాధికారులు ఎంత వేగంగా పరిష్కరిస్తారో వేచి చూడాల్సి ఉంది. బాధితుడు దుర్గం లింగేశ్వర్‌కు రక్షణ కల్పించి, ఫిర్యాదులపై నిష్పక్షపాత విచారణ జరిపి, నిజాలు వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు మరియు ప్రజాసంఘాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి.

# శ్రీ సుబ్రహ్మణ్యస్వామివారికి విశేష అభిషేకం



**నంద్యాల జిల్లా శ్రీశైలం జూన్ 20 (ప్రజావాణి)**లోకకల్యాణం కోసం షష్ఠిని పురస్కరించుకుని దేవస్థానం ఈ రోజు (20.06.2026) ఉదయం ఆలయప్రాంగణంలోని శ్రీసుబ్రహ్మణ్యస్వామి (కుమారస్వామి) వారికి విశేష పూజలను నిర్వహించడం జరిగింది.ప్రతి మంగళవారం మరియు కృత్తికానక్షత్రం, షష్ఠి తిథి రోజులలో శ్రీ సుబ్రహ్మణ్యస్వామి వారికి ఈ విశేషఅభిషేకం మరియు పూజాదికాలు దేవస్థానంసేవగా (సర్కారిసేవగా) నిర్వహించబడుతున్నాయి.కుమారస్వామివారికి పూజలు జరపడం వలన లోకకల్యాణమే కాకుండా ప్రతి ఒక్కరికి ఉద్యోగ, వ్యాపార, వ్యవహారాలలో ఆటుపోట్లు తొలగి ఆయా పనులు సక్రమంగా జరుగుతాయి. సుబ్రహ్మణ్యస్వామి అనుగ్రహంతో శత్రుబాధలు, గ్రహపీడలు, దృష్టి దోషాలు మొదలైనవి తొలగిపోతాయి. అలాగే సంతానం కోసం పూజించేవారికి తప్పక సంతానభాగ్యం లభిస్తుందని చెప్పబడుతోంది.ఈ అభిషేకానికి ముందుగా దేశం శాంతిసౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతివైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని,పాడి సమృద్ధిగా ఉండాలని, జనులకు ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాలమరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, జనులందరూ సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు.తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహాగణపతిపూజ జరిపించబడింది. అనంతరం శ్రీసుబ్రహ్మణ్యస్వామివారికి అభిషేకము, అర్చన తరువాత సుబ్రహ్మణ్యస్తోత్ర పారాయణలు చేయబడ్డాయి. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలైన పాలు,పెరుగు,తేనె, నెయ్యి, కొబ్బరి నీళ్ళు మరియు వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ముఖ్యంగా వివిధ పండ్ల రసాలతో చేసే అభిషేకంతో ఎంతో ఫలితం ఉంటుందని ఆగమాలు చెబుతున్నాయి.

# పోచమ్మ బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి




**ప్రజావాణి దుబ్బాక నియోజకవర్గం** దుబ్బాక మండలం రాజక్కపేట గ్రామంలో ఘనంగా నిర్వహించిన పోచమ్మ బోనాల ఉత్సవాల్లో దుబ్బాక శాసనసభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డి గారు, రాష్ట్ర ఎస్సీ-ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య గారు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ రైతాంగంపై కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న వైఖరిని తీవ్రంగా ఖండించారు. ఎన్నికల సమయంలో రైతులకు ఎన్నో హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, నేడు రైతులకు భరోసా కల్పించాల్సిన సమయంలో “వడ్లు వేయొద్దు”, “ప్రభుత్వం బాధ్యత తీసుకోదు” అనే వ్యాఖ్యలు చేయడం రైతులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోందన్నారు. తెలంగాణలో నేడు లక్షల ఎకరాల్లో వరి సాగు జరుగుతుందంటే అది మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గారి దూరదృష్టి ఫలితమేనని పేర్కొన్నారు. మల్లన్నసాగర్‌తో పాటు అనేక సాగునీటి ప్రాజెక్టుల ద్వారా రైతులకు సాగునీరు అందించి బీడు భూములను సస్యశ్యామలం చేశారని గుర్తు చేశారు.ఒకప్పుడు ఉపాధి కోసం వలసలు వెళ్లిన గ్రామాలు నేడు పంటలతో కళకళలాడుతున్నాయని అన్నారు. రైతులు ఏ పంట వేయాలో చెప్పడం ప్రభుత్వ పని కాదని, రైతు పండించిన ప్రతి గింజకు గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేయడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు.రైతులకు స్పష్టమైన హామీ ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. రైతాంగ ప్రయోజనాల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, రైతుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతుందనిఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి గారు తెలిపారు

## బీసీ జిల్లా అధ్యక్షుడు డ్యాగల శ్రీనివాస్ కు బెదిరింపు ఫోన్ కాల్ చేసిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేయాలి

- బీసీ సంఘం జిల్లా యూత్ అధ్యక్షుడు కడారి సురేష్ యాదవ్



**జమ్మికుంట జూన్ 20 (ప్రజావాణి)**బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు నర్సంపేట నియోజకవర్గ ఇంచార్జ్ డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ ను బుధవారం రాత్రి సమయంలో నర్సంపేట పట్టణానికి చెందిన సలేంద్ర రాజు అనే వ్యక్తి బుధవారం రాత్రి సమయంలో ఫోన్ చేసి ఇష్టానుసారంగా నానా బూతులు తిట్టడంతో పాటు నా దగ్గర రౌడీ షీటర్లు ఉన్నారు నిన్ను కిడ్నాప్ చేసి చంపేస్తా అని బెదిరింపులకు గురి చేసిన సలేంద్ర రాజు వల్ల మా నాయకునికి ప్రాణహాని ఉందని అన్నారు కావున పోలీసు ఉన్నతాధికారులు స్పందించి బెదిరింపు కాల్ చేసిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా యూత్ అధ్యక్షుడు కడారి సురేష్ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నూరి రవి ముదిరాజ్ చెన్నారావుపేట మండల అధ్యక్షుడు బర్ల యాకయ్య నర్సంపేట పట్టణ ఉపాధ్యక్షుడు మద్దెల శ్యామ్ కుమార్ కార్యదర్శులు నూనె రంజిత్ కుమార్ శీరంశెట్టి రాజేందర్ లు పాల్గొన్నారు

# యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాం



**కమాన్ పూర్, మన సమగ్ర ప్రజావాణి జూన్ 20.**యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతోందని కమాన్ పూర్ మండలం స్టార్ట్ అప్ ఎం ఎస్ ఎం ఈ కంపెనీ యజమాని బోనాల వెంకటస్వామి అన్నారు.ఈ మేరకు హైదరాబాద్ లోని ఆర్టీసీ కళాభవన్లో వికసిత్ భారత్ 2047 సదస్సు జరిగింది.ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి,రాష్ట్ర బొగ్గు గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కమాన్ పూర్ మండల కేంద్రానికి చెందిన బోనాల వెంకటస్వామి హాజరై సదస్సులో మాట్లాడారు. తాను ప్రధానమంత్రి వికసిత్ భారత్ రోజ్గార్ యోజన గురించి మాట్లాడారు.ఈ ప్రధానమంత్రి వికసిద్భారత్ రోజ్గా యోజన లో భాగస్వాములు కావడం తన అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు.ఒక సంస్థకు అసలైన సంపద డబ్బు కాదు మనుషులే అని ఆయన అన్నారు.ముఖ్యంగా యువత కొరకు ఈ పథకం కొత్త ఉద్యోగాలను సృష్టిస్తుందని నిరుద్యోగులకు చదవకాశమని ఆయన పేర్కొన్నారు.భద్రత ఉన్నచోట నమ్మకం పడుతుందని నమ్మకం ఉండచోట అభివృద్ధి పొడుతుందని ఆయన ఈ సందర్భంగా అన్నారు. అలాగే కుటుంబ సభ్యుల అభిష్ట మేరకు పి ఎం బి ఆర్ వై కింద రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందని దీంతో నాకు తనకు లాభాలు చేపడుతున్నాయని పేర్కొన్నారు.2047 నాటికి సంపన్న సమ్మిళిత శక్తివంతమైన భారతదేశాన్ని నిర్మించుకునే బాధ్యత మన యువతపై ఉందని వెంకటస్వామి పేర్కొన్నారు.

# ప్రభుత్వ ఆదేశాలను ప్రైవేట్ పాఠశాలలు తప్పక పాటించాలి..ఎంఈఓ పాపమ్మ



**చెన్నారావుపేట జూన్ 20 ప్రజావాణి** ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలని మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ) మానుపాటి పాపమ్మ ఆదేశించారు. శనివారం స్థానిక ఎంఆర్సీ కార్యాలయంలో ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ...పాఠశాల బోర్డులపై డీజీ టెక్నో లాంటి పదాలు వాడరాదని, నోటీస్ బోర్డుపై తరగతుల వారీగా ఫీజుల వివరాలు ప్రదర్శించాలని స్పష్టం చేశారు. పాఠశాలల్లో యూనిఫాంలు, నోట్ బుక్స్, షూ,బెల్టులు విక్రయించరాదని, పాఠ్యపుస్తకాలను మాత్రమే డీఈఓ అనుమతితో ఎంఆర్పీ ధరలకే అమ్మాలని ఆదేశించారు. ఆర్టీఏ నిబంధనల ప్రకారం స్కూల్ బస్సులు కండిషన్‌లో ఉంచి, అనుభవజ్ఞులైన డ్రైవర్లను నియమించుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించిన ఈ సమావేశంలో పలువురు ప్రైవేట్ హెచ్ఎంలు, ఎంఆర్సీ సిబ్బంది, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

# పేదల కలను నిజం చేస్తున్న మంత్రి శ్రీధర్ బాబు

- కల్వచర్లలో నూతన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం ఘనంగా నిర్వహణ.



**రామగిరి,మన సమగ్ర ప్రజావాణి జూన్ 20**రామగిరి మండలం కల్వచర్ల గ్రామానికి చెందిన నగునూరి లావణ్య,రాజమౌళి గౌడ్ దంపతుల నూతన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి రామగిరి మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరై గృహ యజమానులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ....పేదల సొంతింటి కలను నిజం చేస్తూ తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడంలో ప్రత్యేక చొరవ చూపిన ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ప్రజా సంక్షేమమే లక్ష్యంగా మంత్రి శ్రీధర్ బాబు నిరంతరం పనిచేస్తూ,అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నారని వారు పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని ప్రధాన ధ్యేయంగా తీసుకుని ముందుకు సాగుతోందని, ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఎన్నో కుటుంబాలకు సొంతింటి ఆనందం కలిగిస్తోందని కాంగ్రెస్ నాయకులు తెలిపారు.గ్రామీణ ప్రాంతాల్లో అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేయడంలో మంత్రి శ్రీధర్ బాబు పాత్ర విశేషమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణ రెడ్డి,మాజీ ఎంపీటీసీ ముస్త్యాల శ్రీనివాస్,రామగిరి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మోత్కూరి అవినాష్ గౌడ్,ఐఎన్టియుసి సెంట్రల్ నాయకుడు మడ్డి రాజ్ కుమార్ గౌడ్,యూత్ నాయకుడు ముక్కెర సంజయ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## భూతగాదా కేసులో ఇద్దరి అరెస్ట్..

- 14 రోజులు రిమాండ్‌కు తరలింపు

**?చెన్నారావుపేట జూన్ 20 ప్రజావాణి** మండల పరిధిలోని అమీన్‌పేటలో జరిగిన భూతగాదా దాడి కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రాజేష్ రెడ్డి తెలిపారు.పోలీసుల వివరాల ప్రకారం.ఈ నెల 7న అమీన్‌పేట గ్రామ శివారులో చిలుపూరి యాకయ్య కుటుంబంపై అదే గ్రామానికి చెందిన ఎల్లయ్య, సుధాకర్, దయాకర్, ప్రమీల దాడికి పాల్పడ్డారు. ఈ గొడవపై గతంలోనే కేసు నమోదు కాగా, శనివారం నిందితులు చిలుపూరి సుధాకర్, దయాకర్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం వారిని నర్సంపేట కోర్టులో హాజరుపరచగా, మేజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించడంతో మహబూబాబాద్ సబ్ జైలుకు తరలించినట్లు ఎస్సై రాజేష్ రెడ్డి తెలిపారు.

## రాజన్నసిరిసిల్ల జిల్లాలో ప్రైవేట్ స్కూళ్ల

# 'అక్షర' దోపిడీ!

(మొదటి పేజీ తరువాయి)




యూనిఫారాలు, టైలు, బెల్టులు, షూస్ విక్రయిస్తూ తల్లిదండ్రులపై భారీ ఆర్థిక భారం మోపుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.జిల్లా కేంద్రం సిరిసిల్లతో పాటు వేములవాడ, ముస్తాబాద్, గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట, చందుర్తి తదితర మండలాల్లోని పలు ప్రైవేట్ విద్యాసంస్థలు నిబంధనలకు విరుద్ధంగా స్కూల్ క్యాంపస్‌లలోనే ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి వ్యాపారం సాగిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వ జీవో నెం.91 ప్రకారం విద్యాసంస్థలు లాభాపేక్ష లేకుండా మాత్రమే విద్యార్థుల సౌకర్యార్థం వస్తువులు అందించాలి. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి పూర్తిగా భిన్నంగా కనిపిస్తోందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు

**'సిండికేట్' రాజకీయం.. కృత్రిమ ధరల సృష్టి!**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని ప్రైవేట్ పాఠశాలలు SCERT లేదా NCERT ఆమోదించిన సిలబస్ పుస్తకాలను మాత్రమే వినియోగించాలి. అయితే జిల్లాలోని కొన్ని కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు భారీ కమీషన్ల కోసం ప్రైవేట్ పబ్లిషర్లతో ముందస్తు ఒప్పందాలు కుదుర్చుకుని ప్రత్యేకంగా ముద్రించిన పుస్తకాలను విద్యార్థులపై రుద్దుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మార్కెట్లో సాధారణంగా రూ.3 వేల నుండి రూ.5 వేల మధ్య లభించే పుస్తకాల సెట్‌ను, ప్రత్యేక కోడింగ్ పేరుతో రూ.10 వేల నుండి రూ.15 వేల వరకు విక్రయిస్తున్నట్లు తల్లిదండ్రులు వాపోతున్నారు. పైగా ఈ పుస్తకాలపై గరిష్ట చిల్లర ధర (MRP) కూడా ముద్రించకుండా తమ నిర్ణయించిన ధరలకే కొనుగోలు చేయాలని ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది.

**'బయట దొరకవు' అంటూ ఒత్తిడి**

"మా పాఠశాల సిలబస్ పుస్తకాలు బయట మార్కెట్లో లభించవు.. క్యాంపస్‌లోనే కొనాలి" అంటూ అడ్మిషన్ల సమయంలోనే తల్లిదండ్రులకు కఠినమైన షరతులు విధిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఒకే కుటుంబంలో ఇద్దరు, ముగ్గురు పిల్లలు చదువుతున్న మధ్యతరగతి కుటుంబాలు కేవలం పుస్తకాలు, యూనిఫారాల కోసమే రూ.20 వేల నుండి రూ.40 వేల వరకు అదనపు భారం భరించాల్సి వస్తోందని వారు చెబుతున్నారు.

**విద్యాశాఖ నిఘా ఎక్కడ?**

ప్రతి ఏడాది విద్యాసంవత్సరం ప్రారంభంలో విద్యాశాఖ అధికారులు కేవలం సర్క్యులర్లు జారీ చేయడం తప్ప, క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించడం లేదని విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రుల సంఘాలు ఆరోపిస్తున్నాయి. నిబంధనలు ఉల్లంఘిస్తూ అక్రమ విక్రయాలు సాగిస్తున్న పాఠశాలలపై జిల్లా విద్యాశాఖాధికారి (ఐజూా) ఆధ్వర్యంలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ కమిటీలు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.o

**ప్రజల డిమాండ్ :** అక్రమంగా పుస్తకాలు, యూనిఫారాలు విక్రయిస్తున్న విద్యాసంస్థలపై వెంటనే చర్యలు తీసుకోవాలని, తల్లిదండ్రుల నుండి ఫిర్యాదులు స్వీకరించేందుకు ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పా టు చేయాలని ప్రజా సంఘాలు కోరుతున్నా యి. నిబంధనలు ఉల్లంఘిస్తున్న పాఠశాలల గుర్తింపును రద్దు చేయడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

**సంబంధిత నిబంధనలు**

GO No.91: పాఠశాలల్లో వాణిజ్య విక్రయాలకు అనుమతి లేదు

SCERT / NCERT **మార్గదర్శకాలు :** ఆమోదించిన పుస్తకాలనే వినియోగించాలి

Consumer Protection Act -- 2019: అధిక ధరలు వసూలు చేయడం శిక్షార్హం

MRP **నిబంధనలు:** ప్రతి ఉత్పత్తిపై గరిష్ట ధర స్పష్టంగా ఉండాలి

**నో-ప్రాఫిట్ -- నో-లాస్ విధానం:** విద్యాసంస్థలు లాభాపేక్షతో వస్తువులు అమ్మకూడదు

తల్లిదండ్రులకు సూచనలు

తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలి

MRP లేని పుస్తకాలు కొనరాదు

బలవంతపు విక్రయాలపై ఐజూా కార్యాలయానికి ఫిర్యాదు చేయాలి . వినియోగదారుల హక్కుల ఫోరమ్‌ను సంప్రదించవచ్చు

**"విద్యను వ్యాపారంగా మార్చొద్దు.. తల్లిదండ్రుల జేబులు ఖాళీ చేయొద్దు" అంటూ జిల్లా ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.**

## ఎస్ఐఆర్ ప్రధాన ఉద్దేశం ఇదే.. ఆందోళన వద్దు



**హైదరాబాద్, జూన్ 20:** తెలంగాణ రాష్ట్రంలో జూన్ 25 నుంచి ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభమవుతుందని ప్రధాన ఎన్నికల అధికారి(సీఈవో) సుదర్శన్ రెడ్డి తెలిపారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. జూన్ 15 నుంచి జూన్24 వరకు సన్నాహక ప్రక్రియ జరుగుతుందని.. జూన్ 25 నుంచి జులై 24 వరకు ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫాం అందజేసే ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. మిస్‌అయిన వారికి ఫాం 6తో మరోమారు ఎన్యూమరేట్ ఫాం అందజేసే అవకాశం ఉందన్నారు. జులై 31న ఓటర్ల డ్రాఫ్ట్ జాబితా విడుదల చేస్తామని, జులై 31 నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాల స్వీకరణ ఉంటుం దన్నారు. అన్ని రాజకీయ పార్టీలు సహకరి ంచాలని విజ్ఞప్తి చేశారు. అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితా విడుదల చేయనున్నట్లు సీఈవో వెల్లడించారు.ఓటరు జాబితాలో ప్రస్తుతం ఎక్కడ ఓటు ఉందో అదే అడ్రస్‌కు ఎన్యూ మరేషన్ ఫాం వస్తుందని సీఈవో తెలిపారు. ఆ అడ్రస్‌లో ఓటరు లేకపోతే అతని ఓటు అక్కడ తొలగించబడుతుందన్నారు. ప్రస్తుతం ఉంటున్న అడ్రస్‌తో మళ్లీ ఓటరు ఫాం8తో ఓటును ఎన్రోల్మెంట్ చేసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. ఎస్ఐఆర్ ప్రధాన ఉద్దేశం ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేయడమని.. ఓటర్లను తొలగించడం కాదు స్పష్టం చేశారు. 24 ఏళ్లుగా ఇక్కడ ఓటర్ జాబితా శుద్ధి జరగలేదన్నారు. ఈ మధ్య కాలంలో చాలా మంది మృతి చెంది ఉంటారని.. కొందరు వలస వెళ్లి ఉంటారని తెలిపారు. వాటన్నింటినీ సరి చేయడమే ఉద్దేశమని చెప్పారు. ఇందులో రాజకీయ ప్రేరేపితం ఏమీ ఉందన్నారు.

## ఇది ప్రజా పాలన కాదు.. ప్రజలను హింసించే పాలన.



**కుత్బుల్లాపూర్, జూన్ 20:** కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తుందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద తీవ్రంగా మండిపడ్డారు. ప్రజలను నానాయాతన పెడుతూ రాష్ట్రాన్ని పూర్తిగా అధోగతి పాలు చేస్తుందని విమర్శించారు. హైదరాబాద్ చింతల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఉదయం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేపీ వివేకానంద మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ది పేరుకే ప్రజాపాలన.. వాస్తవానికి ప్రజలను హింసించే పాలనగా సాగుతుందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాక్షస పాలన సాగుతోందని ఆరోపించారు.పదేళ్ల పాటు కేసీఆర్ పాలనలో వ్యవసాయాన్ని ఒక పండుగలా మార్చారని కేపీ వివేకానంద తెలిపారు. రైతులను కంటికి రెప్పలా కాపాడుకుంటూ, కడుపులో పెట్టుకుని చూసుకున్నారని కొనియాడారు. సకాలంలో విత్తనాలు, యూరియా అందించడమే కాకుండా, సమయానికి 'రైతు బంధు' డబ్బులను నేరుగా రైతుల ఖాతాల్లో వేసి, పండించిన ప్రతి ధాన్యాన్ని కొనుగోలు చేసి అన్నదాతకు బంగారు బాట వేశారని పేర్కొన్నారు. కానీ నేడు రేవంత్ రెడ్డి రాక్షస పరిపాలనలో రైతులంతా హింసను అనుభవిస్తున్నారని, రైతులకు నరకం చూపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఆస్తుల పరిరక్షణ కోసమే హైడ్రా డిజాస్టర్ కోసం కాదు



**హైదరాబాద్, జూన్ 20, :** హైడ్రాపై దుష్ప్రచారం జరుగుతోందని.. పనిగట్టుకుని తమను కొందరు బద్నాం చేస్తున్నారని హైడ్రా కమిషనర్ రంగనాథ్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం ఉండాలని తెలిపారు. దోపిడీకి గురికాకుండా ఉండాలని ప్రత్యేక తెలంగాణ కోసం ఇక్కడి ప్రజలు కొట్లాడారని తెలిపారు. హైడ్రా ద్వారా లక్ష పదివేల కోట్ల ఆస్తులు కాపాడమని వివరించారు. (శనివారం) హైదరాబాద్ వేదికగా రంగనాథ్ మీడియాతో మాట్లాడారు. హైడ్రా ద్వారా 600 ఆపరేషన్స్ పూర్తి చేశామని తెలిపారు. చట్టం అందరికీ ఒకటేనని... హైడ్రా ఎవరికీ పక్షపాతంగా వ్యవహరించదని స్పష్టం చేశారు. హైడ్రా డిజాస్టర్ కోసం కాదని.. ఆస్తుల పరిరక్షణ కోసమేనని తేల్చిచెప్పారు. సోషల్ మీడియాలో తమపై అసత్యాలు చెబుతున్నారని అన్నారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడుతున్నాం..ప్రభుత్వ ఆస్తులను కాపాడటంలో రాష్ట్ర సర్కార్ హైడ్రాకి ఫ్రీడం ఇచ్చిందని రంగానాథ్ వెల్లడించారు. పార్టీలకు అతీతంగా తాము పనులు చేస్తున్నామని చెప్పుకొచ్చారు. భాగ్యనగరంలో ఫాతిమా కాలేజీ లాగా చాలా స్కూల్స్, కాలేజీలు ఉన్నాయని ప్రస్తావించారు. హైడ్రాకి ఎంఐఎం, కాంగ్రెస్ అందరూ ఒకటేనని తేల్చిచెప్పారు. హైడ్రా ఎప్పుడూ సైలెంట్‌గా ఉండదన్నారు. హైడ్రా రాత్రికి రాత్రి నిర్మాణాలను కూలగొడుతుందనేది తప్పుడు ప్రచారమని తెలిపారు. గుడిసెలు వేసిన చోట మీడియాని తీసుకెళ్లి చూపించామని... అప్పుడు ఉన్నదాని కంటే వంద గుడిసెలు ఎక్కువగా పెరిగాయని.. దాని వెనకాల కొన్ని శక్తులు ఉన్నాయని చెప్పుకొచ్చారు. గుడిసెలు వేసిన చోట జెన్యూన్‌గా ఉన్నాయా లేదా పరిశీలించి... డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.మంచి చేయాలంటే కొందరికి చెడు జరుగుతుంది.. హైడ్రా రాకపోతే... ఇప్పుడు ఉన్నవి కూడా కనపడకుండా పోయేవని రంగనాథ్ తెలిపారు. ఈ నెల 9వ తేదీన భాగ్యనగరంలో కురిసిన వర్షానికి సిటీ అతలాకుతలం అయిందని అన్నారు. లక్షమందికి మంచి చేయాలంటే కొందరికి చెడు జరుగుతుందని తెలిపారు. హైడ్రా తప్పు ఉంటే తప్పకుండా క్షమాపణ అడుగుతామని చెప్పారు. హైడ్రా చాలా నేర్చుకుందని, చాలా పనులు పూర్తి చేసిందని... తప్పులు జరిగితే.. సరి చేసుకుంటూ ముందుకెళ్తుందని వివరించారు. హైడ్రా సెటిల్‌మెంట్లకు అడ్డాగా కాకుండా.. రాజకీయాలకు అతీతంగా ముందుకు పోతుందని స్పష్టం చేశారు. ప్రజలకు నమ్మకం, విశ్వాసం కలిగేంచే విధంగా హైడ్రా పని చేస్తుందని రంగనాథ్ పేర్కొన్నారు.

## నరహరి బ్యాంకు లాకర్లలోని రూ.1.50 కోట్ల నగదు, 2.5 కిలోల బంగారం స్వాధీనం



**హైదరాబాద్, జూన్ 20, :** ల్యాండ్స్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరిపై అవినీతి, అక్రమాస్తుల ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆయనపై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ దర్యాప్తును ఏసీబీ అధికారులు ముమ్మరం చేశారు. ఈక్రమంలో నరహరికి సంబంధించిన బ్యాంకు లాకర్లను బద్దలు కొట్టి కీలక ఆధారాలను సేకరించారు. నరహరి కుటుంబ సభ్యులు లాకర్ తాళాలను అందించేందుకు సహకరించకపోవడంతో, న్యాయస్థానం అనుమతి తీసుకుని ఏసీబీ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. కోర్టు జారీ చేసిన సెర్చ్ వారెంట్ ఆధారంగా బ్యాంకు అధికారుల సమక్షంలో లాకర్లను బద్దలు కొట్టి తనిఖీలు నిర్వహించారు. ఈ ప్రక్రియ మొత్తం నిబంధనల ప్రకారం జరిగింది.ఈ సోదాల సమయంలో లాకర్లలో భారీ మొత్తంలో నగదు, బంగారం ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. లాకర్‌లో రూ.1.50 కోట్ల నగదుతో పాటు సుమారు రెండున్నర కిలోల బంగారం లభించింది. స్వాధీనం చేసుకున్న బంగారం విలువను అధికారులు అంచనా వేస్తున్నారు. లాకర్లలో దొరికిన నగదు, బంగారానికి సంబంధించిన పత్రాలను కూడా ఏసీబీ అధికారులు పరిశీలిస్తున్నారు.అవసరమైతే ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన బ్యాంకు రికార్డులు, పన్ను వివరాలను కూడా పరిశీలించే అవకాశం ఉంది.

## టీజీ-20 లీగ్‌ను హెచ్‌సీఏ అక్రమంగా నిర్వహిస్తోంది



**హైదరాబాద్:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌పై తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ధరమ్ గురువారెడ్డి మరోసారి సీఐడీకి ఫిర్యాదు చేశారు. టీజీ-20 లీగ్ కోసం హెచ్‌సీఏ ఏర్పాటు చేసిన బ్యాంక్ అకౌంట్లను వెంటనే నిలిపివేయాలని సీఐడీని ఆయన కోరారు. ఫిర్యాదు అనంతరం గురువారెడ్డి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెచ్‌సీఏ నిర్వహిస్తున్న టీజీ-20 లీగ్‌కు అనుమతి లేదని, వెంటనే దాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. టీజీ-20 లీగ్‌ను హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అక్రమంగా నిర్వహిస్తోందన్నారు.ఈ లీగ్‌కు హెచ్‌సీఏ జనరల్ బాడీ ఆమోదం లేదని, జనరల్ బాడీ ద్వారా ఎన్నుకున్న చైర్మన్ కూడా లేరని గురువారెడ్డి ఆరోపించారు. అలాగే ఈ లీగ్ కోసం హెచ్‌సీఏ తెరిచిన బ్యాంక్ ఖాతాను నిర్వహించడానికీ అనుమతులు లేవన్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ పబ్లిక్ అకౌంటబిలిటీ సంస్థ అని, కానీ బైలాస్, రూల్స్‌కు విరుద్ధంగా నిర్వాహకులు నడుచుకుంటున్నారని మండిపడ్డారు. టీజీ-20 లీగ్ ఆటగాళ్ల ఎంపికలోనూ బీసీసీఐ, ఐపీఎల్ నిబంధనలు పాటించలేదని గురువారెడ్డి విమర్శించారు. టీసీఏతో కలిసి లీగ్‌లను నిర్వహించాలని కోర్టు ఆదేశాలు ఉన్నా హెచ్‌సీఏ పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. కార్పొరేట్ కంపెనీలను ఇన్‌వాల్వ్ చేసి తెలంగాణ జిల్లాల పేరుతో హెచ్‌సీఏ లబ్ధి పొందాలని చూస్తోందని ఆయన ఆరోపించారు. ఈ సందర్భంగా అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న బ్యాంక్ ఖాతాలను వెంటనే ఫ్రీజ్ చేయాలని గురువారెడ్డి డిమాండ్ చేశారు. రూ.46 కోట్ల నుంచి రూ.50 కోట్ల వరకు అంచనా మొత్తంతో బ్యాంక్ ఖాతా ఉందని, దాన్ని వెంటనే ఫ్రీజ్ చేయాలని సీఐడీని కోరినట్లు తెలిపారు. రూ.50 కోట్ల మేర అక్రమ లావాదేవీలు జరిగే అవకాశం ఉందని, అందుకే అకౌంట్‌ను నిలిపివేయాలని సీఐడీని కోరినట్లు పేర్కొన్నారు. మరోవైపు హెచ్‌సీఏలోని అపెక్స్, ప్రభుత్వ సభ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీఐడీకి విజ్ఞప్తి చేసినట్లు టీసీఏ జనరల్ సెక్రటరీ ధరమ్ గురువారెడ్డి తెలిపారు.

## ప్రాజెక్టులపై కేసులు వేసి అడ్డుకున్నది కాంగ్రెస్ నాయకులే



**జడ్చర్ల :** బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన నీటి పారుదల ప్రాజెక్టుల పై నాడు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ అడుగడుగునా అడ్డుకుందని మాజీ మంత్రి డా.సి.లక్ష్మారెడ్డి ఆరోపించారు. మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల పట్టణం అంబేద్కర్ కళా భవన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు జిల్లా ప్రజలకు వరంలాంటిదని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత చేపట్టిన మొట్టమొదటి ఇరిగేషన్ ప్రాజెక్టు అని గుర్తు చేశారు.పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు భూసేకరణకు కాంగ్రెస్ నాయకులు కేసులు వేసి అడ్డుకున్నారని ఆరోపించారు. భూసేకరణ విషయంలో కూడా కేవలం కాంగ్రెస్ నాయకులు కేసులు వేసి ప్రాజెక్టు పనులు ముందుకు సాగనివ్వలేదని పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఉద్దండాపూర్ ప్రాజెక్టును మొత్తం మూడు ప్యాకేజీలుగా పనులు చేపట్టామని వివరించారు. రైతులకు ఎక్కువ ప్రయోజనం చేకూర్చేందుకు ఉద్దండాపూర్ పనులు ఆలస్యంగా ప్రారంభించామని వెల్లడించారు.దాదపు ఐదు వేల కోట్లు ఉద్దండపూర్ కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం ఖర్చు చేసిందని, గడిచిన రెండున్నర కాంగ్రెస్ పాలనలో ఐదు వందల కోట్లు మాత్రమే రిలీజ్ చేశారని ఆరోపించారు. రైతులకు ఎకరానికి రూ.11 లక్షల నుంచి 16 లక్షల ముప్పై వేలకు పరిహారం కింద అందజేశామని వివరించారు. ఎన్నికల్లో రూ. 25 లక్షలకు ప్యాకేజీ పెంచుతామని కాంగ్రెస్ మాట ఇచ్చి, ఒక్క రూపాయి కూడా పెంచలేదని విమర్శించారు. ఆర్ అండ్ ఆర్ సెంటర్ కోసం అందరినీ ఒప్పించి మూడు వందల ఎకరాలు సేకరించామని వెల్లడిం చారు. భూ నిర్వాసితులకు అడుగడుగునా అండగా ఉన్నామని తెలిపారు. ఉద్దండపూర్ విషయంలో రెండున్నర ఏండ్లు రాజకీయం చేయలేదని, నిర్వాసితులు బాగుపడటమే తమ పార్టీ ధ్యేయమని స్పష్టం చేశారు.తెలంగాణ రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తోందని పద్మా దేవేందర్ రెడ్డి విమర్శించారు. శనివారం మెదక్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రం నిర్దేశించిన కోటా మేరకే పంటలు కొనుగోలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం 70 లక్షల మంది రైతులకు తీవ్ర అన్యాయం చేయడమేనని అన్నారు.బీఆర్ఎస్ హయాంలో రైతు సంక్షేమానికి పెద్దపీట వేయగా, ప్రస్తుతం రైతులను సంక్షోభంలోకి నెట్టే నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. రైతులు పండించిన ప్రతి పంటను చివరి గింజ వరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో రైతే కేంద్రబిందువుగా పాలన సాగిందని.. రైతుబంధు, రైతుబీమా, 24 గంటల ఉచిత విద్యుత్, కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ కాకతీయ వంటి కార్యక్రమాలతో తెలంగాణ వ్యవసాయ రంగం దేశానికి ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు.రైతుల ఖాతాల్లో నేరుగా లక్ష కోట్లకుపైగా జమ చేసి, రైతు సంక్షేమానికి పెద్దపీట వేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని తెలిపారు. ఎన్నికల సమయంలో అన్ని పంటలను చివరి గింజ సమయంలో అన్ని పంటలను చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని, బోనస్ ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు చేతులెత్తేయడం రైతులను మోసం చేయడమేనని విమర్శించారు. పంటల కొనుగోళ్ల విషయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రైతులను దళారుల దయాదాక్షిణ్యాలకు వదిలేస్తోందని ఆరోపించారు.గతంలో కేంద్రం కొనుగోలు చేయని పంటలను కూడా రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులకు అండగా నిలిచిందని గుర్తు చేశారు. ఇప్పుడు కేంద్రం కోటా మేరకే కొనుగోలు చేస్తామనడం అత్యంత బాధాకరమని అన్నారు. రైతుల ప్రయోజనాల కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సిన రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత నుంచి తప్పించుకోవడం సరికాదని చెప్పారు. తెలంగాణ రైతులు పండించే ప్రతీ పంటను చివరి గింజ వరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల పట్ల ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోకపోతే బీఆర్ఎస్ పార్టీ రైతులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తుందని హెచ్చరించారు.


Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at RAMANI WEB OFFSET PRINTERS, Auto Nagar, Bommakal, Karimnagar, Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONS, Ankireddypally, Thanggellapally, Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443 Contact No : 9440032006. MAIL ID : Kumaraswamyrayinipatla@gmail.com